చదవండి... చదివించండి... 1952
విశాలాంధ్ర
జాతీయ తెలుగు దినపత్రిక
చందా వివరాలు
సంవత్సరం చందా రూ. 1000/-లు
అర్ధ సంవత్సరం చందా రూ. 500/-లు
3 నెలల చందా రూ. 250/-లు
నెల బిల్లు రూ. 95/-లు
విడి పత్రిక రూ. 3/-లు
ఆదివారం రూ. 4/-లు
వివరములకు సంప్రదించండి 7674022988

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
38 Securing Your Future
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి : 66 | సంచిక : 244 | శనివారం 24-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

డొల్ల పలుకులు



- మోడీకి పట్టని నీరవ్ కంపెనీలు
- ఎన్‌డీఏ హయాంలోనే హామీ పత్రాలు
- రూ.9.5 లక్షలకు చేరిన మొండి బకాయిలు
- బొగ్గు దిగుమతుల్లో భారీ మోసాలు

న్యూఢిల్లీ : దాదాపు 3 లక్షలకు పైగా డొల్ల కంపెనీలను తమ ప్రభుత్వం రద్దు చేసిందంటూ ప్రధాని మోడీ పదేపదే గొప్పలు చెప్పారు. వీటిలో అత్యధిక డొల్ల కంపెనీలు బోర్డు తిప్పేసినవే అని పలువురు విశ్లేషించారు. అయితే ఈ డొల్ల కంపెనీలలో నీరవ్ మోడీ, చోక్సీలకు సంబంధించిన దాదాపు 200 కంపెనీలకు స్థానం దక్కలేదు. మోడీ, చోక్సీలు బ్యాంకుల నుంచి మోస పూరితంగా తీసుకున్న దాదాపు రు.11,400 కోట్ల మొత్తాన్ని ఈ కంపెనీలలోనే పెట్టుబడులు పెట్టారన్న విషయాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్‌లు వెల్లడించాయి. ఇంటర్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ మెస్సేజింగ్ సిస్టమ్ (స్విఫ్ట్)ను స్వతంత్రంగా నిర్వహించగల సామర్థ్యాన్ని తమ కంపెనీ ఉద్యోగులకు కల్పించి వారిని నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీ బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రవేశపెట్టటం ద్వారా ఈ మోసానికి పాల్పడ్డారన్నది వాస్తవం. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన వివిధ అధికారుల లాగిన్ సమాచారాన్ని ఉపయోగించి వీరు ఈ మోసానికి పాల్పడ్డారన్న విషయం బ్యాంకింగ్ వ్యవస్థ పెట్టుబడిదారుల చేతుల్లో ఏ విధంగా చిక్కుకున్నదీ విశదం చేస్తోంది. బ్యాంకులు అంతర్గత సంస్కరణలకు కచ్చితంగా కట్టుబడి తమ పాలనావిధానాలను మెరుగుపర్చుకోవాలన్న షరతుపై గత ఏడాది ఆరంభంలో బ్యాంకులకు పెట్టుబడులు(రీ కాపిటలైజేషన్) అందచేస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించిన సమయంలోనే పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి మోసపూరితంగా భారీ సంఖ్యలో హామీపత్రాలు (ఎల్‌ఓయూ)లు జారీ అయ్యాయి. కేంద్రం అందచేసిన పెట్టుబడుల్లో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రు.5 వేల కోట్లు అందాయి. అయితే పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇందుకు మూడు రెట్లకు పైగా ఇప్పటికే నష్టపోయింది. రానున్న ఏడాది, రెండేండ్ల కాలంలో బ్యాంకులకు రు.2 లక్షల కోట్ల మేర పెట్టుబడులు సమకూర్చాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ తాజా పెట్టుబడుల్లో ఒక్క రూపాయి కూడా మోసాలు కేసుల్లోకి, ఎన్‌పీఏలలోకి పోకూడదనే ఎవరైనా ఆశిస్తారు. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రకటిత ఎన్‌పీఏలు (మొండి బకాయిలు) రు.9.5 లక్షల కోట్ల పైమాటే. ఇందులో దాదాపు 30 శాతం మేర గత లాభాల నుంచి

- మిగతా 2 లో

రాజ్యసభ ఎన్నికలు

నగరా మోగింది







- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- 16 రాష్ట్రాల్లో 58 స్థానాలకు మార్చి 23న
- ఏపీ, తెలంగాణల్లో మూడేసి స్థానాలకు
- రిటైర్ కానున్న చిరంజీవి, రేణుకాచౌదరి, దేవేంద్ర గౌడ్

విశాలాంధ్ర-అమరావతి : ఏపీలో రాజ్యసభకు ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యసభ మూడు స్థానాలకు ఎన్నికల షెడ్యూలును శుక్రవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మార్చి 5న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుంది. 12 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 23న పోలింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికల్లో శాసనసభ్యులే ఓటర్లు. ఏపీ ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికైన ఆరుగురు రాజ్యసభ సభ్యులు ఏప్రిల్ 2న రిటైర్ కానున్నారు. రిటైరయ్యే వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన చిరంజీవి, రేణుక చౌదరి, టీడీపీకి చెందిన దేవేందర్‌గౌడ్‌లు ఉన్నారు. అలాగే తెలంగాణకు కేటాయింపబడ్డ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌కూడా రిటైర్ అవుతున్నారు. ఇదిలా ఉండగా ఏపీ అసెంబ్లీలో బలాబలాలను బట్టి మూడు స్థానాల్లో రెండు స్థానాలు టీడీపీకి, ఒకస్థానం వైసీపీకి దక్కనున్నాయి. మొత్తం 175 స్థానాల్లో 103 మంది టీడీపీ, 67 మంది వైసీపీ, బీజేపీకి 4గురు, ఇండిపెండెంట్‌గా ఒకరు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇండిపెండెంట్‌గా ఎన్నికైన చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ టీడీపీలో చేరారు. వైసీపీ నుండి 23 మంది టీడీపీలోకి ఫిరాయించారు. వారిలో మరణించిన భూమా నాగిరెడ్డి స్థానంలో ఆయన సోదరుడి కుమారుడు భూమా బ్రహ్మానందరెడ్డి ఎన్నికయ్యారు. దీంతో టీడీపీ బలం 127కు చేరుకుంది. మిత్రపక్షంగా ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు నలుగురును కలుపుకుంటే 131కి చేరుతుంది. ఫిరాయించిన వారు పోగా వైసీపీకి 44 మంది ఎమ్మెల్యేలు

- మిగతా 2 లో

వయో పరిమితి పెంచిన ఆర్‌ఆర్‌బీ

ప్రాంతీయ భాషల్లో ప్రశ్నాపత్రాలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నిరుద్యోగులకు శుభవార్త. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బీ) ద్వారా గ్రూప్ సి, గ్రూప్ డి విభాగాల్లో భర్తీ చేయదలచిన ఉద్యోగాలకు వయోపరిమితిని కేంద్రం రెండేళ్లు పెంపుదల చేసింది. దేశవ్యాప్తంగా రైల్వేశాఖలో లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు రైల్వేమంత్రి పీయూష్‌గోయల్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. వీటిలో గ్రూప్ డి పోస్టులు దాదాపు 63వేలు, గ్రూప్ సి విభాగంలో అసిస్టెంట్ లోకో పైలెట్లు, టెక్నీషన్స్ ఖాళీలు 26,502 ఉన్నాయి. గ్రూప్ డి విభాగంలో గ్యాంగ్‌మెన్, స్విచ్‌మెన్, ట్రాక్‌మెన్, కేబిన్‌మెన్, వెల్డర్, హెల్పర్, పోర్టర్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. అయితే గ్రూప్ సి విభాగంలో అసిస్టెంట్ లోకోపైలెట్, లోకోపైలెట్ ఉద్యోగాల్లో అన్ రిజర్వ్‌డ్ కేటగిరిలో అభ్యర్థుల వయసును 28 ఏళ్ల నుంచి 30 ఏళ్లకు పెంచింది. అలాగే ఓబీసీ కేటగిరిలో 31 ఏళ్ల పరిమితిని 33 ఏళ్లకు ఎస్సీ/ఎస్టీ కేటగిరిలో 33 ఏళ్లుగా ఉండే పరిమితిని 35 ఏళ్లకు పెంపుదల చేసింది. అదేవిధంగా గ్రూప్-డి విభాగంలో కూడా ఇదేరీతిలో రెండేళ్లు

- మిగతా 2 లో

నేటి నుంచి సీఐఐ భాగస్వామ్య సదస్సు

- ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి
- హాజరుకానున్న ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- 50 దేశాల ప్రతినిధులు, 18 మంది విదేశీ వాణిజ్య మంత్రులు



విశాలాంధ్ర-విశాఖ సిటీ : ఆంధ్ర రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే ప్రధాన లక్ష్యంతో గత రెండేళ్లుగా జరుపుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ ఏడాది కూడా విశాఖ పట్టణమే వేదికైంది. శనివారం నుంచి నగరంలోని ఏపీఐఐసీ మైదానంలో మూడు రోజుల పాటు సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మరోమారు ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఇప్పటికే నగరానికి చేరుకున్న ఉప రాష్ట్రపతి ఎం.వెం కయ్యానాయుడు ఈ సదస్సును ప్రారంభించ నున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, 50 దేశాల నుంచి ప్రతినిధులు, 18 దేశాలకు చెందిన వాణిజ్య మంత్రులు హాజరుకానున్నారు. వీరికి భోజన, వసతి, రవాణా ఏర్పాట్లను జిల్లా అధికారులు లైజనింగ్ అధికారులుగా ఏర్పడి విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు సీఐఐ పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మరోమారు మంత్రులు అమర్‌నాథ్‌రెడ్డి, గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ హరిబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, కమిషనర్ సిద్దార్థ జైన్, ఏపీఐఐసీ ఎండీ బాబు, ఇతర అధికారులు వేదిక ఏర్పాట్లను పరిశీలించారు.

నేటి ఉదయం నుండి కార్యక్రమాలు

ఉదయం 10 గంటలకు ప్రతినిధుల

- మిగతా 2 లో

యూపీలో దళిత యువతి

సజీవ దహనం

పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ఉనో జిల్లాలో గురువారం రాత్రి ఒక దళిత యువతిని దుండగులు అతి దారుణంగా కాల్చి చంపారు. 18 ఏళ్ల మోనీ గురువారం సైకిల్‌పై కూరగాయల మార్కెట్‌కు వెళుతుండగా కొంతమంది గుర్తు తెలియని దుండగులు ఆమెను అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆమెను చుట్టుముట్టి పెట్రోల్ పోశారు. ఆ యువతి స్పందించేలోగానే నిప్పటించారు. దీంతో యువతి తనను తాను రక్షించేందుకు ఆ మంటలతోనే సుమారు 100 మీటర్ల మేర పరుగులు తీసింది. కానీ చివరికి కుప్పకూలి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతదేహం పక్కనే సైకిల్ పడిపోయి ఉంది. ఆమె శరీరం వంద శాతం కాలిపోయింది.

సమాచారం అందుకున్న ఐజీ(జోన్) సుజిత్ కుమార్ పాండేతో సహా పోలీసులు ఉన్నతాధికారులు అర్ధరాత్రి సమయంలో ఘటనా స్థలికి చేరుకుని

- మిగతా 2 లో

హోదా సాధనకు 28న వర్సిటీల బంద్

విద్యార్థి, యువజన సంఘాల పిలుపు

2లో

సీమకు చేసిందేమిటి?

- బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఏదీ?
- 6 నుంచి ఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు
- ఏప్రిల్ 20న రాజమండ్రిలో పోరాట సభ
- పోస్టర్‌ను ఆవిష్కరించిన కె రామకృష్ణ



పోస్టర్ విడుదల చేస్తున్న రామకృష్ణ, చలసాని తదితరులు

11లో

4 వేల కోట్లు కేటాయించాలి



వినతి పత్రం ఇచ్చి వస్తున్న కత్తి నరసింహారెడ్డి, ముప్పాళ్ల, తిరుపతిరావు తదితరులు

2లో

- 'అగ్రి' కేసులో కీలక నిందితుల్ని అరెస్టు చేయాలి
- సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబుకు వినతి
- మార్చి 1న బాధితులకు పరిహారం చెల్లింపునకు సీఎం హామీ

సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శిగా రామానాయుడు



3లో

సీపీఐ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శిగా నర్సింహులు



నర్సింహులుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకులు

3లో

మార్చి 2 నుంచి సినిమా థియేటర్లు బంద్

9లో

ఇదీ లోకం!



ఓటుకు నోటు కేసులో అప్రూవర్‌గా మారతా...

సీజేఐకు మత్తయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు మరోసారి తెరపైకొచ్చింది. ఈ కేసులో ఎ-4 ముద్దాయిగా ఉన్న జెరుసలేం మత్తయ్య అప్రూవల్‌గా మారుతానంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. వ్యక్తిగతంగా తన వాదనలను వినిపించడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు డబ్బులు ఇస్తూ నాటి టీడీపీ నేత రేవంత్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని సీజేఐను కోరారు. రెండు కేసుల్లో వాస్తవాలను వెలికి తీయాలని విన్నవించారు. 2015 మేలో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్టీఫెన్‌సన్‌తో రూ.5 కోట్లతో ఒప్పందం కుదుర్చుకొని, తొలివిడతగా రూ.50లక్షలు అందజేసిన విషయం తెలిసిందే. రెండు కేసుల్లో రహస్యాలున్నాయని, వాటిని వెలుగులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు.

స్టీఫెన్‌సన్‌తో చంద్రబాబు మాట్లాడారని తెలిపారు. బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, తనను చంపే కుట్రలు జరుగుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

తెరపైకి మళ్లీ ఈ రిక్షా...




కాలుష్యరహిత రాష్ట్రంగా నవ్యాంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోంది. అందులో భాగంగానే కాలుష్య కారకాలైన వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎప్పటి నుంచో రాష్ట్రంలో అమలుపరచాలనుకుంటున్న ఈ రిక్షాని రాష్ట్ర రహదారులపై తిప్పేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఈరిక్షా అంశం ప్రభుత్వం చుట్టూ చక్కర్లు కొడుతోంది. కేంద్రం సైతం అనుకూలంగా స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం కలిసొచ్చే అంశం కావటంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే ఎప్పటి నుంచో అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్న ఈ రిక్షా ఎప్పుడు రోడ్డు ఎక్కుతుందో అనేది ప్రశ్నార్థకంగా మారింది.

11లో

- సబ్సిడీతో అందించే యోచనలో సర్కార్
- ఉపాధికి మార్గం ఎకో ఫ్రెండ్లీ వాహనం
- అన్నీ అనుకూలిస్తే అతిత్వరలోనే..



హైతీ, జపాన్ మధ్య పలు ఒప్పందాలు



పోర్ట్‌ఆవ్‌ప్రిన్స్ : హైతీ, జపాన్‌లమధ్య పలురంగాలలో 4 సబ్సిడీ కాంట్రాక్టు ఒప్పందాలు కుదిరాయి. వ్యవసాయం, విద్య, తదితర రంగాలలో ఈ ఒప్పందాలు జరిగాయి. వీటి విలువ 400 డాలర్లుగా అంచనా వేశారు. కమ్యూనిటీ ప్రాజెక్టు కింద ఆర్థిక సహాయాన్ని జపాన్ హైతీకి అందిస్తుంది. విద్యార్థులకు ప్రాథమిక విద్యను అందించేందుకుగాను మిక్స్‌డ్ కమ్యూనిస్టు స్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు 103 డాలర్లను జపాన్ సబ్సిడీగా అందజేస్తుంది. హైతీలో విద్యారంగం విస్తరణకు జపాన్ సహకరిస్తుంది. 1989 నుంచి హైతీలో సామాజిక, ఆర్థిక రంగాలలో జపాన్ హైతీకి సహాయం చేస్తున్నది.

మార్చిలో నేపాల్ అధ్యక్ష ఎన్నికలు



కాట్మండ్ : నేపాల్ అధ్యక్ష పదవికి మార్చి 13వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల కమిషన్ తాజాగా ప్రకటించింది. వివిధ రాజకీయ పార్టీలతో గత వారం రోజులుగాచర్చలు జరిపిన అనంతరం ఎన్నికల కమిషన్ ఈ ప్రకటన చేసింది. ప్రధాన కమిషనర్ అధ్యక్షతన అధికారులు సమావేశమై ఈ తేదీని నిర్ణయించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు సంబంధించిన బిల్లును రూపొందించినట్లు ఎన్నికల కమిషన్ ప్రతినిధి నవరాజ్‌దఖల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీచేసే అభ్యర్థులు మార్చి 7వ తేదీన నామినేషన్లు దాఖలు చేయవలసివుంటుంది. 13వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పోలింగ్ జరుగుతుంది.

ఆధునిక సోషలిస్టు నగర నిర్మాణం

చైనా కమ్యూనిస్టు పార్టీ నేతల పిలుపు



బీజింగ్ : బీజింగ్ నగరానికి 100 కి.మీ. దూరంలో నిర్మించనున్న జియాంగన్ న్యూ ఏరియాను (ఆర్థిక జోన్) ఉన్నత ప్రమాణాలు కలిగిన ఆధునిక సోషలిస్టు నగరంగా తీర్చిదిద్దాలని కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ సెంట్రల్ కమిటీ సమావేశం ప్రధాన కార్యదర్శి దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పోలిట్‌బ్యూరో స్టాడింగ్ కమిటీ సభ్యులు పాల్గొని మాట్లాడారు. బీజింగ్‌కు 100 కి.మీ. దూరంలో హెబై రాష్ట్రంలో 2017 ఏప్రిల్‌లో నూతన ఆర్థిక జోన్‌ను స్థాపించారు. షెన్‌జాన్ స్పెషల్ ఎకనమిక్‌జోన్, షాంఘైపుడాంగ్ న్యూ ఏరియా నిర్మాణం తరువాత ఏర్పాటు చేస్తున్న నూతన ఆర్థిక జోన్ ఇది. ఈ జోన్‌ని ఉన్నత ప్రమాణాలుగల ఆధునిక నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఇదొక చరిత్రాత్మక ప్రాజెక్టుగా నిర్మించాలని నాయకులు నిర్ణయించారు. రాజధాని నగరంలో జరిగే కార్యకలాపాలకు భిన్నమైన కార్యక్రమాలను ఈ ప్రాంతంలో నిర్వహించేందుకు ఈ నగరం వీలుకల్పిస్తుందని భావిస్తున్నారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఈ జోన్ నూతన ఛోదకశక్తిగా పనిచేస్తుందని సమావేశం అనంతరం విడుదలైన ప్రకటన తెలిపింది. ఆ ప్రాంతాన్ని లోతుగా పరిశీలించిన తరువాత నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం పురోగతి దశలో ఉంది. చైనా లక్షణాలతో ప్రపంచ దృక్పథాన్ని అంతర్జాతీయ ప్రమాణాలను ఈ ఏరియా కలిగివుంటుందని ఆ ప్రకటన తెలిపింది. డిజిటల్, ఇంటిలిజెంట్ సిటీగా ఈ ప్రాంతాన్ని రూపొందించేందుకు కృషి చేయాలని అదే సమయంలో పచ్చదనం నిండిన అభివృద్ధిని సాధించాలని నిర్ణయించినట్టు ఆ ప్రకటన పేర్కొంది.

ఛాద్ సరస్సు రక్షణకు యునెస్కో చొరవ

పారిస్ : ఆఫ్రికాలో ఛాద్ సరస్సును పరిరక్షించేందుకు యునెస్కో చొరవ తీసుకున్నది. నైజీరియా రాజధాని అబూజాలో వచ్చేవారం జరగనున్న సదస్సులో యునెస్కో ప్రాజెక్టు నివేదికను సమర్పించి చర్చకు ప్రతిపాదించనున్నది. ఈ సరస్సుపైన అవగాహన కల్పించడంతోపాటు సరస్సు దిగువనవున్న మాగాణి భూముల పునరుద్ధరణ ఆ ప్రాంతంలో తిరిగి వనాల పెంపకం, వన్యమృగాల సంరక్షణ తదితర అంశాలను ఈ ప్రాజెక్టులో పొందుపరిచారు. ఛాద్ సరస్సు ప్రాంత అభివృద్ధికి ఏర్పాటు చేసిన కమిషన్‌తో కలిసి యునెస్కో ఈ ప్రాజెక్టును అమలుచేస్తుంది. ఆఫ్రికన్ అభివృద్ధి బ్యాంక్ ఇందుకు అవసరమైన నిధులను సమకూరుస్తుంది. ఈ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తిచేయవలసివుంటుంది. ఈ ప్రాంతం సహజసిద్ధమైన, సామాజిక ఆర్థిక, సాంస్కృతిక వనరులకు నెలవుగా ఉన్నదని ప్రాజెక్టుకు సంబంధించి వెలువడిన బులెటిన్ తెలియజేసింది. సరస్సు సరిహద్దులలోగల దేశాలు కలిసి పనిచేయాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ సరస్సు ద్వారా కామెరూన్, నైగర్, నైజీరియా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, ఛాద్ దేశాలలో 40 మిలియన్ల ప్రజలు తాగునీటికి ఆధారపడివున్నారు. 50 ఏళ్ల కాలంలో ఈ ప్రాంతంలో వర్షాలు గణనీయంగా పడిపోయాయి. సరస్సు 90 శాతానికిపైగా అంతరించిపోయింది. ఈనేపథ్యంలో సరస్సును పునరుద్ధరించేందుకు యునెస్కో నడుం బిగించింది.

మొరేల్స్‌కు పలు దేశాల మద్దతు



లాపాజ్ : బొలీవియా మాజీ అధ్యక్షుడు ఎ.ఒ. మొరేల్స్ 2019 అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనేందుకు పలు దేశాలు తమ మద్దతును ప్రకటించాయి. ప్రస్తుతం బొలీవియాలో పరిస్థితులన్నీ ఎంతగానో మార్పు చెందాయని బొలీవియాకు అనుకూలంగా మాడ్రిడ్‌లో జరిగిన సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో వామపక్ష నాయకులు అనేకమంది పాల్గొన్నారు. స్పెయిన్ మాజీ అధ్యక్షుడు జోస్‌లూయిస్ రొడ్రిగుయిజ్ జపటిరొ, పార్లమెంటు నాయకుడు పాబ్లోఇగ్లెసి యాస్ తదితరులు పాల్గొన్నారు. జోస్‌లూయిస్ మాట్లాడుతూ మొరేల్స్‌తో తనకుగల రాజకీయ అనుబంధాన్ని వివరించారు. బొలీవియా అభివృద్ధికి అంకితభావంతో కృషి చేసిన వినమ్రతగల నేత అని ప్రశంసించారు. మొరేల్స్ కాలంలో బొలీవియా సాధించిన అభివృద్ధిని తాను చూస్తున్నానని జోస్‌లూయిస్ అన్నారు. ఇగ్లెసియాస్ మాట్లాడుతూ బొలీవియా సాధించిన ఆర్థిక విజయాలను ఆయన ప్రధానంగా పేర్కొన్నారు. మొరేల్స్ ప్రభుత్వం స్త్రీ, పురుష మధ్య సమానత్వం సాధించేందుకు అనేక విధానాలను ప్రవేశపెట్టారని ఆయన అన్నారు. మొరేల్స్ అధికారానికి వచ్చిన తరువాత దేశంలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని, ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగిందని చెప్పారు. బొలీవియా చరిత్రలో మొరేల్స్ ఉత్తమమైన అధ్యక్షుడని ఆయన ప్రశంసించారు. 2019 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన నామినేషన్ చేయడానికి తామంతా తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. ఈక్విడార్ మాజీ అధ్యక్షుడు రఫెల్ కొర్రియా తన సందేశాన్ని సోషల్ నెట్‌వర్క్ ద్వారా పంపారు. ఈ సందర్భంగా 88 రాజకీయ, సామాజిక సంస్థల నాయకులు మొరేల్స్‌కి తమ మద్దతు తెలియజేస్తూ సంతకాలు చేశారు.

ఉ. కొరియాపై మళ్లీ అమెరికా ఆంక్షలు?

సామరస్యాన్ని చెడగొట్టనున్న ట్రంప్



సియోల్ : ఉభయ కొరియాల మధ్య సామరస్యత నెలకొనివున్న దశలో ఉత్తరకొరియాపైన మరోసారి ఆంక్షలు కొరడాను ఝళిపించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించినట్టుగా పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపారు. ఈసారి మరిన్ని కఠినమైన ఆంక్షలు ఉండవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఇటీవల దక్షిణకొరియాలో జరిగిన వింటర్ ఒలింపిక్స్‌కి ఉత్తరకొరియా క్రీడాబృందాన్ని, సాంస్కృతిక బృందాన్ని ఆదేశ అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్ పంపారు. అంతేకాదు.. ఆయన సోదరిని కూడా ఒలింపిక్స్‌కి పంపారు. రెండు కొరియాల క్రీడా బృందాలు కలిసి ఒలింపిక్స్ మార్చ్ నిర్వహించాయి. దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్, కిమ్‌జాంగ్‌ఉన్‌ల మధ్య చర్చలు జరిగేందుకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ దశలో ట్రంప్ మరోసారి ఉత్తర కొరియాపై విరుచుకుపడాలని ప్రయత్నిస్తున్నది. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ సియోల్‌లో జరిగిన ఒలింపిక్స్‌కు హాజరైన సందర్భంగా మరోసారి ఆంక్షల ప్రణాళికవుందని సూచనప్రాయంగా వెల్లడించారు. దక్షిణకొరియాతో సంప్రదింపులు జరిపేందుకు సుహృద్భావ వాతావరణం కోసం చూస్తున్నానని కిమ్ ఇటీవలనే చెప్పారు. గత ఏడాది ఉత్తరకొరియా పలుమార్లు అణు క్షిపణులను ప్రయోగించిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ఆంక్షలు విధించింది. ట్రంప్ కుమార్తె ఇవాంక త్వరలో దక్షిణకొరియాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగానే అమెరికా ఆంక్షలను ప్రకటించే అవకాశంవుందని భావిస్తున్నారు.



ఆస్ట్రేలియా ఉప ప్రధాని రాజీనామా

సిడ్నీ : లైంగికదాడికి సంబంధించిన ఆరోపణల్లో కూరుకుపోయిన ఆస్ట్రేలియా ఉపప్రధాని బర్నీబి జాయిస్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. ఆయన తన వద్ద పనిచేసే సహాయకురాలితో శారీరకసంబంధాలు ఏర్పాటు చేసుకున్నారని ఫలితంగా ఆమె ప్రస్తుతం గర్భిణి అని ఆయనపైన తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రతిపక్షాలు, పాలకపార్టీలోని పలువురు ఆయన రాజీనామాకు డిమాండ్ చేశారు. ఎట్టకేలకు జాయిస్ తన రాజీనామా ప్రకటించారు. తాత్కాలికంగా ఈ గొడవనుంచి దూరంగా ఉంటానని అయితే అధికారంలో తన స్థానం తిరస్కరించలేనిదని ఆయన అన్నారు. ఇక్కడ జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన తన రాజీనామాను ప్రకటించారు.

మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణం

వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దుల్లో గోడను నిర్మించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు అమెరికా ప్రభుత్వం తెలియజేసింది. 1990లలో ఏర్పాటు చేసిన ఒక అడ్డుగోడను తొలగించి దాని స్థానంలో ఎత్తయిన గోడను నిర్మిస్తున్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ప్రచారం సందర్భంగానే మెక్సికో నుంచి తమ దేశంలోకి ఎవరూ రాకుండా నిలువరించేందుకు గోడ నిర్మిస్తానని ప్రకటించారు.అధికారం చేపట్టిన తరువాత కూడా పలుమార్లు ఈ అంశాన్ని ప్రస్తావించారు. కాలిఫోర్నియా, మెక్సికో మధ్య సరిహద్దుల్లో ఈ గోడను నిర్మిస్తున్నారు. దాదాపు 3 కి.మీ. పొడవున గోడను నిర్మిస్తారు. 18 మిలియన్ డాలర్లు గోడ నిర్మాణానికి ఖర్చు చేస్తున్నట్టుగా తెలుస్తోంది.



వయో పరిమితి పెంచిన ఆర్‌ఆర్‌బీ

(మొదటిపేజీ తరువాయి)

పొడిగించింది. అన్‌రిజర్వ్‌డ్ కేటగిరిలో 28 ఏళ్ల నుంచి 30 ఏళ్లకు, ఓబీసీ కేటగిరిలో 34 ఏళ్ల నుంచి 36 ఏళ్లకు, ఎస్సీ/ఎస్టీ కేటగిరిలో 36 పరిమితిని 38 ఏళ్లకు పెంచింది. బీహార్‌లో నిరుద్యోగులు వయోపరిమితి పెంచాలని చేసిన ఆందోళన ఫలితంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక ప్రశ్నాపత్రాల్లో కూడా ప్రాంతీయ భాషల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. ఇప్పటి వరకూ ఇంగ్లీషు, హిందీ భాషల్లో ఉండే ప్రశ్నాపత్రాలను స్థానిక భాషల్లో ముద్రించనున్నారు. రానున్న రోజుల్లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, ఒడియా, బంగ్లా.. ఇలా ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ప్రశ్నాపత్రాలుంటాయని అధికారులు తెలిపారు.

సజీవ దహనం

(మొదటిపేజీ తరువాయి)

బాధిత కుటుంబంతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి శత్రువులెవరైనా ఉన్నారా అనే విషయం తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా శత్రువులు ఎవరూ లేరని బాధిత కుటుంబం తెలిపింది. ఘటనా స్థలం నుంచి యువతి చెప్పులు, పెట్రోల్ క్యాన్‌ను, అగ్గిపెట్టెను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

అలాగే సమీపంలోని తెడా బజార్ వద్ద నాలుగు చక్రాల టైరు మార్కులను గుర్తించారు. పోలీసు సూపరింటెండెంట్(ఎస్పీ) పుష్పాంజలితోపాటు స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) ఉత్తమ్ సింగ్ రాథోర్‌లు ఈ ఘటనకు సంబంధించి అనేక మందిని విచారణ జరిపారు. గుర్తు తెలియని దుండగులపై కేసు నమోదు చేశారు. ఆమెపై లైంగిక దాడి జరిగిందా లేదా అనే అంశం పోస్టుమార్టమ్ అనంతరం తెలుస్తుందని పోలీసులు చెప్పారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ జరుగుతుంది. అనంతరం 11.00 గంటలకు ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి వేదికకు చేరుకుని సదస్సును ప్రారంభిస్తారు. 12 నుంచి ఒంటి గంట వరకూ ఆటోమోటివ్‌పై స్టేట్ సెక్టార్ సెషన్ జరగనుంది. ఆ తర్వాత టూరిజంపై సెషన్-2 జరగనుంది.

ఈ సదస్సుకు సంబంధించి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్యసేవల కోసం వైద్యులను, మందులను అందుబాటులో ఉంచారు. వచ్చే అతిథుల కోసం అరకు కాఫీ, లేపాక్షి, జీసీసీ, చేనేత వస్త్రాలు, పర్యాటక శాఖలకు చెందిన ఉత్పత్తులతో ఆకట్టుకునేలా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం మీద పెట్టుబడుల సదస్సును పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

4 వేల కోట్లు కేటాయించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఏపీ బడ్జెట్టులో అగ్రిగోల్డు బాధితుల కోసం రూ.4వేల కోట్ల నిధుల్ని ప్రభుత్వం కేటాయించాలని, బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి..సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏపీ అగ్రిగోల్డు కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, అగ్రి గోల్డు కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు తదితర ప్రతినిధుల బృందంతో కలిసి అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబునాయుడుకు వారు వినతిపత్రాన్ని అందజేశారు.రాష్ట్రంలో అగ్రిగోల్డు బాధితులు ఎదుర్కొంటున్న సమస్యల్ని సీఎం దృష్టికి రామకృష్ణ, ముప్పాళ్ల తీసుకెళ్లారు.పరిహారం జాప్యంతో బాధితులు పడుతున్న ఇబ్బందుల్ని సమగ్రంగా వివరించారు. అనంతరం మీడియాతో ముప్పాళ్ల మాట్లాడుతూ,అగ్రిగోల్డు ఆస్తుల వ్యవహారంపై జీఎస్సెల్ గ్రూప్ కంపెనీ యాజమాన్యం త్వరిత గతిన టేకోవర్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.లేకుంటే రాష్ట్ర ప్రభుత్వమే చొరవ చూపి, కోర్టు అనుమతులు తీసుకుని అగ్రిల్డు కంపెనీ మొత్తం ఆస్తుల్ని విక్రయించేందుకు ముందుకు రావాలని కోరారు.సత్వరమే బాధితులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు.అగ్రిగోల్డు బాధితుల ఆందోళనతో 2017 మార్చి 23న ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు.కీలక నిందితులైన అవ్వాస్ సీతారామారావు, అవ్వాస్ శివరామ్, భానూజీరావు, కేఎంఆర్ నాయుడు తదితరులు వెంటనే అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు.అగ్రిగోల్డు ఆస్తుల టేకోవర్‌లో జాప్యమైతే..ప్రభుత్వమే రూ.4వేల కోట్లను బాధితులకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు.పరిహారం జాప్యమైతే బాధితులు మరింత ఇబ్బందుల్ని ఎదుర్కొంటారని చంద్రబాబు దృష్టికి ముప్పాళ్ల తీసుకొచ్చారు.దీంతో సీఎం స్పందించి సంబంధిత ఫైల్ తీసుకురావాలని అధికారులను ఆదేశించారని తెలిపారు.

మార్చి1న అగ్రి బాధిత కుటుంబాలకు పరిహారానికి సీఎం ఆదేశం

మరణించిన అగ్రిగోల్డు బాధిత కుటుంబాలకు మార్చి 1వ తేదీన రూ.5లక్షల చొప్పున పరిహారం అందజేతకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారని ముప్పాళ్ల పేర్కొన్నారు. ఏపీ అగ్రిగోల్డు కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం సూచనలపై ఆయన స్పందించారన్నారు. 1వ తేదీన పరిహారం చెల్లిస్తామని,ఇప్పటికే ఎస్సెల్ గ్రూప్ యాజమాన్యంతో చర్చించానని, వచ్చే కోర్టు వాయిదా నాటికి సమస్యను పరిష్కరించేలా అధికారులను ఆదేశించామని సీఎం తమకు హామీఇచ్చారని వివరించారు. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్, ఏపీ అగ్రిగోల్డు కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గుంటుపల్లి వెంకటేశ్వరరావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

హోదా కోసం 6న ఢిల్లీలో పోరాటం: ముప్పాళ్ల

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన కోసం మార్చి 6 నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పోరాటం నిర్వహిస్తామని ముప్పాళ్ల పేర్కొన్నారు.రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు సైతం ప్రత్యేక హోదా మేలని నొక్కిచెబుతున్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబూ అదే అభిప్రాయంతో వున్నారని తెలిపారు.రాష్ట్ర ప్రజలు ప్రత్యేక హోదాను కోరుకుంటున్నారని. ఇటీవల బందును వారంతా విజయవంతం చేశారని గుర్తుచేశారు.

డొల్ల పలుకులు

(మొదటిపేజీ తరువాయి)

సర్దుబాటు చేసేందుకు ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటిలో దివాలా తీసినట్టు కోర్టులు ప్రకటించిన వాటి సంఖ్య కూడా 30 శాతానికి మించటంలేదు. బ్యాంకులు అందచేసిన మొత్తం రుణాలలో సుమారు 40 శాతం మేర ఎన్‌పీఏలుగా మారాయనుకున్నప్పటికీ దీని విలువ సుమారు రు.4 లక్షల కోట్ల పైమాటే. ప్రభుత్వం అందచేసిన తాజా పెట్టుబడుల్లో రు.2లక్షల కోట్లు ఇందులో సగంమేర సర్దుబాటు చేయటానికే సరిపోతోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన కంప్యూటర్ వ్యవస్థలను నీరవ్‌మోడీ బృందం అనధికారికంగా తమ అధీనంలో వుంచుకుని తమ కార్యకలాపాలను నడిపించుకుంది.

అదానీ నుంచి అంబానీ వరకు : అదానీ నుంచి అంబానీ వరకూ బొగ్గు దిగుమతుల్లో ఓవర్ ఇన్వాయిసింగ్‌కు పాల్పడి బ్యాంకులను మోసం చేసిన వైనం కూడా ఇదే తరహాలో కొనసాగింది. పెట్టుబడిదారులందరిదీ ఒకటే సూత్రం... మోడీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆర్థిక, బ్యాంకింగ్ వ్యవస్థలతో ఆటలాడుకోవటమే.. బ్యాంకు రుణాలను చెల్లించని దివాలా సంస్థల ఆస్తులను వేలానికి పెట్టినపుడు, వాటి యజమానుల దూరపు బంధువులే ఆ సంస్థలను కారు చౌకగా కొట్టేసేందుకు బిడ్డింగ్ దాఖలు చేస్తుంటారు. తద్వారా ఈ ప్రక్రియ అంతా ఒక నాటకంలా మారుతోంది. ఈ కార్పొరేట్ గ్రూపుల్లో కొన్ని మోడీ సర్కారుతో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవటం ద్వారా తమ వ్యాపారాన్ని విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రక్షణ ఉత్పత్తులు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టుల వంటి వాటిలో కొన్నింటిని చేపట్టిన ఈ కంపెనీలలో కొన్ని సంస్థలు ఇప్పటికీ బ్యాంకులకు రు.3 లక్షల కోట్లకు పైగా బాకీలు చెల్లించాల్సి వుంది. ఈ సంస్థలు తీసుకున్న రుణాలలో అధిక మొత్తాలను ఓవర్ ప్రైసింగ్ విదేశీ దిగుమతులపై వెచ్చించినట్లు ఆర్థిక మంత్రిత్వ దర్యాప్తులో స్పష్టమైనప్పటికీ బ్యాంకులు కానీ, ఆర్బీఐ కానీ వీటిపై చర్యలు తీసుకోలేదు. సొంత ప్రభుత్వంలోని విభాగాలే స్వయంగా దర్యాప్తు చేసి నిగ్గు తేల్చిన విషయాలపై అటు ప్రధాని కానీ, ఇటు ఆర్థిక మంత్రికానీ స్పందించకపోవటం ఎవ్వరికీ అంతుపట్టని విషయంగా మారింది.

హోదా సాధనకు 28న వర్సిటీల బంద్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా, విభజన చట్టంలోని హామీల అమలు డిమాండు చేస్తూ ఈనెల 28వ తేదీన రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల బంద్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి, యువజన సంఘాల నేతలు పేర్కొన్నారు. దాసరిభవన్‌లో శుక్రవారం బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ నాయకులు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి రంగన్న, వై రాము మాట్లాడుతూ కేంద్ర విశ్వవిద్యాలయల ఏర్పాటుకు రూ. 9,600 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ. 420 కోట్లు మాత్రమే మంజూరు చేయడం దారుణమన్నారు. విభజన హామీల్లో ఏఒక్కదానిని కేంద్రం సక్రమంగా అమలు చేయడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014లో పేర్కొన్న హామీలను కేంద్రం తుంగలోకి తొక్కిందన్నారు. ఏఐవైఎఫ్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ అఫ్జర్, జి రామన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇద్దరూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసారని విమర్శించారు. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడదీస్తే.. నేడు పాలక బీజేపీ ప్రత్యేక హోదా ఇవ్వకుండా, చట్టంలోని హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించాయన్నారు. పోలవరం, రాజధాని నిర్మాణాలకు పూర్తిస్థాయిలో నిధులను కేటాయించాలన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీతోపాటు కొత్త రైల్వేజోన్, ఓడరేవులను వెంటనే ప్రకటించాలని వారు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మోతుకూరి అరుణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె రమేష్, ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి పి చరణ్‌సాయి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరా మోగింది

(మొదటిపేజీ తరువాయి)

మిగిలారు. రాజ్యసభ సభ్యుడుగా ఎన్నిక కావాలంటే ఒక్కొక్కరికీ మొదటి ప్రాధాన్యతన ఓట్లు రావాలి. ప్రస్తుతం ఉన్న సంఖ్య బలాన్ని బట్టి టీడీపీకి 2, వైసీపీకి 1 దక్కుతాయి. వైసీపీ అభ్యర్థిగా నెల్లూరుకు చెందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. ఇక టీడీపీకి దక్కనున్న రెండు స్థానాల్లో టిక్కెట్ ఆశిస్తున్న వారిలో సిట్టింగ్ ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహన్‌రావు, రిలయన్స్ మాధవ్, జూపూడి ప్రభాకర్‌రావు, వర్ల రామయ్య, కె.ప్రతిభాభారతి, ఏరాసు ప్రతాపరెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఆర్థిక మంత్రిగా ఉన్న యనమల రామకృష్ణుడు రాజ్యసభకు వెళ్ళాలన్న ఆలోచనలో ఉన్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా గతంలో మీడియాకు తెలిపారు. అయితే చంద్రబాబు ఎవరికి టిక్కెట్‌లు ఇస్తారనేది అంతుచిక్కటం లేదు. టీడీపీలో రాజ్యసభ టిక్కెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉంది. ఇదిలా ఉండగా వైసీపీ నుండి మరో ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీలో చేరితే మూడవస్థానం కూడా టీడీపీకి దక్కుతుంది. తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు పలువురు ఐపీఎస్‌లు, టీడీపీ సీనియర్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయ్‌సాయిరెడ్డి ఆరోపించారు. అయితే వైసీపీ నుండి మరికొందరు టీడీపీలో చేరతారని ప్రచారం జరుగుతున్నా ఎవరూ విశ్వసించటం లేదు. అలా అని వైసీపీ నుంచి ముగ్గురు వచ్చి చేరినా ఈలోపు టీడీపీ బీజేపీ మిత్రబంధం తెగిపోతే మూడవ అభ్యర్థిగా పోటీ చేస్తే టీడీపీకి విజయం దక్కటం కష్టమవుతుంది. టీడీపీకి మిగులు ఓట్లు ఉన్నప్పటికీ ఈ పరిస్థితుల్లో మూడవ అభ్యర్థిని రంగంలోకి దించేందుకు అధిష్టానం సాహసిస్తుందా అన్నదానిపై ఆ పార్టీలో తర్జనభర్జన జరుగుతోంది. అయితే చంద్రబాబు మూడవ అభ్యర్థిని రంగంలోకి దించుతారా అనేది చూడాల్సి ఉంది.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-అమరావతి : ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు కమిషనర్ బి.ఉదయలక్ష్మి చెప్పారు. సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం కలిపి మొత్తం 10,26,891 మంది పరీక్షకు హాజరవుతారన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఒక రోజు మొదటి సంవత్సరం వారికి, తరువాత రోజు రెండవ సంవత్సరం వారికి జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. శుక్రవారం నుంచి హాల్ టికెట్లను jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌ను సంబంధింత కళాశాల ప్రిన్సిపాల్ ధృవీకరించాలని, దానిని తీసుకొని పరీక్షా కేంద్రానికి వెళ్లాలని చెప్పారు. ఫీజులు చెల్లించలేదన్న పేరుతో విద్యార్థుల హాల్ టికెట్లను ధృవీకరించని ప్రైవేటు కాలేజీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హత ఉన్న విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలన్నారు. విద్యార్థులు చదువుకునే కాలేజీ కాకుండా జంబ్లింగ్ విధానంలో మరో కాలేజీని పరీక్షా కేంద్రంగా నిర్ణయించినందున, వాళ్ల పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడానికి ఇబ్బంది పడకుండా ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ సెంటర్ లొకేటర్ అనే నూతన యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. యాండ్రాయిడ్ సెల్ ఫోన్ ఉన్నవారు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుంటే, అది కోడ్ నెంబర్ అడుగుతుందని, ఆ స్థానంలో విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేస్తే పరీక్షా కేంద్రాన్ని చూపుతుందని వివరించారు. యాండ్రాయిడ్ సెల్‌ఫోన్ లేనివారు ఒక రోజు ముందే పరీక్షా కేంద్రాన్ని చూసుకోవాలని సూచించారు. పరీక్ష రోజు ఉదయం కేంద్రాన్ని వెతుక్కోవడానికి ఎక్కువ సమయం కేటాయించకుండా, హడావుడి లేకుండా విద్యార్థులు తల్లిదండ్రులు కూడా పిల్లలకు తగిన జాగ్రత్తలు చెప్పాలన్నారు. మొత్తం 1423 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నామని, వాటిలో 116 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. కాపీయింగ్ జరుగకుండా గట్టి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాపీ చేస్తూ పట్టుబడితే విద్యార్థిని 8 పరీక్షల వరకు డిబార్ చేస్తామన్నారు. విద్యార్థులు కాపీ చేసే అవకాశం లేకుండా, వారు డీబార్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద, అవకాశం ఉన్న మేరకు ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయమని, సమస్యాత్మక కేంద్రాలలో తప్పనిసరిగా ప్రతి గదిలో ఏర్పాటు చేయమని అధికారులను ఆదేశించామని, థియరీ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతి పది పరీక్షా కేంద్రాలకు ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్‌ని, సమస్యాత్మక కేంద్రాల్లో ప్రతి కేంద్రానికి ఒక సిటింగ్ స్క్వాడ్‌ని నియమించామన్నారు. సమస్యలు ఉంటే విజయవాడ ఇంటర్ బోర్డులోని ఫోన్ నెంబర్ 0866-2974130, ఫాక్స్ నెంబర్ 0866-2970056, టోల్ ఫ్రీ నెంబర్ 18002749868కు తెలియజేయాలన్నారు.

విజయసాయివి అనుచిత వ్యాఖ్యలు : ఐపీఎస్ అధికారుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎంపీ విజయసాయిరెడ్డి ఇటీవల ఇంటెలిజెన్స్ ఏడీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఎంపీ వ్యాఖ్యలు వార్తాపత్రికల్లో ప్రచురితం, న్యూస్ ఛానళ్లలో ప్రసారమైన నేపథ్యంలో ఐపీఎస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అత్యవసరంగా సమావేశమైంది. విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా ఏబీ వెంకటేశ్వరరావుకు సంఘం మద్దతు తెలిపింది. చట్టానికి లోబడి పనిచేసే పోలీసువ్యవస్థను కించపరిచే రీతిలో వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని రాజకీయపార్టీలను సంఘం కోరింది. ఈమేరకు సంఘం నిర్ణయాన్ని కార్యదర్శి రాజీవ్‌కుమార్ మీనా ప్రకటన ద్వారా వెల్లడించారు.

సోము వీర్రాజు పద్ధతి మార్చుకోవాలి : కొలనుకొండ శివాజీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీసేలా తరచూ మీడియా ఎదుట రెచ్చిపోయే వ్యాఖ్యలు చేయడాన్ని ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు సోము వీర్రాజు విడనాడాలని పీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. యూపీఏ సర్కారు రూపొందించిన విభజనచట్టం, రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ ఇచ్చిన హామీల అమలు, ప్రత్యేక హోదా, రైల్వే జోన్, దుగరాజపట్నం పోర్టు తదితరాలను ఇచ్చేందుకు బీజేపీ అంగీకరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నాలుగేళ్లయినా అమలు చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.అవసరమైతే అఖిల పక్షాల ఆధ్వర్యాన ఢిల్లీలో ఆమరణ దీక్షకు దిగాలని డిమాండు చేశారు.జెండాలను పక్కనబెట్టి అందరూ ఐక్యమైతేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

సీఎంవో అధికారులపై రాజకీయ నీలినీడలు

విజయ్‌సాయిరెడ్డి టార్గెట్‌గా ఆ ఏడుగురు

విశాలాంధ్ర-అమరావతి : ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై రాజకీయ నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి తరుపున బాధ్యతలను నిర్వహించే ప్రధాన పరిపాలన అధికారగణంపై వైసీపీ ఎంపీ విజయ్‌సాయిరెడ్డి ఆరోపణలు ఎక్కుపెట్టారు. దీంతో ఐఏఎస్ వర్గాలు ఉలికిపాటుకు గురయ్యాయి. ఇదే సమయంలో ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఆప్ ఎమ్మెల్యేలు దౌర్జన్యం చేయటం కూడా ఐఏఎస్ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను రాజకీయంగా విమర్శించటాన్ని వారి సంఘం నేతలతో పాటు టీడీపీ, బీజేపీ నేతలంతా ఖండిస్తున్నారు. అయితే విజయ్‌సాయి ఏమాత్రం వెనక్కు తగ్గకుండా తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని శుక్రవారం మరో ఇద్దరు ఐఏఎస్‌ల పేర్లు ఆ జాబితాలో జోడించి మరోసారి సంచలనం రేకెత్తించారు. వారం రోజుల క్రితం విజయ్‌సాయిరెడ్డి సీఎంవో కార్యదర్శి సతీష్‌చంద్ర, ఇంటలిజెన్స్ డీజీ ఏబి.వెంకటేశ్వరరావు, టీడీపీ అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యుడు టీజి.వెంకటేష్‌లను టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పై ఐదుగురుపై చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. వీరంతా తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయనాయకులపై ఆరోపణలు సహజం కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి సతీష్‌చందర్, ఐపీఎస్ అధికారి, ఇంటలిజెన్స్ డీజీ వెంకటేశ్వరరావులపై ఆరోపణలు రావటంలో ఆంతర్యం అంతుబట్టక ఆ వర్గాలు ఎన్నడూ లేని విధంగా తలలు బాదుకున్నాయి. రాష్ట్రంలో జరిగే అధికార, అనధికార, శాంతిభద్రతల,


సతీష్‌చందర్ | సాయిప్రసాద్ | రాజమౌళి | వెంకటేశ్వరరావు | యరపతినేని | కళావెంకట్రావు | వెంకటేష్

ఆంతరంగిక వ్యవహారాలపై క్షణక్షణం జరిగే వివరాలను ఎప్పటికప్పుడు ఇంటలిజెన్స్ డీజీ సీఎంకు సమాచారం అందజేస్తుంటారు. ఒక విధంగా ఇంటలిజెన్స్ డీజీ ముఖ్యమంత్రికి పాలనలో అత్యంత కీలకమైన అధికారి. అలాగే సీఎంవో కార్యదర్శి కూడా సీఎంకు పరిపాలనలో కుడిభుజం లాంటివారు. చంద్రబాబుని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్షనేతలు, ఇతర నాయకులు, సామాన్యులు ఎవరు కలిసినా సీఎం వారికిచ్చే హామీలను అమలు చేయించటంలో సతీష్‌చందర్ ప్రధాన భూమిక పోషిస్తారు. విజయ్‌సాయి పై ఇద్దరితో సరిపెట్టక సీఎంవోలో ఉన్న ఐఏఎస్‌లు సాయిప్రసాద్, రాజమౌళిలను కూడా టార్గెట్ జాబితాలో చేర్చారు. ఇంకా మరికొందరు ఉన్నారని, వారి పేర్లు కూడా త్వరలో ప్రకటిస్తానని మరోసారి సంచలనం వ్యాఖ్యలు చేయటం ఐఏఎస్, ఐపీఎస్ వర్గాలను కుదిపేస్తోంది. అయితే ఏ అధికారి అయినా పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పినట్లు నడుచుకునేవారే. ముఖ్యమంత్రి, మంత్రులను ప్రతిపక్ష పార్టీల వారు కూడా కలుస్తుంటారు. ఆ పనిలో భాగంగా వారు ఐఏఎస్, ఐపీఎస్‌లను కూడా కలిసి మాట్లాడుతుంటారు. అంతమాత్రాన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఉన్నతాధికారులను నిందించటం సరికాదని, ఏ ప్రభుత్వంలోనైనా అధికారులు నిర్వహించే బాధ్యత ఒకటేనంటున్నారు. కానీ వైసీపీ నేత ఎందుకు ఇలా ఆరోపణలు చేస్తున్నారు అన్న అంశంపై అధికారవర్గాల్లో సీరియస్‌గా చర్చ సాగుతోంది. ఇక కళావెంకట్రావు, వెంకటేష్, యరపతినేనిలు కూడా ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారని విజయ్‌సాయి ఆరోపించారు. దీనిని టీడీపీ నేతలు ఖండించారు. జగన్ సొంతపార్టీ స్థాపించినప్పుడు కాంగ్రెస్, ప్రజారాజ్యం, టీడీపీల నుండి ఎమ్మెల్యేలు ఫిరాయించారని, అప్పుడు లేని నీతి ఇప్పుడెలా గుర్తుకు వస్తుందని విజయ్‌సాయిరెడ్డిని టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. ఏ ఎమ్మెల్యే అయినా రాజకీయ నిర్ణయం తన పరిస్థితులను బట్టి తీసుకుంటారు తప్ప ఒకరు ప్రలోభాలకు గురిచేస్తే లొంగరని వ్యాఖ్యానిస్తున్నారు. ఇతర పార్టీ నేతలను చేర్చుకున్న జగన్ ఆత్మ విమర్శ చేసుకోకుండా తమను నిందించటం సరికాదని అధికార పార్టీ నేతలు చెప్పుకొస్తుండగా రాజకీయ కారణాలతో అధికారులను టార్గెట్ చేయటం సబబుకాదని అధికారు లు అంటున్నారు. ఇలాంటి పరిణామాల వల్ల భవిష్యత్తులో ముఖ్యమంత్రుల కార్యాలయంలో పని చేయాలంటే ఏ అధికారి సాహసించరని అధికారవర్గాలు అంటున్నాయి. అధికారం ఎవరికి శాశ్వతం కాదని రాజకీయ నాయకులు అది గ్రహించకుండా ఉద్యోగులపై విమర్శలు చేయటం సరికాదంటున్నారు. అయితే విజయ్‌సాయిరెడ్డి మాత్రం తన ఆరోపణల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఏది ఏమైనా విజయ్‌సాయిరెడ్డి ఆరోపణలతో సచివాలయంలోని ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రతిపక్షపాత్ర పోషించేదెవరు?

వైసీపీయా ? బీజేపీయా ?
తెగదెంపులకు సన్నద్ధమవుతున్న మిత్రపక్షాలు
అసెంబ్లీకి హాజరుపై ఊగిసలాటలో వైసీపీ
బడ్జెట్ సమావేశాల్లో పరిస్థితిపై ఆసక్తికరచర్చ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మార్చి 5వ తేదీ నుండి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈసారి ప్రతిపక్ష పాత్ర ఎవరు పోషించనున్నారనే అంశంపై రాజకీయవర్గాల్లో రసవత్తర చర్చ సాగుతోంది. ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వామ్యపక్షాలుగా వ్యవహరిస్తున్న టీడీపీ, బీజేపీ పార్టీల మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రస్థాయికి చేరడంతో రాజకీయాలు వేడెక్కాయి. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్రంలోని ఇతర రాజకీయపార్టీలతో పాటు, బీజేపీ మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అంతేగాక కేంద్రంపై నేరుగా పోరాటానికి దిగింది. మార్చి 5వ తేదీలోగా న్యాయం చేయకపోతే కేంద్ర ప్రభుత్వం నుండి బైటకు వస్తామని కూడా హెచ్చరించింది. పార్లమెంటులోనూ పోరాటం మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఇదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వంలో కొనసాగుతున్న బీజేపీ మంత్రులిద్దరూ విధిగా రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ఇప్పటికే రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు తీవ్రస్థాయికి చేరాయి. ఇటీవల విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర సమావేశంలో టీడీపీ ప్రభుత్వం నుండి బైటకు రావడమే మంచిదన్న అభిప్రాయాన్ని మెజార్టీ నేతలు వెలిబుచ్చారు. దానిపై దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు తీవ్రంగా స్పందిస్తూ తాను ఈ నిముషంలో రాజీనామా చేయమన్నా చేస్తానని, కొద్దిరోజులుగా రాజీనామా పత్రాన్ని జేబులో పెట్టుకు తిరుగుతున్నానని ఆవేశంతో సమాధానమిచ్చారు. అంత తొందరపాటు మంచిది కాదని, హైకమాండ్ సూచన మేరకు నడుచుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు వారికి నచ్చజెప్పారు. దీనినిబట్టి టీడీపీ నిర్ణయం కోసం బీజేపీ వేచి చూస్తోంది. తెలుగుదేశం పార్టీ కూడా తెగదెంపుల విషయంపై తొందరపడకుండా, తొలుత కేంద్ర ప్రభుత్వం నుండి బైటకొచ్చి ఆందోళనను ఉధృతం చేయాలని భావిస్తోంది. ఇది పార్టీల మధ్య సమస్యలా గాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అంశంగా పరిగణించి కేంద్రంపై పోరుకు టీడీపీ సమాయత్తమవుతోంది. ఇందుకు మార్చి 5 డెడ్‌లైన్‌గా పెట్టుకుంది. పార్లమెంటు సమావేశాలు సైతం మళ్లీ మార్చి 5నుంచే ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలూ అదే రోజు ప్రారంభమవుతున్నాయి. మొదటిరోజు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం వుంటుంది. అనంతరం మరుసటిరోజుకి సభ వాయిదా పడు తుంది. కేంద్రప్రభుత్వం ఈలోగా స్పందించకపోతే తొలిరోజే టీడీపీ మంత్రులు రాజీనామా చేసే అవకాశముంది. ఆ మరుక్షణమే రాష్ట్రంలో బీజేపీ మంత్రులు కూడా రాజీనామా చేస్తారు. అదే జరిగితే 6వ తేదీ నుండి బడ్జెట్ సమావేశాల్లో బీజేపీయే ప్రతిపక్షపాత్ర పోషించనుంది. ప్రతిపక్ష పార్టీగా వున్న వైఎస్సార్ కాంగ్రెస్ శీతాకాల సమావేశాలను బహిష్కరించింది. ఈసారైనా హాజరవుతారా ? లేదా ? అనే అంశంపై ఆ పార్టీలో ఇప్పటివరకు స్పష్టత లేదు. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి ప్రస్తుతం ప్రజాసంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. అందువల్ల జగన్ ఒకవేళ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా కేవలం వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రమే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారు. అప్పుడు సహజంగానే వారు ప్రతిపక్షపాత్ర పోషిస్తారు. అధినేత నిర్ణయం ఏ విధంగా వుంటుందోనని ఆపార్టీ ఎమ్మెల్యేలు వేచి చూస్తున్నారు. ఒకవేళ వైసీపీ తన గైర్హాజరు నిర్ణయాన్ని కొనసాగిస్తే మాత్రం తెగదెంపులకు సిద్ధమైన బీజేపీయే ప్రతిపక్షపాత్ర పోషించనుంది. మొత్తానికి పరిస్థితులు ఎలా వున్నా ఈసారి బడ్జెట్ సమావేశాలు హాట్‌హాట్‌గా సాగనున్నాయి.

నేటినుంచి టెన్త్ ప్రీ పబ్లిక్

విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి - 15 నుంచి 28 వరకూ పబ్లిక్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి ప్రీ పబ్లిక్ (ఎస్ఏ-2) పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఎస్ఈఆర్టీ-ఏపీ అధ్వర్యాన ఈ నెల24 నుంచి మార్చి 10వరకూ ప్రీ పబ్లిక్ నిర్వహణ షెడ్యూలును పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రీ పబ్లిక్ ముగిసిన అనంతరం ఐదు రోజుల విరామంతో మార్చి 15వ తేదీ నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయి.వరుస వారీగా పరీక్షలతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.ఈ పరీక్షలను 13జిల్లాల వారీగా డీఈవోలు పర్యవేక్షిస్తారు.ఎస్ఈఆర్టీ రూపొందించిన ప్రశ్నాపత్రాల్ని ఆయా జిల్లాల కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షలను నిర్వహిస్తుంది.మూల్యాంకనాన్ని ఎక్కడికక్కడే పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేస్తారు.నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ)పద్ధతిలో ఏర్పాటు చేసిన పరీక్షలు మార్చి 10వ తేదీతో ముగియనున్నాయి. మార్చి 15 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయి.పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు విద్యార్థులకు ఐదు రోజుల వ్యవధి వుండటం వల్ల అసౌకర్యానికి గురవుతారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.ప్రీ పబ్లిక్, పబ్లిక్ పరీక్షల మధ్య మూడు వారాలకుపైగా వ్యవధి వుండాలని వారు సూచిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థుల్ని వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు.జన్మభూమి,స్వచ్ఛభారత్, మరుగుదొడ్ల సర్వేలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన వివిధ కార్యక్రమాలకూ హాజరయ్యారు.దీంతో సకాలంలో పదో తరగతి సిలబస్ పూర్తవ్వలేదనే విమర్శలున్నాయి.ఐదు రోజుల వ్యవధితో హడావుడిగా ప్రీ పబ్లిక్ పరీక్షలను నిర్వహించడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నేటి నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకూ ప్రీ పబ్లిక్ పరీక్షలు కొనసాగుతాయి.అన్ని జిల్లాల డీఈవోలు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

కేంద్రంపై యుద్ధం కొనసాగిస్తాం

రాష్ట్రాన్ని సాంకేతిక పరిజ్ఞానానికి నిలయం చేస్తాం
ఈ-ప్రగతి ఉద్యోగులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై మరోసారి నిరసన స్వరాన్ని వినిపించారు. కేంద్రంపై యుద్ధం కొనసాగుతుందని, చివరి నిమిషం వరకు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం సాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఉండవల్లిలోని సీఎం నివాసం పక్కన ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ భవనంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఈ-ప్రగతి ఉద్యోగులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ముఖ్యమంత్రి మాట్లాడుతూ విభజన హామీల అమలు విషయంలో రెండో ఆలోచన లేకుండా యుద్ధాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ-ప్రగతి ఉద్యోగులు రాష్ట్ర పాలనలో కీలకంగా వ్యవహరిస్తారని, సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్‌లో ప్రధాన పాత్ర పోషిస్తుందని వ్యాఖ్యానించారు. సాధారణంగా ఐఎస్‌బీ సర్టిఫికెట్ పొందాలంటే చాలా కష్టమయ్యేదని, కానీ శిక్షణ తీసుకున్న ప్రభుత్వోద్యోగులు చాలా సులువుగా సర్టిఫికెట్లు పొందుతున్నారని అన్నారు.రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ఎన్నో ఫైళ్లు ఢిల్లీకి పంపితే దశాబ్దాలైనా పరిష్కారం లభించేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఎన్నో సమస్యల పరిష్కారానికి ఈ-ప్రగతి వేదికగా నిలుస్తుందని అన్నారు. ఇదే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి లబ్ధిదారునికి సేవలు అందుతున్నాయా లేదా అనే అంశంతో పాటు, ప్రతి ఉద్యోగి పని తీరును విశ్లేషించగలుగుతున్నామని సీఎం చెప్పారు.మార్చి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లోనే ఫైళ్లను క్లియర్ చేసే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, ఇప్పటికే శాఖల వారీగా ప్రతి ఉద్యోగికి యూనిక్ కోడ్ ఇవ్వమని అధికారులకు ఆదేశాలు జారీ చేశానని తెలిపారు. 2019 నాటికి ఏపీలో కోటి మందిని డిజిటల్ లిటరేచర్లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. విభజన చట్టంలో పెట్టినవనీ సాధించటం మన హక్కు అని, వాటిని నెరవేర్చడం కేంద్రం బాధ్యత అని వ్యాఖ్యానించారు. నాలుగు బడ్జెట్‌లు చూసినా నెరవేర్చలేదని, పోరాట పంథా ఎంచుకున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ జీవితంలో అన్నీ చూశానని, ఈ నెల 27 నాటికి రాజకీయాల్లోకి వచ్చి 40 ఏళ్లు అవుతుందని తన అనుభవాన్ని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు లోకేష్, నక్కా అనంద్ బాబు, పత్తిపాటి పుల్లారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతన సలహాబోర్డును వెంటనే నియమించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో కనీస వేతన సలహాబోర్డును వెంటనే నియమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వినతపత్రాన్ని సచివాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వయంగా అందచేశారు. రాష్ట్రంలో అనేక షెడ్యూల్స్‌లో కనీస వేతనాల పెంపుదల గత 10సంవత్సరాల క్రితం జరిగిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతి రోజు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా కార్మికు లకు జీతాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లక్షలాది సంఖ్యలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పనిచేస్తున్నారన్నారు. వీరందరికి కనీస వేతనాల నిర్ణయం, అమలులో తీవ్రమైన అన్యాయం, నష్టం జరుగుతున్న విషయం కార్మిక శాఖకు తెలిసి కూడా అలసత్వం వహించడం దారుణమన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ. 11వేలు, రూ. 9వేలు జీతాలు చెల్లించాల్సి ఉండగా కాంట్రాక్టర్లు రాష్ట్ర మంతటా రూ. 4 వేల నుంచి రూ. 6వేలు మాత్రమే ఇచ్చి కార్మి కులకు నష్టం కలిగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్టు లేబర్ రెగ్యులేషన్, అబాలిషన్ యాక్టు ప్రకారం కనీస వేతనాలు నిర్ణయించే సలహా మండలి పునరుద్దరణ జరగనందు వల్ల జీవో నెంబరు 11స్థానంలో కొత్త జీవో రాలేదన్నారు. దీంతో విద్యుత్, సిమెంట్, విద్య, వైద్యం తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు 2017 ఏప్రియల్ నుండి సవరించిన వేతనాలు అందడంలేదన్నారు. కనీస వేతన సలహా బోర్డు నియామకం చేయకపోవడం వల్ల లక్షలాది మంది కార్మికులు నష్టపోతున్నారని ఆయన స్పష్టం చేశారు. కార్మికశాఖమంత్రి కార్మిక సంఘాలకు హామీ ఇచ్చి 8 మాసాలు గడచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉందన్నారు. ఈ అలసత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, సలహా మండలి పునరుద్దరణ, కాల పరిమితి ముగిసిన జీవోల స్థానంలో కొత్త జీవోల కోసం 12 ఏళ్లుగా వేతన సవరణ జరగని రంగాలకు వెంటనే వేతన పెంపుదల సవరణ చేయాలని ఆయన కోరారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సీఎం చంద్ర బాబు స్పందించి త్వరలో బోర్డు ఏర్పాటు చేసి వేతనాలు పెంచే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

మూడోరోజు ఏపీ టెట్‌కు 96.60శాతం మంది హాజరు : సుబ్బారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ పరీక్షలకు మూడోరోజైన శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 96.60శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. టెట్ పేపర్-1 పరీక్షలకు మొత్తంగా 49,179 మంది అభ్యర్థులు అలాట్ చేసుకోగా, వారిలో 47,508 (96.60శాతం) హాజరయ్యారని వివరించారు.ఉదయం సెషన్‌కు 23,808 మంది అభ్యర్థులకుగాను 23,057 (96.85శాతం), మధ్యాహ్నం షెషన్‌కు 23,808 మంది అభ్యర్థులకుగాను 23,057 మంది (96.60శాతం) మంది హాజరయ్యారని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, డీఈవోలు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ మెంబర్లు పరిశీలించారని పేర్కొన్నారు.

గురుకుల, ఐటీఐ పార్టుటైమ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి: ఎమ్మెల్సీ కత్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్టుటైమ్ టీచర్లు, ఐటీఐలలోని ఒప్పంద ఉద్యోగుల వేతనాలు పెంచాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక కార్యదర్శి ముని వెంకటప్పను ఆయన కలిసి ఉద్యోగుల సమస్యల్ని వివరించారు. ఉద్యోగుల వేతనాల్ని 50శాతానికి పెంచారని, పార్టుటైమ్ ఉద్యోగులను విస్మరించారని పేర్కొన్నారు.దీంతో పార్టుటైమ్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని ప్రత్యేక కార్యదర్శి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు జోసఫ్ సుధీర్‌బాబు, సాంఘిక సంక్షేమ టీచర్ల సంఘం నాయకులు చిన్నయ్య, శరత్ పాల్గొన్నారు.

ఆ కరెన్సీ పార్టీకే

నోట్ల దండపై నారాయణ వివరణ



న్యూఢిల్లీ : సీపీఐ చిత్తూరు జిల్లా 22వ మహాసభల ప్రారంభం సందర్భంగా బుధవారం చిత్తూరులో జరిగిన ప్రదర్శన, బహిరంగ సభ సందర్భంగా తాను కరెన్సీ నోట్ల దండను వేయించుకోవడంపై వస్తున్న వ్యాఖ్యలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ వివరణ ఇచ్చారు. ఈ విధమైన కరెన్సీ నోట్ల దండలను తన సొంత అవసరాల కోసం వేయించుకోవడంలేదని, ఇలా వచ్చిన కరెన్సీ నోట్లు మొత్తం పార్టీకే వెళుతుందని, పారదర్శకతను నిర్వహించే క్రమంలో భాగంగా ఈ నోట్లకు సంబంధించి రసీదును స్థానిక పార్టీకి పంపిస్తామని స్పష్టం చేశారు. సాధారణంగా పార్టీ జాతీయ లేదా రాష్ట్ర నాయకులు స్థానిక సమావేశాలకు హాజరైన సందరా్భలలో పెద్దపెద్ద కటౌట్లు ఏర్పాటు చేయడం, ఖరీదైన బొకేలు ఇవ్వడం, పూల దండలను వేస్తుంటారని, నాయకులు వాటిని వెంటనే తీసివేస్తారని, ఇందుకోసం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చుచేస్తారని తెలిపారు. ఇది వృథా ఖర్చేనని అన్నారు. కరెన్సీ నోట్ల దండలను అనుమతిం చటమనేది అన్ని పార్టీలలో జరుగుతున్నదేననీ, వృథాను నివారించటానికి ఇది మంచి ప్రత్యామ్నాయమని తెలిపారు. ప్రత్యేకించి జాతాలు, పాదయాత్రలు నిర్వహించినప్పుడు ఈ విధంగా కరెన్సీ నోట్లు వేయడం సాధారణంగా జరుగుతున్నదేనని నారాయణ వివరణ ఇచ్చారు.

సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శిగా రామానాయుడు



విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) చిత్తూరు జిల్లా కార్యదర్శిగా ఎ.రామానాయుడు తిరిగి ఎన్నికయ్యారు. ఈ నెల 21 నుంచి చిత్తూరులో మూడు రోజుల పాటు జిల్లా 22వ మహాసభలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీజే చంద్రశేఖర్, పి.హరినాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మహాసభల్లో 59 మందితో నూతన కౌన్సిల్‌ను, 11 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్.నాగరాజన్, పీఎల్ నరసింహులు, జె.రామచంద్రయ్య, చిన్నం పెంచలయ్య, టి.జనార్ధన్, టి.క్రిష్ణప్ప, జనమాల గురవయ్య, ఎస్.మనోహర్‌రెడ్డి, జె.విశ్వనాథ్ ఆహ్వానితులుగా నదియాను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


నర్సింహులుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న సీపీఐ నేతలు

సీపీఐ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శిగా సనపల నర్సింహులు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శ్రీకాకుళం జిల్లా కార్యదర్శిగా సనపల నర్సింహులు ఎన్నికయ్యారు. నరసన్న పేటలోని కళ్యాణ మండపంలో జరుగుతున్న పార్టీ జిల్లా 23వ మహాసభల్లో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా చాపర వెంకటరమణ, చాపర సుందర్‌లాల్, బుడితి అప్పలనాయుడు, కూరంగి మన్మధరావు, లక్కోజు శ్రీనివాసరావు, గేదెల చిరంజీవి, బలగ శ్రీరామ్మూర్తి, లండ వెంకటరమణ, పెంకి కృష్ణ, చిక్కాల గోవిందరావు, ఆహ్వానితులుగా పట్టా ప్రభావతి, మొజ్జాడ యుగంధర్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎన్నికైన నర్సింహులుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య అభినందనలు తెలిపారు.



అనుమతిచ్చి సీఎంని కలవనివ్వకపోవడం దారుణం

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి

విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా పర్యటన సందర్భంగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను విన్నవించేందుకు అధికారులు అనుమతులు ఇచ్చి కలవనివ్వకపోవడం దారుణమని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.విశ్వనాథ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని 19.52 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వినేందుకు ముఖ్యమంత్రి సమయం లేకపోవడం శోచనీయమన్నారు. సమస్య పరిష్కారంలో చంద్రబాబు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని గత ఏడాది మార్చిలో అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న మృతుల కుటుంబాలకు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను కూడా ఏ ఒక్కరికి ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి రాష్ట్ర బడ్జెట్‌లో అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 4 వేలు కోట్లు కేటాయించి న్యాయం చేయాలని డిమాండు చేశారు. లేని పక్షంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులు, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడాపురం శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. ధనుంజయ, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వి.రామక్రిష్ణ, తగరకుంట శ్రీనివాసులు, టి. షామీదా తదితరులు పాల్గొన్నారు.

హోదా సాధించే వరకు పోరాటం : రఘువీరారెడ్డి

విశాలాంధ్ర - గూడూరు : ప్రత్యేక హోదా సాధించేంత వరకూ పోరాటం ఆపబోమని కాంగ్రెస్ అధ్యక్షులు రఘువీరారెడ్డి స్పష్టం చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథిగృహ రోడ్డులో ఏర్పాటుచేసిన ఆంధ్రుల ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో నవ్యాంధ్రకు న్యాయం చేకూరేలా పార్లమెంటు సాక్షిగా అప్పటి ప్రధాని మన్మోహన్ రూ.12 వేల కోట్ల విలువైన ప్రాజెక్టు హామీలను ఇచ్చినా, ప్రస్తుత పాలక పక్ష పార్టీలు విభజన చట్టాన్ని సవరించాలని చెబుతున్నారన్నారు. నాలుగేళ్లుగా సవరించకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆత్మ గౌరవ దీక్షకు సీపీఎం, సీపీఐ, సీపీఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీలు సంఘీభావం తెలుపడం సంతోషంగా ఉందన్నారు. మార్చిలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో టీడీపీ, వైసీపీ, బీజేపీ రాష్ట్ర ఎంపీలు ప్రత్యేక హోదాకు మద్దతు తెలపాల్సిందేనన్నారు. మార్చి 2న ప్రత్యేక హోదాపై రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారుల దిగ్బంధనం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 2019లో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ ప్రధానిగా తొలిసంతకం ఆంధ్ర రాష్ట్ర ప్రత్యేక హోదాపై చేస్తారని సభికుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు.

సంపాదకీయం

అవినీతిలో అభివృద్ధి!

ప్రాణాంతక కేన్సర్‌లాంటిది అవినీతి. ప్రజాస్వామ్య వ్యవస్థపై పౌరుల విశ్వాసాన్ని హరించి వేసే విష రసాయనం. ప్రజల్లో సృజనాత్మకతను, నూతనా విష్కరణల ఉత్సాహాన్ని నీరుగారుస్తుంది. అసలే అరకొరగా ఉన్న బడ్జెట్లకు బొర్రె పెడుతుంది. తరతరాల ప్రతిభాపాటవాల్ని బలిపీఠం మీదకునెట్టి.. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు నిలువనీడ లేకుండా చేస్తుంది- అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు జో బిడెన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుత భారత దేశ స్థితిగతులకు అద్దం పట్టేలా ఉన్నాయి. సగటు పౌరుడు 'మేరా భారత్ మహాన్' అని రొమ్ము విరుచుకుని గర్వించే పరిస్థితి లేకపోవడానికి కారణం- విశ్వరూపం దాల్చిన అవినీతి! దశాబ్దాల తరబడి పారదర్శకత, జవాబుదారీతనాలు కొరవడిన రాజ్యవ్యవస్థలో అరాచకస్థాయికి చేరిన అవినీతికి మన దేశం కేరాఫ్ అడ్రస్‌గా తయారైంది. ఇతర దేశాల్లోనూ అంతోఇంతో ఉన్నా భారత్‌కు లంచగొండితనం, అవినీతి హాలాహలంగా మారాయి. అవినీతి లేనిదెక్కడ అని ప్రశ్నించిన ఇందిర జమానానుంచి పుంజాలు తెంచుకొన్న ఆ జాడ్యం- మోడీ ఏలుబడిలో కొత్తపుంతలు తొక్కి దేశాన్ని కుదిపేస్తున్నది. అవినీతిరహిత పాలన అందిస్తానంటూ గప్పాలు పలికిన మోడీ హయాంలోనే సామాన్యులను సైతం దిగ్భ్రాంతి పరిచేలా బ్యాంకింగ్ బాగోతాలు వెలుగుజూస్తున్నాయి. కాషాయి నేతాగణాల సాక్షిగా రాజ్యాంగ వ్యవస్థలన్నింటా అది ఊడలు దిగి విస్తరిం చిందిప్పుడు! జేబుదొంగల్ని కుళ్లబొడిచి మరీ జైల్లోకి నెట్టే యంత్రాంగాలు, నిరుపేదల నోటి దగ్గరి ముద్దనూ కబళించే అవినీతి గద్దల విషయంలో చేష్టలు దక్కి చోద్యం చూస్తుండటమే విషాదం. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ తాజాగా విడుదల చేసిన అవినీతి సూచీలో 40 పాయింట్లతో 180 దేశాల్లో భారత్ 81వ స్థానంలో నిలిచింది. 2016లో విడుదల చేసిన 176దేశాల జాబితాలో భారత్ 38 పాయింట్లతో 79వ స్థానంలో ఉండగా ఈసారి ఏకంగా రెండు స్థానాలు దిగజారి ఆసియా-పసిఫిక్ రీజియన్‌లోనే చెత్తరికార్డు నమోదు చేసింది. గతంతోపోలిస్తే స్వల్పంగా మార్పు వచ్చినా ... చిన్నచిన్న దేశాలకంటే కూడా మనం ఎంతో వెనకబడి ఉన్నామని ఆ సంస్థ తాజా నివేదిక చూస్తే అర్థమవుతోంది. అవినీతి అతి తక్కువున్న దేశాలుగా ప్రపంచంలో న్యూజిలాండ్, డెన్మార్క్‌లు 88 , 89 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. మనం ఎక్కడో 81వ ర్యాంకులో ఉండిపోయాం. ఈ విషయంలో పాక్, శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, రష్యాల కన్నా మెరుగ్గా ఉన్నామని సరిపెట్టుకోవాలో... భూటాన్, దక్షిణాఫ్రికా, చైనాలకన్నా దైన్యస్థితిలో ఉన్నామని బాధపడాలో అర్థంకాని విషయం.

మంచి చెయ్యాలనుకొన్నవాళ్ల వెన్నుతట్టి, చెడు చేసేవాళ్ల భరతం పట్టడమే ప్రజాప్రభుత్వాల ఉనికికి అర్థం, పరమార్థం. కానీ అవినీతి వేళ్లూనుకోవడానికీ, అది విస్తరించడానికి జవాబుదారీలేని ప్రభుత్వాలుండటమే ప్రధాన కారణం. ఒకసారి ప్రజలు ఓట్లేసి గెలిపించాక ఏం చేయడానికైనా, ఎలా పాలించడానికైనా తమకు హక్కు ఉన్నదని.. గడువు తీరి మళ్లీ ఎన్నికలు వచ్చేవరకూ ప్రశ్నించడానికి లేదని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అలా ప్రశ్నించేవారిని ఏదో ఒక పేరు పెట్టి అణచాలని చూస్తున్నాయి. ఇలాంటి అప్రజాస్వామిక వైఖరే అవినీతిని పెంచి పోషిస్తున్నది. ప్రభుత్వాల అణచివేత చర్యలకు జడిసి పౌర సమాజం, పౌరులు చూసీచూడనట్లు పోయే ధోరణి అవలంబించడం వల్ల అవినీతి విస్తరిస్తున్నది. మీడియా స్వేచ్ఛను హరించడం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలపై ఆంక్షల వల్లే అవినీతి పెరుగుతున్నదని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని పలు దేశాల్లో అవినీతిని ప్రశ్నించే జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతలు, న్యాయాధికారులు, నిఘా సంస్థల అధికారుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నదనీ, కొన్ని దేశాల్లో హత్యలూ జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా భారత్, ఫిలిప్పీన్స్, మాల్దీవుల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని, ఈ దేశాలు అవినీతి జాబితాలో ముందున్నాయనీ, మీడియాకు స్వేచ్ఛ తక్కువగా ఉన్నదనీ, పాత్రికేయుల హత్యల్లో ముందువరసలో ఉన్నాయనీ ప్రకటించింది. గత ఆరేళ్లలో ఈ దేశాల్లో అవినీతిపై కథనాలు రాస్తున్న 15మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని జర్నలిస్టుల సంరక్షణ కమిటీ(సీపీజే) తెలిపింది. సీపీజే నివేదిక ప్రకారం ఈ ఆరేళ్లలో చోటుచేసుకున్న పాత్రికేయుల హత్యల్లో 90శాతం అవినీతి సూచీలో 45 పాయింట్లు కన్నా తక్కువ వచ్చిన దేశాల్లోనే జరిగాయి.

'అవినీతిని అంతం చేస్తామని అంతా చెబుతున్నారు... వాస్తవంలో ఎవరూ ఏమీ చెయ్యలేకపోతున్నారు' అని లోగడ సుప్రీంకోర్టు నిట్టూర్చినట్లుగానే పరిస్థితులు ఏటికేడు దిగజారిపోతున్నాయి. అయిదేళ్లకోసారి జరుగుతున్న ఎన్నికలు కూడా ఈ అవినీతికి ప్రధాన దోహదకారి అవుతున్నాయి. రియల్‌ఎస్టేట్, మద్యం, మైనింగ్, విద్య రంగాల్లో మాఫియాలుగా వందల కోట్లు వెనకేసుకున్న వారిని లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ స్థానాలకు అభ్యర్థులుగా రాజకీయ పార్టీలు నిలబెడుతున్నాయి. దీంతో మాఫియా నాయకులు రాజకీయ రంగ ప్రవేశం చేసి ప్రజాప్రతినిధుల అవతారం ఎత్తడమే కాక, మంత్రులుగా కూడా అధికారం చలాయిస్తున్నారు. అధికార యంత్రాంగాన్ని శాసిస్తున్నారు. అటువంటి ప్రభుత్వాలు సహజంగానే అవినీతిని పెంచడానికే మొగ్గుచూపుతాయి. అటు యూపీఏ, ఇటు ఎన్డీయే ఏ ప్రభుత్వాన్ని చూసినా ఇందుకు కోకొల్లలుగా ఉదాహరణలు కనిపిస్తాయి. లిక్కర్‌డాన్ విజయ్‌మాల్యా బ్యాంకులను తొమ్మిదివేల కోట్లకు పైగా ముంచి లండన్ పారి పోయిన క్రమంలోనే తాజాగా వెలుగు చూసిన పీఎన్బీని ముంచిన నీరవ్‌మోడీ వ్యవహారం దేశ బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరును ప్రశ్నార్థకం చేసింది. మాల్యాలు, మోడీలకు తోడు కొత్తగా విక్రమ్ కొఠారీ బాగోతం తెరమీదకు వచ్చింది. ఇట్లాంటి వాళ్లు చాలామందే ఉన్నారంటూ ఆర్బీఐ ప్రకటించింది. వీళ్లంతా కలిసి బ్యాంకులను ముంచిన మొత్తం సొమ్ము దాదాపు పది లక్షల కోట్ల రూపాయలు. అంటే.. మన దేశ వార్షిక బడ్జెట్ (రూ. 24 లక్షల కోట్లు) మొత్తంలో దాదాపు నలభై శాతం అన్నమాట. దేశంలో పది రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌తో ఇది సమానం. తాజాగా బయటపడ్డ నీరవ్‌మోడీ, విక్రం కొఠారీల లెక్కలు కాకుండా భారత రిజర్వ్ బ్యాంకు తేల్చిన లెక్కలివి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన అధికారులపై- అక్రమార్జన స్వాధీనం సంగతి దేవుడెరుగు, మెజారిటీ కేసుల్లో ఎలాంటి చర్యలూ ఉండటం లేదన్నది నిష్ఠురసత్యం. అవినీతి జరిగిందనడానికి పకడ్బందీ ఆధారాలున్నా ఒక్క కలం పోటుతో కేసులు మాఫీ అయిపోతున్నా యన్నదీ వాస్తవం. అర్జీదారు ఫైలు తెరవడానికి డబ్బులు గుంజేవాడికి, తనపై అవినీతి ఫైలు మూసివేతకు ఎంత ముట్టజెప్పాలో కూడా తెలుసు. అనిశా, నిఘా విభాగాలు తమవంతు ప్రయత్నం ఎంత చేసినా- ఆయా కేసులపై శాఖాపరమైన విచారణ, లేదా వాటిని రద్దుచేస్తున్నట్లు సర్కారు చేసే ఉత్తర్వులతో కథ కంచికి చేరిపోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రెవిన్యూ (67), పురపాలక (14), విద్యుత్ (15), అటవీ పర్యావరణ (13) శాఖలకు సంబంధించి తినమరిగినవాళ్ల కేసులు అలా నమోదయ్యాయన్న మాటేగాని, అవి శిక్షల దాకా వెళ్లవన్న సంగతి నేరగాళ్లకే మహబాగా తెలుసు. కాబట్టే, అవినీతి మోతుబరులకు మన వ్యవస్థలంటే అంత అలుసు! రాజకీయ నేతలు, ఉన్నతాధికార గణాలు, మాఫియా శక్తుల మధ్య బిగిసిన అక్రమ బాంధవ్యం దేశానికి ఎంతో చెరుపు చేస్తోందని ఎన్ఎన్ వోరా కమిటీ నివేదించి రెండు దశాబ్దాలైంది. సర్కారీ కార్యాలయాల్లో ఆమ్యామ్యా అంటూ అర్జీదారుల నుంచి అయిదూ పదీ ఆశించే రోజులు గతించాయి. పనికి ఇంత అని రేటు పెట్టి మరీ దిగువస్థాయి సిబ్బంది బొక్కేస్తుంటే, పర్సంటేజీలతో ఉన్నతాధికారులు తరించిపోతున్న బాగోతాలు కళ్లు మిరుమిట్లు గొల్పుతున్నాయి. 'ఆదాయ పన్ను, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ల అవినీతి, అసమర్థతలకు నిలువెత్తు నిదర్శనమే ప్రస్తుత అవ్యవస్థ' అని కేంద్ర నిఘా సంఘం అధిపతిగా ఎన్.విఠల్ 1999లోనే స్పష్టీకరించారు. పైసా పెట్టుబడి లేకుండా, ఎలాంటి పేచీ రాకుండా కోట్లు గడించే అత్యంత లాభదాయక పరిశ్రమగా అవినీతి ఎదిగిపో యేందుకు సకల సర్కారీ కార్యాలయాలూ నిష్ఠగా కృషి చేస్తున్నాయనడంలో మరోమాట లేదు. తలసరి స్థూల దేశీయోత్పత్తి రూ.95,694గా ఉన్న ఇండియాలో ఏకంగా 80 శాతం జనావళి సంపాదన ఆ జాతీయ సగటులో సగం కూడా లేదన్నది పచ్చి నిజం. అంతగా జాతి జవజీవాల్ని పీల్చిపిప్పి చేస్తున్న అవినీతి జలగల్ని ఉపేక్షించడం ఆత్మహత్యా సదృశం. అవినీతి జేజెమ్మల దిమ్మతిరిగేలా విస్తృత కార్యాచరణ వ్యూహాన్ని ప్రకటించి, అక్రమాలకు పాల్పడితే అరదండాలేనన్న భయాన్ని పుట్టించాలి. అన్ని రంగాల్లోనూ గుణాత్మక మార్పు ప్రస్ఫుటమయ్యేలా జాతి నైతిక దిక్సూచి సవరించి, అవినీతిపరులకు నిలువనీడలేని పరిస్థితిని కల్పించాల్సిన తరుణం ఇది. అది జరగాలంటే అవినీతి క్షుద్రోపాసకుల్ని వూడ్చిపారేసి తమ భవితకు తామే నిర్మాతలుగా యువతరం పోటెత్తాలి. అప్పుడే మంచి రోజులు రహించే మహోదయం.

"సీమ"లో పోలీసు జులుం


వి. శంకరయ్య

వివిధ ప్రాజెక్టుల నిర్మాణం సందర్భంగా బాధితులవుతున్న నిర్వా సితులు భూస్వామి వర్గాల దౌర్జన్యానికి బలౌతున్న దళితులు, హక్కుల సాధనకోసం పోరాటం చేస్తున్న ప్రజాసంఘాల కార్యకర్తలు, నేతల యెడల ఇన్నాళ్ళు పోలీసు దమనకాండ అమలు జరుపుతున్న ముఖ్యమంత్రి తాజాగా రాయలసీమలో లాయర్లు వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలపై కూడా ఎక్కు పెట్టారు. తెలుగు దేశానికి కంచుకోటగా చెప్పుకునే అనంతపురంచ, జిల్లాలోనే నిరశన ప్రదర్శనలు ఎదుర్కోవల్సి వచ్చింది. బుధవారం రాత్రినుండే అనంతపురం కర్నూలు జిల్లాల్లో పలువురిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలించడంగానీ, హౌస్ అరెస్టు చేయడంగానీ అమలు జరిపారు. ఒకవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి యెడల కర్కశ వైఖరి ప్రదర్శిస్తున్న సందర్భంలో కేంద్రానికి వ్యతిరేకంగా సమైక్య పోరాటం చేయవలసివుండగా ఏకపక్ష విధానాలు వదలి పెట్టేట్లు లేదు. రాయలసీమలో హైకోర్టు నెలకొల్పాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని తుంగభద్రపై గుండ్రేవుల వద్ద రిజర్వాయరు క్రిష్టాపై సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మించాలని ఇతర పలు అపరిష్కృత సమస్యలపై నిరసన దీక్షలు ప్రదర్శనలు సాగుతున్నాయి. అంతేకాదు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.ఇ.క్రిష్ణమూర్తికి రాజ్యసభ సభ్యులు టీజివెంకటేష్ కు ఇతర టీడీపీ ముఖ్యనేతలకు పార్టీలకతీతంగా లాయర్లు విద్యార్థులు ఇతర ప్రజా సంఘాలు మెమోరాండాలు కూడా సమర్పించివున్నారు. ఈ సందర్భంలో సామరస్యంగా వ్యవహరించవల్సిన ముఖ్యమంత్రి అనంతపురం జిల్లా పర్యటనకు వెళ్ళి, అది కూడా ఒక విదేశీ సంస్థ ఫ్యాక్టరీ శంఖు స్థాపన సభకు వెళ్ళి తుదకు నిరశన ప్రదర్శనలు ఎదుర్కొన్నారంటే ముఖ్యమంత్రి ప్రజాస్వామ్య విలువలను పట్టించుకున్న దాఖలాలేదు. సీమ యెడల చిన్నచూపు చూస్తున్నారనే భావన బలంగా ఏర్పడుతోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎన్ని ఎదురు దెబ్బలు తగులుతున్నా తన పాత పద్ధతులను విడనాడుతున్నట్లులేదు. పౌరహక్కులను నిర్లక్ష్యంగా అణచివేస్తున్నారు. గత మూడున్నరేళ్ళకాలంలో ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరశన వ్యక్తం చేసేందుకు వివిధ సంఘాల కార్యకర్తలు, వామపక్ష నేతలు సిద్ధమైన సందర్భంలో ముందుగా అరెస్టులు సాగించిన సందర్భముంది. నిన్నగాక మొన్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు అమరావతిలో సమావేశమయ్యేందుకు ప్రయత్నించగా కొన్ని జిల్లాలలో ఎక్కడి కక్కడ అరెస్టులు సాగించారు. అయినా భారీగానే ప్రదర్శన జరిగింది. తుదకు ప్రస్తుతమది ఏకు మేకై కూర్చున్నది.

ముఖ్యమంత్రి పోలవరంగానీ మరే ప్రాజెక్టు సందర్శనకు వెళుతుండగా నిర్వాసితుల పక్షంపోరాడే వామపక్ష నేతలను అరెస్ట్ చేసిన సందర్భముంది. ఇటీవల గుంటూరు జిల్లాలో బాధితులైన దళితులను కలుసుకునేందుకు వామపక్ష నేతలను పోలీసులు అనుమంతించలేదు. తాజా పరిణామం అనంత పురం జిల్లాకు కూడా వ్యాపించింది. గురువారం ముఖ్యమంత్రి అనంతపురం జిల్లాకు వెళుతుండగా బుధవారం రాత్రినుండే పోలీసు నిర్బంధకాండ ప్రారంభమైంది. ఈ అంశాలు అప్పట "కప్పుడే సమాచార మాధ్యమాలలో ఫోటోలతో సహా సీమలోని యువత పొందుపరచడం పలువురిని ఆశ్చర్యపరిచింది.



ప్రధానంగా హైకోర్ట్ కోసం కర్నూలు జిల్లాలో అగ్గిబాగా రాజుకున్నది. ఉక్కు ఫ్యాక్టరీకోసం కడప జిల్లాలో ఇటీవల వామపక్షాలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగితే పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టులు చేశారు. ఈ ఉద్యమం తుదకు ముఖ్యమంత్రి సొంతజిల్లా చిత్తూరుకు వ్యాపించి పలు పట్టణాలలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టులకు హాజరుకాలేదు. అంతేకాదు. తుంగభద్రనదిపై గుండ్రేవులవద్ద రిజర్వాయర్ నిర్మించాలని కర్నూలు కలక్టరేట్ నుండి రైతులు పెద్ద ఎత్తున పాదయాత్ర సాగించారు. ఈ వార్తలు ఏపిలోని పాపులర్ మీడియాలో చోటుచేసుకోకపోవడం దురదృష్టకరం. జిల్లా ఎడిషన్లకు పరిమితం చేస్తున్నారు. సీమలో ఏం జరుగుతుందో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తెలిసే అవకాశం లేకుండా పోతోంది. అట్లని సీమ యువత మిన్నకుండటంలేదు. క్షణాలమీద సమాచార మాధ్యమాలలో ఫోటోలతో సహా పొందుపర్చుతున్నారు.

ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రిగానీ, సీమ తెలుగుదేశం నేతలు గానీ ఏమాత్రం స్పందించడంలేదు. పోలీసు జులుంతో తన పర్యటన పూర్తి చేసుకొని ముఖ్యమంత్రి తిరుగుముఖం పట్టారు. సీమకు చెందిన టిడిపి నేతలు కూడా సీమలో సంభవిస్తున్న పరిణామాలను ముఖ్యమంత్రికి వివరిస్తున్నారో లేదో తెలియదు కానీ ముఖ్యమంత్రికి క్షణాల మీద సమాచారం చేరవేసే పోలీసు యంత్రాంగం వుండనేవుంది. అయినా ముఖ్యమంత్రి సీమలో ఏమీ జరగనట్లు వ్యవహరిస్తున్నారు. కారణాలు ఏవైనా ఇందుకు ఎవరు బాధ్యులైనా అవన్నీ పక్కనబెడితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన అన్యాయానికి రాష్ట్రం అట్టుడికినట్లు భగ్గుమంటోంది. ముఖ్యమంత్రి 5 కోట్ల ఆంధ్రుల అభివృద్ధికోసం తాను పాటుపడుతానని తనకు అందరూ అండగా నిలవాలని కోరుతున్నారు. కానీ ఆచరణలోకి వచ్చే సరికి తమ అసంబద్ధ విధానాలతో ప్రాంతీయ అసమానతలు పెంచే ఏకపక్ష విధానాలను అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు నివారించాలంటే కేంద్రీకృత విధానాలకు స్వస్తి చెప్పాలి. అటు ఉత్తరాంధ్ర ఇటు రాయలసీమ ప్రజల డిమాండ్లను ఓపికగా ఆలకించాలి. వీటి పరిష్కారానికి ఒక మేరకైనా ముఖ్యమంత్రి కృషి సాగించితేనే కేంద్రానికి వ్యతిరేకంగా సమైక్యపోరాటం సాగించగలరు. సమాచార మాధ్యమాలలో సీమకు చెందిన యువత ప్రత్యేకహోదా పై వైముఖ్యం ప్రదర్శించడం ఆశ్చర్యమేస్తోంది. ఇందుకు వారిని నిందించి ప్రయోజనంలేదు. ప్రాంతీయ అసమానత పెంచి సీమ యువతలో అసంతృప్తి పెరిగేందుకు కారణమైన ముఖ్యమంత్రే ఇందుకు బాధ్యత వహించాలి. సీమ యువతలో ప్రత్యేకమైన అసంతృప్తి ఆక్రోశం వ్యక్తమౌతోంది. అధికార పార్టీ యెడలే కాకుండా ప్రధాన ప్రతిపక్షం కూడా తమను నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళ వ్యక్తపరుస్తు న్నారు. అనంతపురం సభలో జరిగిన నిరసన ప్రదర్శన పార్టీల కతీతంగా జరిగింది. రాజకీయ కారణాలతో వైసిపికి ముఖ్యమంత్రి అంటకడితే పప్పులో కాలేసినట్లే.

నేడు ముఖ్యమంత్రి గైకొంటున్న అపసవ్య విధానాలకు బలమైన నేపథ్యముంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గత తొమ్మిదేళ్ళ పరిపాలన కాలంలో ఇలాంటి దురాగతానికే పాల్పడ్డారు. ఉమ్మడి రాష్ట్రాన్ని గాలికి వదిలి పెట్టారు. హైదరా బాద్ ను విశ్వనగరంచేయడం ఐటి విస్తృతికి తనే శ్రీకారం చుట్టినట్లు వ్యవహరించారు. తదుపరి కాంగ్రెస్ పదేళ్ళ పరిపాలనకాలంలో అపకారం జరగడం వాస్తవమైనా అంతక్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ నగరంతోపాటు సీమాంధ్రలో ఏదో ఒక నగరాన్ని అభివృద్ధి చేసి సీమాంధ్ర ప్రాంతంలో కూడా పరిశ్రమలు నెలకొల్పేందుకు కృషి చేసి వుంటే ఈరోజు రాష్ట్రం విభజింపబడిన తదుపరి ఇంతగా అంగలార్చాల్సి వచ్చేదికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే వేలెత్తి ఎందుకు చూపాల్సి వస్తున్నదంటే సీమాంధ్ర దుస్థితికి కాంగ్రెస్ ఏ కారణమని చెబుతూ తన పాత్రను మరుగపరుస్తున్నందున ఈ ఆరోపణ చేయవల్సి వస్తున్నది.

అంతేకాదు కేంద్రం అన్ని రాష్ట్రాలతో ఏపి ఎదిగేందుకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వలేదని, కాంగ్రెస్ అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించిందని ఆరోపిస్తున్న ముఖ్యమంత్రి తన మూడేళ్ళకాలంలో రాష్ట్ర బడ్జెట్లో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు ఎందుకు కేటాయించలేదో జవాబు చెప్పిన తర్వాతనే కేంద్రాన్ని నిలదీసే అర్హత కలిగివుంటారు. గతంలో ఏం జరిగిందో నేడు అదే పునరావృతమౌతోంది. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ముఖ్యమంత్రిలో మార్పు రావడంలేదు. టీడిపి ప్రాంతీయపార్టీ కాబట్టి సీమ ప్రాంత నేతలు కూడా ఆయన చెప్పిందే వేదంగా శిరసావహిస్తున్నారు. ఎదురుమాట చెప్పలేకున్నారు. తుదకిది అందర్నీ పుట్టిముంచే రోజు దగ్గరలోనే వుంది. హైదరాబాద్ ను విశ్వనగరం చేయాలనే కీర్తి కండూతితో ఆనాడు సీమాంధ్రను నిర్లక్ష్యంచేస్తే ఈరోజు అద్భుత అమరావతి రాజధానిని నిర్మించి చారిత్రక పురుషుడుగా మిగిలిపోవాలనే పెనుభూతం ఆవరించగా సీమలో సాగుతున్న ఉద్యమం ముఖ్యమంత్రిని ఏమాత్రం కదిలించలేకపోతోంది. అవిభక్త మద్రాసు రాష్ట్రం నుండి విడివడిన తదుపరి ఈ సుదీర్ఘకాలంలో ఎక్కువకాలం సీమనుండి వచ్చిన నేతలే ముఖ్యమంత్రులుగా వున్నా సీమనుండి కరవును పారదోలేందుకు వీరిలో ఒక్కరు చొరవచూపలేదు. తుదకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు కూడా ఇదే కోవలో వున్నారనే భావన సీమప్రాంతంలో బలంగా వ్యాపిస్తోంది. ఇందుకు ఒక ఉదాహరణ చాలు. ఆమధ్య అమరావతి ప్రాంతం నుండి కొందరు రైతులు విమానాల్లో సింగపూర్ పర్యటనకు వెళ్ళిన ఫోటోలు, వార్తలు ప్రచురితమైనరోజునే కర్నూలు జిల్లానుండి ఇతర రాష్ట్రాలకు కూలీ పనులకోసం వలస వెళుతున్న రైతులు రైలెక్కుతున్న దృశ్యాలు కూడా మీడియాలో ప్రచురితమయ్యాయి. ఈ రెండు అంశాలను సీమలోని యువత సమాచార మాధ్యమాలలో విస్తృతంగా పోస్టింగులు పెట్టారు. సీమ యెడల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చిన్న చూపుకు ఈ నిదర్శనం చాలని పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం సీమలో ప్రాజెక్టుల యెడల ముఖ్యమంత్రి ఎన్ని ప్రకటనలు చేస్తున్నా సీమ వాసులు నమ్మేస్థితిలో లేరు. ఎందుకంటే యన్టీరామారావు సీమలో మిగులు జలాలతో ప్రతిపాదించిన నాలుగు ప్రాజెక్టులను 1995లో అధికారం చేపట్టిన చంద్రబాబు తన తొమ్మిదేళ్ళకాలంలో దస్త్రాలకే పరిమితం చేశారు. ఆరోజుల్లో ఈ ప్రాజెక్టుల నిర్మాణం పురోగతి సాధించివుంటే ఈరోజు సీమ ఇంతగా అంగలార్చాల్సి వచ్చేది కాదనే భావన సీమ ప్రజల్లో బలంగా ఏర్పడింది. పైగా అనంతపురం జిల్లా పర్యటన పోలీసు జులుంతో ముగించడంతో సీమవాసుల్లో పుండుపై కారం రాసినట్లుగా వుంది.

వ్యాస రచయిత : విశ్రాంతపాత్రికేయుడు
సెల్ : 9848394013


సందర్భం

పీడిత ప్రజా ఉద్యమనేత యద్దనపూడి సోనీ

సంస్మరణ

సింహాద్రి ఝాన్సీ

కార్మిక, రైతు-కూలీ, ప్రజా ఉద్యమ నాయకుడు, ప్రజల మనిషి కా॥యద్దనపూడి సోనీ(60 సం॥లు) గుండె సంబంధ వ్యాధికి గత కొంత కాలంగా చికిత్స పొందుతూ 19-2-18 సోమవారం రాత్రి 7.30కు విజయవాడ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించారు. కా॥ సోనీ మరణవార్తతో రాష్ట్ర వ్యాపితంగా పార్టీ కామ్రేడ్స్, ప్రత్యేకించి కృష్ణాజిల్లా ఉద్యమ సహచరులు, వివిధ కార్మిక యూనియన్ల కార్యకర్తలు, పీడిత ప్రజానీకం తీవ్రంగా కలత చెందారు. మర్నాడు, ఫిబ్రవరి 20వ తేదీ ఉదయంనుండి సాయంత్రం అంతిమ యాత్ర ప్రారంభమయ్యేదాకా వివిధ రాజకీయ పార్టీల - వామపక్షాల నేత లు, ప్రజా సంఘాల నాయకులు, కార్య కర్తలు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, అనేక యూనియన్ల కార్మికులు, వివిధ కాలనీల, గ్రామాల ప్రజానీకం వేలాదిగా హాజరై శోకతప్త హృదయాలతో కామ్రేడ్ సోనీ భౌతిక కాయం వద్ద పూలువుంచి నివాళులర్పించారు.



అంతిమయాత్ర - అంత్యక్రియల సందర్భాల్లో మహిళలు పాల్గొనటాన్ని అనేకులు ఇష్టపడని ఈ రోజుల్లో, తమ ప్రియతమ నాయకుని కడసారియాత్రకు వందలాదిగా శ్రామిక మహిళలు కదలివచ్చారు. కా॥ సోనీ భౌతికకాయాన్ని భుజాలపై మోస్తూ, తమ గౌరవాభిమానాల్ని చాటుకున్నారు. మచిలీపట్నంలోని ప్రధాన కూడళ్ళగుండా దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం సాగిన అంతిమ యాత్రలో వేయిమందిపైగా శ్రామిక ప్రజలు పాల్గొని దివంగత నాయకునికి ఘనంగా నివాళులర్పించారు. కా॥ సోనీ మరణంపట్ల సంతాపం తెలుపుతూ, వివిధ సెంటర్లలో ఆయన చిత్రపటాలు ఏర్పాటుచేయటంతోపాటు, దారి పొడవునా ప్రత్యేకించి ఏఐఎఫ్‌టియు (న్యూ) అనుబంధ కార్మిక కేంద్రాలన్నింటి వద్దా కా॥సోనీ భౌతికకాయంపై పూలవర్షం కురిపించి, జోహార్లతో హోరెత్తిస్తూ ప్రజలే అంతిమయాత్రను - అంత్యక్రియలను నిర్వహించారు.

సాంప్రదాయ కుటుంబం నుండి విప్లవనేత దాకా...

1958 సం॥లో ఆస్తికభావాలున్న సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన కా॥యద్దనపూడి సోనీ(సోమేశ్వర జానకీరామ్), బందరులో డిగ్రీ చదువుతున్న కాలంలోనే నాస్తికభావాలవైపు, తర్వాత నాటి డిఎస్ఓ పరిచయాల్లోకి వచ్చారు. మార్క్సిజాన్ని అవగాహన చేసుకుంటూ, 1980 సం॥నాటికి విప్లవమే వృత్తిగా, విప్లవ రాజకీయాచరణకు జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బందరు ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణ బాధ్యతల్లో భాగంగా పట్టణంలో విద్యార్థుల, శ్రామిక యూనియన్ల ఏర్పాటుతో పాటు పేదల నివాస కాలనీల ఏర్పాటుకు; బందరు పరిసర గ్రామాల్లో తీరప్రాంతవాసుల, రైతాంగ సమస్యలపై నిరంతర, రాజకీయ, ఉద్యమ, నిర్మాణకృషి సాగించారు. దీనికి కళారంగాన్ని సృజనాత్మకంగా జోడించి ప్రజలను విస్తృతంగా సమీకరించి, పలు విజయాలు సాధించారు.

కృష్ణాజిల్లాలో పార్టీ నిర్మాణ బాధ్యతలతోపాటు, 2008లో రాష్ట్రస్థాయిలో ఏర్పడిన ఏపిఎఫ్‌టియు సంస్థకు రాష్ట్రకార్యదర్శిగా, తదనంతర కాలంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శిగా కా॥సోనీ బాధ్యతలు నిర్వహించి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నలు మూలల పర్యటించి కార్మిక సమస్యలపై ఆందోళనల్లో పాలుపంచు కున్నారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కోశాధికారిగా, సహాయకార్యదర్శిగా పలు సందర్భాల్లో వివిధ జిల్లాలలోనూ, రాష్ట్రస్థాయిలోనూ జరిగిన రైతు కూలీ ఆదివాసీ ఉద్యమాలలో అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక పాల్గొని కా॥సోనీ వాటికి అండగా నిలిచారు.

స్ఫూర్తిదాయకమైన కా॥ సోనీ జీవితాచరణ

తన సోదరుడిని, భార్యాపిల్లలను, సాంప్రదాయక భావాలు గల తల్లిని సైతం విప్లవోద్యమానికి తోడ్పడేలా మలచి, తమ ఇంటినే కార్యశాలగా చేసిన కృషి కా॥ సోనీ సొంతం. ప్రజల సమస్యలకు త్వరితంగా స్పందించటం, సమస్యను అధ్యయనం చేసి వేగంగా వారిని ఆందోళనకు సిద్ధంచేయటం కా॥ సోనీ నైజం. ఉద్యమ ప్రజల కుటుంబ, వ్యక్తిగత, ఆరోగ్య తదితర సమస్యలను ఓపిగ్గా విని, సకాలంలో తగిన సూచనలు, సలహాలిచ్చి వారిలో మనోధైర్యాన్ని నింపటం కా॥సోనీ కార్యశైలి.

పురాణ కథలకు జోడించి సమకాలీన రాజకీయాలపై వ్యంగ్యాస్త్రాలను సంధించటం, కఠినమైన రాజకీయ అంశాలను కథల రూపంలో సులువుగా విడమరచటం, ఛలోక్తులు, హాస్యం జోడింపుతో బహిరంగసభ ఉపన్యాసాలను రక్తి కట్టించడం సోనీ ప్రత్యేకత. అందుకే ప్రజలందరితోపాటు చిన్నపిల్లలు మొదలు పార్టీ నాయకుల వరకూ కా॥సోనీ ఉపన్యాసాలను ఆసక్తిగా వినేవారు. కా॥ సోనీ ఈ ప్రత్యేక లక్షణమే నాటి జనసాహితి ఆధ్వర్యంలో బందరులో సమష్టి కార్యశాలలద్వారా చైతన్యరథం, ధరలు బాబోయ్ ధరలు, పరిపాలనా చక్రం వంటి పలు వీధి నాటికలతోపాటు, అప్పటికప్పుడు ప్రదర్శించే స్కిట్స్ (2-3 నిముషాల దృశ్యరూపకం) రూపకల్పనలో విశేషంగా తోడ్పడింది. రాష్ట్రవ్యాపితంగా ప్రజలను సమీకరించటానికి శక్తివంత మైన సాధనమైంది. కా॥సోనీ స్ఫూర్తిదాయక జీవితాచరణను మననం చేసుకుంటూ మన సమస్యల పరిష్కారంకోసమేగాక, ఈ వ్యవస్థ మార్పుకోసం సాగే కృషిలో భాగస్వాములవుదాం. కేంద్ర-రాష్ట్ర పాలకు లు ప్రజలముందు అనేక సవాళ్ళు విసురుతూ, విభజించి-పాలిస్తూ, భ్రమలలో ముంచెత్తుతూ, నిర్బంధాలకు పాల్పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మన కర్తవ్యాలకు పునరంకితమౌదాం.

(25-2-2018న అమరజీవి సోని సంస్మరణసభ మచిలీపట్నం సువర్ణకళామందిర్‌లో జరుగుతున్న సందర్భంగా)


వ్యాస రచయిత : అధ్యక్షులు, రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

గుట్టుగా సాగుతున్న ఔషధ పరీక్షలు

కామిడి సతీష్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో యువకులపై ఐషధ ప్రయోగాల ఉదంతం ఇటీవలి కాలంలో సంచలనం సృష్టిస్తున్నది. కరీంనగర్ జిల్లాలోని జెమ్మికుంట, హుజూరాబాద్ మండలాలలోని గ్రామాలలో అనేక మంది యువకులపై హైదరాబాద్‌లో ఔషధ ప్రయోగాల పరీక్షలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయింది. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని దళారులు ముఠాలుగా ఏర్పడి గ్రామాలలో సంచరిస్తూ లక్షలాది రూపాయల ఎర జూపిస్తూ బలవంతంగా రాజధాని కేంద్రానికి తరలించి వారిపై ఔషధ ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో వందలాది మందుల తయారీ (ఫార్మస్యూటికల్స్) కంపెనీలు ఉన్నాయి. అనేక వ్యాధులను నివారించడానికి మందులను తయారు చేస్తున్నారు. తమ కంపెనీలో తయారైన మందు (డ్రగ్) పనిచేస్తుందో లేదో అని తెలుసుకోవడానికి వాస్తవంగా ఎలుకలు, పందులు తదితరాలపై నిర్వహిస్తారు. కానీ నేడు పలు మందుల కంపెనీలు మానవులపై ప్రయోగాలు చేస్తున్నాయి. అధిక మొత్తంలో నగదును అందజేస్తామని బ్రోకర్లు రంగంలోకి దిగి గ్రామాలలో పనీపాట లేకుండా తిరిగే యువకులకు గాలం వేస్తున్నారు. ఔషధ పరీక్షలు నిర్వహిస్తామని, ఎలాంటి అనారోగ్య సమస్యలు వుండవని నమ్మబలుకుతున్నారు. దళారుల మాయలో పడి మోసపు మాట నిజమని నమ్మి ఔషధ పరీక్షలకు ముందుకు వస్తున్నారు. మరికొంత మందికి వారికి తెలియకుండానే ఔషధ ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

తాజాగా జెమ్మికుంట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఓ యువకుడు పిచ్చిగా మాట్లాడుతుండటం, వాంతులు, విరేచనాలతో బాధపడడటం, నోటి నుండి రక్తం రావటం వంటి లక్షణాలతో ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు నిర్ధారణ చేసి సదరు వ్యక్తిపై ఔషధ పరీక్షలు జరిగాయని తేటతెల్లం చేశారు. అనేక మంది బాధితులు తమపై ఔషధ పరీక్షలు జరిగాయని జమ్మికుంట పోలీసులను ఆశ్రయించారు. నాగంపేట అనే గ్రామంలో ఔషధ పరీక్షలు చేసుకున్న యువకుడు మృత్యువాతపడ్డాడు. తాజాగా కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ పట్టణంలోని గ్యాస్ గోదాం ప్రాంతంలో నివాసముంటున్న ఎర్ర దేవీ ప్రసాద్ అనే వ్యక్తి తనపై 2006 నుండి 2009 సంవత్సరం వరకు హైదరాబాద్‌లో ఉండగా, ఆసమయంలో పలు ఔషధ కంపెనీలు ప్రయోగాలు చేశాయని సాక్షాత్తు వెల్లడించడం ఈ ఉదంతానికి బలం చేకూరుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా ఈ ఔషధ రాకెట్ గత కొన్ని సంవత్సరాల నుండి జరుగుతున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్ జిల్లా నుండి అనేక కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఔషధ ప్రయోగ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కూడా చాపకింద నీరులా విస్తరించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసు శాఖ ఔషధ పరీక్షల రాకెట్టును ఛేదించాలి. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయేమో అనే కోణంలో విచారించాలి. నిజాలను నిగ్గుతేల్చాలి. ఔషధ పరీక్షలు బాధితులను ఆదుకోవాలి.



వ్యాసరచయిత సెల్ : 9848445134

వి-మెయిల్

ఆరాటం ఎక్కువ-పోరాటం తక్కువ - ఆంధ్రా రాజకీయాలు

విభజన హామీల అమలుకై ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రంలో పోరాటం కన్నా ఆరాటం ఎక్కువగా కనపడుతోంది.అది కూడా అందరికీ ఉపయోగపడే అసలు లక్ష్యం కన్నా,తమ పార్టీ కి ఉపయోగపడే వ్యూహం గురించిన చింతనే ప్రాధాన్యత పొందడం బాధాకరం.రాజకీయాల్లో ఉంటూ,రాజకీయ లబ్ది గురించి ఆలోచించకూడదని ఎవరూ అనరు. తమ సొంత ఉనికి, ఎదుగుదలకు సంబంధించిన ప్రాముఖ్యతాంశంలో రాజీ పడడం ఆత్మహత్యా సదృశ్యమే. అయితే ప్రజాప్రయోజనాల కోసం పార్టీ లబ్దిని మించి ఆలోచించాల్సిన అవసరాలు అప్పుడప్పుడూ ఏర్పడతాయి.ఆ సంధికాలంలో ఎలా నడుచుకున్నారు, ఎలా దిశా నిర్దేశం చెయ్యగలిగారు అన్న గీటురాయిపైనే నాయకుడి/పార్టీ విశ్వసనీయత నిర్ధారించబడుతుంది.ఆంధ్రప్రదేశ్ లో వివిధ పార్టీలు,వాటి నేతలు ఈ విషయం పై మరింత పరిపక్వతతతో తమ వ్యవహార శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది.రాజకీయ ప్రయోజనాలకు,రాష్ట్ర ప్రయోజనాలకు మధ్య యోజనాల అంతరం ఉన్నప్పుడు అంతిమ నష్టం తీవ్రం... దీర్ఘకాలికం. గతంలో సమైక్యాంధ్రా ఉద్యమంలో జరిగిన తప్పు మళ్ళీ విభజన చట్టం అమలులో పునరావృతమైతే అంతకన్నా దారుణం మరొకటి ఉండదు.ఇప్పుడు ముఖ్య భాధ్యత అధికార పక్షాలు వహించాలి.మిత్రులైన అధికార పక్షాలు నాలుగేళ్ళా కోలాటం-ఆఖరులో పోరాటం తరహాలో మాట్లాడుతున్నాయి. బీజేపీ తాను రాష్ట్రానికి చేసిన మేలు వివరాలు ప్రజలకు స్పష్టం చెయ్యాలి. టీడీపీ తన వైఖరి,పోరాట వ్యూహంపై స్పష్టత నివ్వాలి.అఖిల పక్షాల్ని కలుపుకుపోవాలి.పక్క రాష్ట్రాల్లో జల్లికట్టు లాంటి చిన్న చిన్న కారణాలకు కూడా అన్ని పక్షాలూ కలిసి పోరాటం చెయ్యగలిగినప్పుడు,ఆంధ్రుల హక్కుల సాధన లాంటి చావుబ్రతుకుల సమస్యలపై కూడా అందరూ ఏకాభిప్రాయానికి రాలేకపోవడం ప్రజలపట్ల ద్రోహమే.

- డా.డి.వి.జి.శంకరరావు, మాజీఎంపీ, పార్వతీపురం.

విశాలాంధ్ర

బతుకు
The Life

శనివారం
24 ఫిబ్రవరి 2018



జోసీపెప్పర్!

జోసీ పెప్పర్...ఈ పేరు కొత్తగా ఉంది కదా...కానీ ఇది మనిషి పేరు కాదు. హ్యూమనాయిడ్ రోబో పేరు. హ్యూమనాయిడ్ రోబో అంటే చూడడానికి అచ్చంగా మనిషిలా కనిపించే రోబో. అంతేకాదు మనిషి మాదిరిగా కాళ్ళు, చేతులూ కదిలిస్తూ పనిచేసే రోబో. కొత్తగా తయారుచేసిన హ్యూమానాయిడ్ రోబో పనితనాన్ని తెలుసుకునేందుకు జర్మనీలోని మ్యూనిచ్ విమానాశ్రయంలో దీనిని ఏర్పాటు చేశారు.

కాలంతో సంబంధం లేకుండా కరువుకాటకాలు పీడిస్తున్న ప్రాంతాలు, నీటి చుక్క కోసం అల్లాడుతున్న ప్రాంతాలు మనదేశంలో చాలానే ఉన్నాయి. ప్రత్యేకించి ఈ సీజన్‌లో అంటే ఎండాకాలంలో ఇలాంటి కథనాలు రోజుకొకటి వెలుగులోకి వస్తూనే ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఏమీ చేయలేక వలసపోయేవాళ్ళు కొందరైతే అపర భగీరథుల్లా తమకు కావాల్సింది సాధించేవరకూ పోరాడేవాళ్ళు మరికొందరు. ఇలాంటి అపర భగీరథుడే చత్తీస్‌ఘర్‌కి చెందిన శ్యామ్‌లాల్. ఆకాశగంగను నేలకు దింపడానికి ఆనాటి భగీరథుడు ఎంత కష్టపడ్డాడో తెలీదు గానీ శ్యామ్‌లాల్ కష్టాన్ని గురించి తెలుసుకుంటే మాత్రం అపర భగీరథుడు అనకుండా ఉండ లేరు. తమ గ్రామంలో జనం జీవితాల కోసం, పశువుల ప్రాణాల కోసం అతను 27 ఏళ్ళుగా విశ్రాంతి లేకుండా, అలుపెరగకుండా, పట్టువదలని విక్రమార్కుడిలా ఒక చెరువు తవ్వుతూనే ఉన్నాడు. దాని విస్తీర్ణం పెంచుతూనే ఉన్నాడు. మరి నిజంగా అతను అపర భగీరథుడే కదా!



అపర భగీరథుడు!

ఏదైనా సమస్య వస్తే మీరు ఎంతవరకూ పోరాడతారు? ఎన్నేళ్ళు పోరాడతారు? సమాధానం చెప్పడం కొంచెం కష్టం కదా! మన హీరో శ్యామ్‌లాల్‌ని అడిగితే మాత్రం జీవితకాలం పోరాడతాను అని ఠక్కున చెప్పేస్తాడు. అదీ అతని గొప్పతనం. అతను మాటల మనిషి కాదు చేతల మనిషి. ఇందుకు నిదర్శనం చత్తీస్‌ఘర్‌లోని కొరియా జిల్లా సజా పహాద్ గ్రామం. శ్యామ్‌లాల్ ఉండేది ఇక్కడే. ఇదే అతని సొంత గ్రామం. కనీసం పక్కవాడి కష్టం గురించి పట్టించుకోవడానికి తీరిక లేని ఈ రోజుల్లో అతను మొత్తం గ్రామం సమస్య గురించి ఆలోచించాడు. ఆ సమస్య పరిష్కారాన్ని తన భుజానికెత్తుకున్నాడు. కరువుతో అల్లాడుతున్న తన గ్రామాన్ని కాపాడుకునేందుకు ఎవరి సాయం లేకుండా ఒంటి చేత్తో కొలను తవ్వాడు. దీనిని పెంచేందుకు ఎప్పటికప్పుడు ఇంకా తవ్వుతూనే ఉన్నాడు. స్థానిక గ్రామస్తులు గానీ అధికార యంత్రాంగం గానీ ఎవ్వరూ అతనికి సాయం చేసేందుకు ముందుకు రాలేదు. అయినా వెనకాడలేదు. గ్రామం ఏమైపోతే నాకెందుకులే అని ఊరుకోలేదు. ఎవరో ఒకరు ఎక్కడో చోట అడుగు ముందుకేయాల్సిందే....లేదంటే ఏ సమస్యలూ తీరవు అనుకున్నాడు శ్యామ్‌లాల్ ఆ ముందడుగు తనే వేశాడు. చెరువు తవ్వాడు. జనం నోటికి నీరందించాడు. జంతువులు చనిపోకుండా బతుకునిచ్చాడు. గ్రామంలో నీటి సంక్షోభాన్ని తీర్చాడు.

ఇంతచేసిన శ్యామ్‌లాల్ ప్రస్తుత వయస్సు ఎంతో తెలుసా? 42 ఏళ్ళు. మరి అతను ఈ చెరువును 27 ఏళ్ళుగా తవ్వుతున్నాడంటే ఏ వయస్సులో ఈ పని ప్రారంభించాడో తెలుసా! కరువు నుంచి తన చుట్టూ ఉన్న జనాన్ని, జంతుజాలాన్ని రక్షించాలనే ఆలోచన వచ్చింది ఏ వయసులోనో తెలుసా? పసిప్రాయం కూడా వీడని 15 ఏళ్ళ వయస్సులో. అవును, అతను ఆ లేత వయస్సులోనే తనొక్కడే చెరువు తవ్వడం ప్రారంభించాడు.

15 ఏళ్ళ వయస్సులోనే అతను ఇలాంటి దృఢనిశ్చయానికి రావడానికీ ఒక కారణం ఉంది. చత్తీస్‌ఘర్‌లోని ఈ సజాపహాద్ గ్రామం అప్పటికే ఎన్నో ఏళ్ళుగా కరువు కోరల్లో చిక్కుకుని ఉంది. ఇది ఎంతోమంది ప్రాణాలు తీసింది. పశువుల ప్రాణాలనూ హరించేసింది. బీడుపడి నోళ్ళు తెరుచుకున్నట్టు అయిపోయిన పంటపొలాలు ఎందుకూ పనిరాకుండా అయిపో యాయి. ఈ ఘటనలన్నీ చూసిన శ్యామ్‌లాల్ చలించిపో యాడు. అందుకే చదువుకోవాల్సిన వయస్సులోనే ప్రజోపయోగ పనికి శ్రీకారం చుట్టాడు.

విచిత్రమేమంటే...ఊరికి ఉపయోగపడే పని మొదలు పెట్టిన శ్యామ్‌లాల్‌కి ఎవరి ప్రోత్సాహమూ లభించలేదు. పైగా ఎందుకొచ్చిన పని ఇది అని తిట్టినవాళ్ళు, విమర్శించినవాళ్ళే ఎక్కువ. ఇవేమీ అతను పట్టించుకోలేదు. తన పని తాను చేసుకుపో యాడు. "నాకెవ్వరూ సాయం రాలేదు. గ్రామ స్తులు గానీ, ప్రభుత్వాధికారులు గానీ.... గ్రామంలో ప్రజల సంక్షేమం కోసం, పశువుల ప్రాణాల కోసం నేనీ పని చేశాను" అని గర్వంగా చెబుతారు 42 ఏళ్ళ శ్యామ్‌లాల్.

ఎక్కడైనా కరువుకాటకాలు వచ్చాయంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ నోరెత్తేవాళ్ళే కనిపిస్తారు గానీ ఇలాంటి మార్పు కోసం ముందడుగు వేసే శ్యామ్‌లాల్ లాంటి వాళ్ళు కనిపిస్తారా? ప్రభుత్వం సంగతి తర్వాత ముందు మనం చేయగలిగింది మనం చేద్దాం అని ఆలోచన శ్యామ్‌లాల్ మాదిరిగా అందరిలో రావాల్సిన అవసరం ఉంది. ఇది ఒక సామాన్యుడు సాధించిన విజయం. అందుకే శ్యామ్‌లాల్ ప్రత్యేకమైన మనిషిగా గుర్తింపు పొందాడు. నిజమైన హీరో అనిపించుకున్నాడు.

సజా పహాద్‌లో గత ఏడాది వరకూ విద్యుత్ కాంతులు కూడా లేవు. చీకట్లోనే మగ్గిపోయింది. ఇదొక్కటే కాదు కమ్యూనికేషన్ వీలుగానీ, రహదారి మార్గాలు గానీ లేవు. అంటే ఈ గ్రామం ఎంతగా వెనకబడి ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి గ్రామంలో శ్యామ్‌లాల్ తన కృషితో కొత్త వెలుగులు నింపాడు. అతను తవ్వింది ఒక్క చెరువే కదా! మరి వెలుగులు ఎక్కడ నుంచి వచ్చాయి అంటారా. అతను చేసిన ఈ పనితో ఆ ఊరి పేరు అందరి దృష్టికి వచ్చింది. ప్రభుత్వాలు, అధికా రుల్లోనూ చలనం వచ్చింది. ఈ గ్రామానికి అదిచేస్తాం, ఇది చేస్తాం అని ఇప్పుడు ప్రకటనలు గుప్పించేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్యామ్ బీహారీ జైశ్వాల్ కూడా ఈ గ్రామాన్ని సందర్శిం చారు. అతను చేసిన పనిని మెచ్చుకుంటూ రూ. 10 వేలు రివార్డును ప్రకటించారు. కొరియా జిల్లా కలెక్టర్ నరేంద్ర దుగ్గల్ కూడా శ్యామ్‌కు బాసటగా నిలుస్తామని హామీనిచ్చారు. "ఏళ్ళకుఏళ్ళుగా కరువులో కూరుకుపోయిన రాష్ట్రం చత్తీస్‌ఘర్. ఇలాంటి ప్రాంతంలో శక్తికి మించిన పని చేసిన శ్యామ్ గురించి ఇటీవలే తెలుసుకున్నాను. గ్రామం కోసం అతను చేసిన పని ప్రశంసనీయమైనది. అతనికి చేయదగిన సాయం చేస్తాను" అని చెప్పారు కలెక్టర్.

కృషి, పట్టుదల, నిరంతర శ్రమకు మారుపేరుగా కనిపించే శ్యామ్‌లాల్ లాంటి మనుషులు మనకి చాలా అరుదుగా కనిపిస్తుంటారు. ఇలాంటి మరోమనిషి జలంధర్ నాయక్ (45) గురించీ మనం ఇటీవలే చదువుకున్నాం. ఒడిషా రాష్ట్రంలోని కంధమాల్ జిల్లా గుంషామి గ్రామానికి చెందిన గిరిజనుడైన జలంధర్ నాయక్ తన పిల్లల చదువుల కోసం రెండేళ్ళు కష్టపడి ఎనిమిది కిలోమీటర్ల పొడవు రోడ్డుని నిర్మించాడు. శ్యామ్‌లాల్ మాదిరిగానే జలంధర్ నాయక్ కూడా ఈ పనిని ఒంటిచేత్తోనే పూర్తి చేశాడు. నిజమైన హీరోలంటే శ్యామ్‌లాల్, జలంధర్ నాయక్ లాంటివాళ్ళే కదా!

– ఎస్.ఎస్

శెనగ వడలు!

శెనగ వడలు అంటే మీరు ఎప్పుడూ ఉపయోగించే పచ్చిశనగపప్పుతో తయారుచేసేవి కాదు. పచ్చి శెనగలతో చేసే వడలు. ఇంకా చెప్పాలంటే పేరంటంలో ఇవ్వడానికి ఉపయోగిస్తారుగా అ శెనగలతో వడలు. కొత్త రుచిని కోరుకునేవారి నోటికి ఇవి భలే మజాగా ఉంటాయి. పైగా మంచి ఆరోగ్యం కోసం గొప్ప పోషకాలనూ అందిస్తాయి. వడలు, బజ్జీలు అంటూ అస్తమానూ బయటకు వెళ్ళకుండా వీటిని ఇంట్లోనే తయారుచేసి చూడండి.




కావలసిన పదార్థాలు

మొలకలు వచ్చిన శెనగలు ఒక కప్పు, మైదాపిండి పావు కప్పు, ఉల్లిపాయ తరుగు పావు కప్పు, పచ్చిమిర్చి ముక్కలు ఒక స్పూన్, అల్లం తరుగు ఒక స్పూన్, కారం పొడి ఒక టీ స్పూన్, కొత్తిమీర తరుగు ఒక స్పూన్, పుదీనా ఆకుల తరుగు ఒక స్పూన్, కరివేపాకు కొద్దిగా, ఉప్పు, నూనె తగినంత

తయారీ విధానం

ముందుగా మొలకలు వచ్చిన శెనగలు తీసుకుని మిక్సీలో వేయండి. ఈ పిండి మరీ మెత్తగా ఉండకూడదు. కొంచెం బరకగా ఉండేలా మిక్సీ పట్టండి. అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలుపుకోండి. ఇందులోనే కొత్తిమీర, పుదీనా ఆకులు, కరివేపాకు రెబ్బలు, ఉప్పు, కారం వేసి కలపండి. ఇప్పుడు కళాయిలో నూనె వేసి సన్నటి సెగ మీద కాగనివ్వండి. నూనె మరిగాక కలిపి ఉంచుకున్న శెనగల మిశ్రమాన్ని చిన్నచిన్న ముద్దలుగా చేతిలోకి తీసుకుని వడల మాదిరిగా ఒత్తుకుని నూనెలో వేయండి. ఇవి రెండువైపులా వేగితే వడలు రెడీ అయినట్టే. ఇవి వేడివేడిగా తింటే చాలా రుచిగా ఉంటాయి.



పెసర పెరుగు వడ!

మినపప్పుతో గారెలు వేసుకోవడం, వాటిని పెరుగులో వేసుకోవడం తెలిసిందే. ప్రత్యేకించి పండగల సందర్భాల్లో వీటిని తయారుచేస్తుంటారు. మరి పెసర వడలు వేసుకోవడం, వాటిని పెరుగులో వేసుకోవడం తెలుసా! ఎప్పుడైనా తయారు చేశారా? లేదంటే ఇప్పుడు తయారుచేసి చూడండి. వేసవి అరంభమైందిగా. ఇకనుంచి అన్నీ చల్లచల్లగా కావాలనుకు నేవాళ్ళకి ఇది మరింత బాగుంటుంది. ఇది ఆరోగ్యకరం కూడా. మినపప్పుతో పోలిస్తే ఇది తేలిగ్గానూ జీర్ణం అవు తుంది. తక్కువ కేలరీలు ఉండడమే కాదు మంచి పోషకాలూ ఉన్నాయి. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే కాదు సాయంత్రం వేళ స్నాక్స్‌గా తినడానికీ ఇది బాగుంటుంది. ఈ పెసర పెరుగు వడను తయారు చేసుకోవడమూ సులభమే. మరి దీని తయారీ విధానం తెలుసుకుందామా!

కావలసిన పదార్థాలు

పెసరపప్పు ఒక కప్పు, పచ్చిమిర్చి ఒక టేబుల్ స్పూన్ , వెన్న తక్కువ ఉన్న పెరుగు రెండు కప్పులు, కారం ఒక టీ స్పూన్, జీలకర్ర పొడి ఒక టీ స్పూన్, ఆవాలు ఒక టీ స్పూన్, ఇంగువ చిటికెడు, ఆయిల్ సరిపడ, ఉప్పు తగినంత, ఈనో (ఫ్రూట్ సాల్ట్) అర టీ స్పూన్.

తయారీ విధానం

పెసరపప్పును బాగా కడిగి రెండు, మూడు గంటలు నీళ్ళల్లో నానబెట్టండి. తర్వాత నీటిని వంపేసి మిక్సీ పట్టండి. తర్వాత పచ్చిమిర్చి వేసి బాగా రుబ్బండి. దీనిని ఒక గిన్నెలోకి తీసుకుని పక్కకు పెట్టుకోండి. ఇందులో చిటికెడు ఇంగువ, ఒకటిన్నర టీ స్పూన్ ఉప్పు కలపండి. గుంటల పెనం తీసుకుని దానికి ఆయిల్ రాసి అతి తక్కువ మంట మీద వేడి చేయండి. ఇక వడలు వేయడానికి ముందు ఈ పిండిలో ఈనో (ఫ్రూట్ సాల్ట్)ని కలపండి. ఇక పిండిని గుంటల పెనంలో వేసి మూతపెట్టి వేగనివ్వండి. రెండువైపులా వేగిన తర్వాత ప్లేట్‌లోకి తీసి పక్కన పెట్టుకోండి. ఒక పెద్ద గిన్నెలో కప్పు పెరుగు వేసి బాగా గిలకొట్టండి. కొంచెం ఉప్పు వేసి మరోసారి గిలకొట్టండి. ఒక పాన్ తీసుకుని పొయ్యి మీద పెట్టి అందులో కొద్దిగా ఆయిల్ వేసి కాగాక ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి తాలింపు పెట్టండి. తర్వాత మంట కట్టేసి అందులోనే గిలకొట్టిన పెరుగు వేసి బాగా కలపండి. తాలింపు వేసిన ఈ పెరుగులో పెసర వడలు వేయండి. ఆ పన కొద్దిగా జీలకర్ర పొడి చల్లండి. ఆపైన ఇంకొద్దిగా పెరుగు వేయండి. ఆ పైన కొద్దిగా కారం చల్లండి. అంటే పెసర పెరుగు వడలు రెడీ. ఈ పెరుగు వడలను నూనెలో వేయించవద్దు. ఇందుకోసం తప్పనిసరిగా గుంటల పెనమే ఉపయోగించండి. అప్పుడే మంచి పోషకాలు అందుతాయి.





అతడు-ఆమె

83



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

"ఓహో! నన్నూ మాలతీని అబ్బాయినీ పంపించేసి - మీరు వక్కరూ సుభతో వుండటానికనా యీ యెత్తు? పింఛను పుచ్చుకుని పదేళ్ళయినా - ఆడదాన్ని చూసేసరికల్లా మతి పోతుంది మీకు. ఏడిసినట్టే వుంది - వెధవ ఎత్తు! అబ్బాయీ! ఎక్కించు మీ నాన్నని ముందు - కారులోకి!"అంది ఆవిడె కోపంతో మండిపోతూ కాళికాదేవిలాగు. తలుపు చాటునుంచి వింటూన్నదాన్ని నాకు పొట్టచెక్కలయ్యేటట్టూ నవ్వొచ్చింది. నవ్వుతే నా దాగుడుమూత బైటపడుతుందని ఆపుకున్నాను నవ్వుని. పతివ్రతాధర్మం అంటే ఇదేకదా అనుకున్నాను!

బంట్రోతులు సామాన్లని కారులో పెట్టేశారు. వెండి సామాన్ల పెట్టెని తను కూర్చుండే స్థలం దగ్గరి పెట్టించి - తమ కారులో యెక్కి - ఆ పెట్టెమీద కాళ్ళు పెట్టుకుని కూర్చున్నారు పార్వతీశంగారు. శివ్వమ్మగారు మాలతి దగ్గిరకొచ్చి, "అమ్మడూ! శృంగవరపుకోట కమాను వెళుతున్నాడే అబ్బాయి. పుల్లమ్మ వదినెకి సుస్తీగా వుందిట చూచి చక్కా వస్తాం అని మీ నాన్న నేనూ అబ్బాయి కూడా వెళుతున్నామే.

(నిన్నటి సంచిక తరువాయి)

మళ్ళీ రేపు సాయంకాలానికి వచ్చేస్తాంలే! మరేం ఫర్వాలేదే - అమ్మడూ! మంత్రసాని యిప్పుడేగా వచ్చివెళతా. ఇంకా వారం రోజుల పైమాటంది. సుభా! నువ్వున్నావుగా! నేను వచ్చేదాకా మాలతిని కాస్త చూస్తుండేం! బంట్రోతులందరూ ఇంట్లోనే వుంటారు - ఇంట్లోనే పడుకుంటారు. అవసరం అయితే పెద్ద దొరసానికి మంత్రసానికి ఖబురు పెట్టండి. మరి నేనింక వెళ్ళి వత్తునా అమ్మడూ!" అంటూ వకచేత వెండి టిఫిను కేరియరు, రెండవచేత సందుకుపెట్టి పట్టుకుని కారులో కూచుంది. "జనే! నా రావుసాహెబు సనద్దూ - నా పింఛను కాగితాలూ - ఇనస్పెట్టిలో మచ్చిపోయానే! నేవెళ్ళితెస్తా" అంటూ పార్వతీశం గారు కారులోంచి దిగబోయారు. "ఈ మిష పెట్టుకుని మళ్ళీ యింట్లోకి వెళ్ళదానికాయెత్తు? మీ తెలివి మండినట్టేవుంది. అవన్నీ నా జవాహిరి పెట్టెలో వున్నాయిలెండి. అబ్బాయి! వారే! నుప్పీపాళంగా - కారుని బయలుదేరించకపోతే - నా కాపురానికి నీళ్ళు వదులుకోవలసిందే!" అని శివ్వమ్మగారు విరుచుకు పడింది. మదనం నా దగ్గరికొచ్చి "రాత్రి జరిగిన సంగతి నేను మర్చిపోయానులెండి! చూడండి - జపానువాళ్ళు కనుక మనింటికి వచ్చి, నా గురించి అడిగితే - ఎదురు సన్నాహం స్వాగతం ఇవ్వడానికి అనకాపల్లి స్వయంగా వెళ్ళాను అని వాళ్ళతో చెప్పి - సైకిలు బంట్రోతు చేత, నాకు సాలూరూ, బొబ్బిల ఖబురు తోలీయండి. మర్చిపోకండేం ! టా-టా !" అంటూ కారెక్కాడు. కారు బయలుదేరి రెండడుగులు నడచిందో లేదో - శివ్వమ్మగారు "సుభా ! డాబామీద కొత్త చింతపండు ఎండలో వుండిపోయింది - సాయంకాలం కొట్టుగదిలో దింపించెయ్యేం! నేను వెళుదునా?" అంది కారులోంచి తొంగిచూస్తూనూ...

కారు వెళ్ళిపోయింది - ఇంట్లోకెళ్ళాను. అప్పటి కప్పుడే పన్నెండున్నరైంది. మాలతీకి అసలు విషయం తెలీదు. నేనూ చెప్పలేదు. భోజనం చేసి మేమిద్దరం పిచ్చాపాటి చెప్పుకుంటూ చిన్న కునుకు తీశాం... చిన్న కునుకనే అనుకున్నాం. లేచి గడియారం చూసు కునేసరికి నాలుగు! వెంకయ్యగారింకా కాఫీ పెట్టలేదా - ఆయనింకా చుట్టకాలుస్తూ అరుగుమీద కూచున్నాడుకాంసును - అని నేను వీధిలోకెళ్ళాను.

...వీధినిండా జనం. అందరూ ఆకాశం వేపు చూస్తున్నారు. కెరటాల్లా కొట్టుకొస్తున్నాయి - తూర్పునుంచి ఏరోప్లేన్లు పూళ్ళోకి. చెవులు బద్దలయ్యేట్టు చప్పుడు. "జపానువాడొచ్చాడు! జపాను ప్లేన్లొచ్చాయి!" అని జనం కేకలు. సర్కసు వినోదం చూస్తున్నట్టు - బాణాసంచా ఆనందిస్తున్నట్టు ప్రజ మహా సరదాగా వున్నారు. ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్న ఆప్తబంధువుకి ఇచ్చే స్వాగతం! కాశీకి వెళ్ళిన కొడుకు రాక కోసం కాటికి కాళ్ళు చాపుకుని కూచున్న ముసలమ్మ కళ్ళయెదుట కుర్రాడు ప్రత్యక్షం అవుతే కలిగిన మహదానందం దుష్టశిక్షణకీ శిష్టరక్షణకీ ధర్మ సంస్థాపనకీ నారద తుంబురులు దేవాధిదేవతలు వేదగానం చేస్తూ వరుణదేవుడు పుష్పవర్షం కురుపిస్తుంటే పుష్పరథం మీద శ్రీ మహావిష్ణువే స్వయంగా భూమిమీద దిగుతూంటే భూ ప్రపంచం ప్రజలంతా "ధన్యోస్మి ధన్యోస్మి !" అని చేసే ఆహ్వానం!



"జపాను వాడొచ్చాడు జపాను ప్లేన్లొచ్చాయి! స్వరాజ్యం తీసుకొచ్చాడు : రండి! రండర్రా రండి!" అని ప్రజోత్సాహం! "జపాను వాడొచ్చాడు! బోసు బాబొచ్చాడు! స్వరాజ్య మహాప్రసాదం పంచిపెడుతున్నాడు! పార్రండర్రా! పార్రండి!" అని లక్షలాది ప్రజ కోలాహలం. నవ్వులు, చప్పట్లు-శంఖారావం-బాజా భజంత్రీలు-సన్నాయిమేళం - బ్యాండు వాద్యం - జేగంటలు -జయభేరీలు-వీరందరి హృదయాల్లో మారుమ్రోగుతున్నాయి....

ప్లేన్ల చప్పుడు నిమిషనిమిషానికి హెచ్చిపోతుంది. కోటి తుమ్మెదలొక్కసారి చెవిలో ఝుంకారం చేస్తున్నట్టు, లక్ష తారాజువ్వలొక్కమాటు ఆకాశాన్ని దూసుకు పోతున్నట్టు, వెయ్యి రైలింజన్లు ఒక్క పాళంగా నా గుండెలమీద నుంచి నడిచి వెళుతూన్నట్టు, వెయ్యి స్టీమర్లువొక్కసారి ములిగిపోతూ మోత పెట్టినట్టు, పది లక్షల సైరెన్లు ఒక్కపెట్టున గుక్కవిడవకుండా యేడ్చినట్టు... జూంజూం జాయ్ - జూం జూమ్ జాయ్...!!!

"సుభా - సుభా!" అని ఇంట్లోనుంచి మాలతి పిలుపు. ఇంట్లోకెళ్ళాను. ఏరోప్లేన్ల చప్పుడా యేమిటి? జపాను ప్లేనా యేమిటి కొంపతీసి? మాట్లాడవేమే సుభా?" అని మాలతి వెర్రి దానిలా కేకవేస్తూంది. నాకేం జవాబు చెప్పడానికి పాలుపోలేదు. "నువ్వు గాభరాపడకే-బ్రిటీషు ప్లేన్లూ అమెరికను ప్లేన్లూ దొంగయుద్ధం చేస్తున్నాయే!!" అన్నా. అంటూనే వున్నాను. "ఢామ్-ధన్-ధన్-ఢామ్!" అని బాంబుల చప్పుడు, మధ్యమధ్య "గభీ-గుభీ-దభీ-దుభీ!" అని ఫిరం గుల శబ్దం. ఆపేలుడుకి ఈ పేలుడుకి మధ్య చిరతలతో లయవేసినట్టు - "టక్-టక్-టప్-టప్-పట్-పట్!"అని మెషీను గన్నుల మోత...

ఒక్కొక్క చప్పుడికి "మొర్రో!" అని మాలతి కేకలు. ఆ కేకలికి గుండెలే ఆగిపోతాయో - మూర్ఛే వస్తుందో - గర్భస్రావమే అవుతుందో - పురుడే వస్తుందో - అని నా కొకటే బెంగ! ఏం చెయ్యడానికి నాకు తోచలేదు. మాలతి పరుపుకి చిన్న చిరుగుండడం చూసి - చిగురులోంచి కొంచెము దూదిలాగి ఆమె చెవుల్లో కుక్కేను. ఫాస్కులో వేడి పాలతో "ఓవల్టయిను" కలిపి ఇచ్చి - నిద్రపట్టే సాధనం యేమిటా అని ఆలోచించాను. జ్ఞాపకం వొచ్చింది...అమ్మ, నేను లండను నుంచి స్పెయిసుకి ప్లేసులో బయలుదేరడం - ప్లేను ప్రయాణం అంటే నాకు అమిత భయం - ప్లేసులో మాతోకూడ క్రిస్టఫర్ కాడ్‌వెల్ ఫ్రాంకోమీద యుద్ధానికి అంబు లెన్సులో స్పెయిసుకి ప్రయాణం చేసే ముందు ప్యారిస్ వెళ్ళడం, అప్పుడు అతను చిన్న మాత్రల సీసా నాకు నవ్వుతూ ఇవ్వడం-ఒక మాత్ర వేసుకునే సరికల్లా హాయిగా నిద్రపట్టటం ...పాపం కాడ్వెల్ మరి తిరిగి రాలేదు - యరావా యుద్ధంనుంచి - ఏం మనిషి ఏం- మనిషి! అతని మూర్తి నా హృదయంలో హత్తుకు పోయింది... మాలతి "సుభా! అని పిలవడంతో-వెంటనే నా చేతిసంచిలో మూలపడి వున్న సీసాని వెతికి-నాలుగు మాత్రలు తీసి - మాలతికి మంచి నీళ్ళతో మింగించి - సంబాళిస్తూ ఆమెదగ్గర కూచున్నాను.

...బాంబుల బీభత్సం - ప్లేన్ల ఘీకారం - శతఘ్నుల పిడుగుల ఫిరంగుల రణభేరి - తుపాకుల చిటికెలు - మెషీనుగన్నుల లయ-ఆకాశాన పిశాచాల పాటకచేరీ సాగుతూనేవుంది. ఒక్కొక్క మాటు ఉరుము ఉరిమినప్పుడల్లా - వార్సా - బ్రెసెల్సు - రీమ్సు - ఆమ్‌స్టెర్‌డామ్ - పారిస్ - లండను జ్ఞాపకం వచ్చేవి. ఒక్కొక్క శబ్దం చెవుల్లో పడేసరికల్లా - గర్దర్లతో గుండెలమీద గుద్దినట్టయ్యేది ఆ దెబ్బకి గుండె పేలిపోయిందనే అనుకునేదాన్ని. ఊపిరి మళ్ళీ తీయగలిగేసరికీ 'ఫర్వాలేదు - గుండెకాయ అతుక్కుని మళ్ళీ పనిచేస్తుంది' అని ధైర్యం తెచ్చుకునేసరికల్లా - మళ్ళీ 'ధణేల్' అని వెనకటి దానినిమించిన బాంబు చప్పుడు మరొకటి... ఊపిరికీ మధ్య మృత్యుదర్శనం. ఘడియ ఘడియకీ నడుమ మారణగండం, నిమిష నిమిషానికి నరకజ్వాలలు, తృటి తృటికి కోటిరాక్షసుల కేరింతలు, లిప్తలిప్తకీ యమకింకరుల వికటాట్టహాసాలు...అంతానిశ్శబ్దం! చిటికెలో మళ్ళీ ప్రారంభం... ఐదుగంటల వరకు యీ మృత్యువిహారం సాగింది...మాటు మణిగింది. మళ్ళీ ఆరంభం అవుతుందేమో అని - ఊపిరి బిగబట్టి నిరీక్షణ...ఒక నిమిషం- పదినిమిషాలు- అరగంట - అంతా నిర్మానుష్యం. ఈ ఘడియకి ప్రమాదం తప్పిందనుకున్నాను....

మాలతికి నిద్రపట్టినట్టుంది. చప్పుడు చేయకుండా డాబా మీదకెళ్ళి నాలుగు దిక్కులూ ఊరు పరికించి చూశాను. హార్బరులో స్టీమరుగొట్టాలు, పడవల కొయ్యలు కనిపిస్తున్నాయి. పాత స్నేహితుడిలాగు దీప స్తంభం పలకరిస్తుంది. ఏనుగు వీపులాగుంది - ఏరాడ కొండ. వీపుమీద అంబారీలాగుంది మేరీ గుడి. వైదిక బ్రాహ్మడి ముఖంమీద విభూతి పిండికట్లలాగు అస్తమిస్తూన్న సూర్యబింబంమీద మేఘాలు రేఖలని చిత్రించాయి. సూర్యనారాయణమూర్తి చిరునవ్వుకాంతులు. హార్బరులో గిడ్డంగి రేకులమీదపడి అమృతసరం స్వర్ణదేవాలయమేమో - అని క్షణ మాత్రం భ్రమింపజేశాయి. అరుణుడి ఆఖరు కిరణాలు ఎండుతూన్న చింతపండు మీద వాలేయి. శివ్వమ్మగారు పారిపోతూ పోతూ నాకు పురమాయించిన పని జ్ఞాపకం వొచ్చింది.

పగడాల పేరులా మెరుస్తూన్న చింతబొట్ట నొకదాన్ని అప్రయత్నంగా నోటిలో వేసుకున్నా. పుల్లపుల్లగా తియ్యతియ్యగా నోటికి తగిలేసరికి - చిన్నతనపు తెలంగాణా రోజులు జ్ఞప్తికి కొచ్చాయి. చింతగింజల పలుకులతో సంగడి కాచుకుని - చింతబొట్టు నంజుకుని - ఆకలి తీర్చుకొనేవాళ్ళం - ఇంటిల్లిపాదిన్నీ. చిరిగిన లుంగీ, వీపులేని చోలీ - ఈవేళ అమ్మ వేసుకుంటే రేపు నేను వాటిని వేసుకునేదాన్ని. అవి యెవరు వేసుకుంటే వాళ్ళం యింట్లో ఖైదు కూచోవలసిందే. వీధిలోకి వెళితే మానభంగం అయేది. ఆముదాలు కాచి - దీపపు సెమ్మా పెట్టుకునే వాళ్ళం అమావాస్య రాత్రిళ్ళకి. జన్మానికో శివరాత్రి లాగు ఎప్పుడేనా ఏ ఇరుగు పొరుగువాళ్ళో కూరగాయలిస్తే ఆముదపు నూనెతోనే తిరగమోత - ఆముదపునూనే తలకి. చెన్న పట్నం చేరుకుని పదేళ్ళవుతూంది. అదో ప్రపంచం! ఇదో ప్రపంచం! కొత్త జన్మ, కొత్త తల్లిదండ్రులు, కొత్త తోబుట్టువులు, కొత్త హృదయంలో విప్లవ జ్వాల, మనసులో నూతనసృష్టి రభస.

- ఇంకా వుంది.

అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌ను ఏ జట్టు నిలబెట్టుకుంది ?

కరెంట్ ఎఫైర్స్ బిట్‌బ్యాంక్



1. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం- డబ్ల్యూఈఎఫ్) సదస్సు తరహాలో అమరావతిలో ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్థాయిలో 'ఆనంద నగరాల సదస్సు(హ్యాపీ సిటీస్ సమ్మిట్)ను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ తొలి సదస్సు ఎప్పుడు జరుగుతుంది ?
1. 2018 ఏప్రిల్ 10 నుంచి 12 వరకు
2. 2018 ఏప్రిల్ 12 నుంచి 14 వరకు
3. 2018 ఏప్రిల్ 14 నుంచి 16 వరకు
4. 2018 ఏప్రిల్ 16 నుంచి 18 వరకు

2. కంబోడియా, భారత్‌ల మధ్య 2018 జనవరి 27న ఎన్ని ఒప్పందాలు కుదిరాయి ?
1. రెండు ఒప్పందాలు
2. మూడు ఒప్పందాలు
3. నాలుగు ఒప్పందాలు
4. ఎనిమిది ఒప్పందాలు

3. ప్రముఖ దర్శక నిర్మాత యాశ్‌చోప్రా పేరుతో సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నేషనల్ యాశ్‌చోప్రా మెమోరియల్ అవార్డును 2017 సంవత్సరానికిగాను ఎవరికి ప్రకటించారు ?
1. కవితా కృష్ణమూర్తి
2. అనురాధ పౌడ్వాల్
3. ఆశాభోంస్లే
4. లతామంగేష్కర్

4. పాతికేళ్ల తన సర్వీసులో రూ.961.92 కోట్లకు సంబంధించి పన్ను ఎగవేతదారులను గుర్తించిన ఇంటెలిజెన్స్ అధికారికి రాష్ట్రపతి అవార్డు దక్కింది. ఆయన పేరు ఏమిటి ?
1. దిలీప్ షెనాయ్
2. అనిల్ చౌహాన్
3. రవిదత్ శంకర్
4. విజయ్ కేశవ్ గోఖలే

5. లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?
1. రామచంద్ర ఎన్ గల్లా
2. ప్రభాకరనాయుడు
3. భరత్ భూషణ్
4. మీగడ రామలింగస్వామి

6. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎంతమంది శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం సిఫారసు చేయగా, దానికి రాష్ట్రపతి 2018 జనవరి 20న ఆమోదం తెలిపారు ?
1. 18 మంది 2. 20 మంది
3. 22 మంది 4. 24 మంది

7. గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఎన్నో స్థానంలో నిలిచింది ?
1. 1వ స్థానం 2. 2వ స్థానం
3. 3వ స్థానం 4. 4వ స్థానం

8. ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం- డబ్ల్యూఈఎఫ్) 48వ వార్షిక సదస్సు 2018 జనవరి 23-26 తేదీల మధ్య ఎక్కడ జరిగింది ?
1. మాడ్రిడ్ (స్పెయిన్)
2. హెల్సింకీ (ఫిన్లాండ్)
3. ఓస్లో (నార్వే)
4. దావోస్ (స్విట్జర్లాండ్)

9. జాతీయ భద్రతా దళం (ఎన్‌ఎస్‌జీ) నూతన డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు ?
1. విజయ్ కేశవ్ గోఖలే
2. సుదీప్ లఖ్టాకియా
3. అనిల్ చౌహాన్
4. రవిదత్ శంకర్

10. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్ర అటార్నీ జనరల్‌గా ప్రముఖ భారతీయ- అమెరికన్ న్యాయవాది నియమితులయ్యారు. ఆయన పేరు ఏమిటి ?
1. శంతను నారాయెణ్
2. అజయ్‌పాల్‌సింగ్ బంగా
3. ఫ్రాన్సిస్కో డిసౌజా
4. గుర్బీర్ ఎస్ గ్రేవల్

11. జాతీయ టీ 20 లీగ్‌ను ఏ జట్టు కైవసం చేసుకుంది ?
1. తమిళనాడు 2. మహారాష్ట్ర
3. ఢిల్లీ 4. ఉత్తరప్రదేశ్

12. భారత తదుపరి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా కేంద్రప్రభుత్వం ఎవరిని నియమించింది ?
1. రంజిత్ కుమార్
2. అశోక్ లవాసా
3. సునీల్ అరోరా
4. ఓంప్రకాశ్ రావత్

13. విదేశాంగశాఖ నూతన కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారు ?
1. సుదీప్ లఖ్టాకియా
2. విజయ్ కేశవ్ గోఖలే
3. మనీషా సింగ్
4. హరీశ్ మన్వానీ

14. భారత్- ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్) శిఖరాగ్ర సమావేశం 2018 జనవరి 25, 26 తేదీల్లో ఎక్కడ జరిగింది ?
1. న్యూఢిల్లీ (భారత్)
2. కౌలాలంపూర్ (మలేషియా)
3. బ్యాంకాక్ (థాయ్‌లాండ్)
4. జకార్తా (ఇండోనేషియా)

15. ఆస్ట్రేలియన్ ఓపెన్- 2018 పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ?
1. మారిన్ సిలిచ్ (క్రోయేషియా)
2. నొవాక్ జకోవిచ్ (సెర్బియా)
3. రఫెల్ నాదల్ (స్పెయిన్)
4. రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)

16. ప్రస్తుతం ఏ ప్రాంతంలో 9 వేల ఏళ్లనాడు జీవించిన ఒక కౌమార ప్రాయ యువతి ముఖాన్ని శాస్త్రవేత్తలు పునఃనిర్మించి దానికి దాన్ (ప్రభాతం - గ్రీకులో అవ్‌గి) అని పేరు పెట్టారు ?
1. గ్రీకు 2. ఈజిప్టు
3. టర్కీ 4. ఇరాన్

17. భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ రికార్డుస్థాయిలో ఎన్నోసారి జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు ?
1. ఆరోసారి
2. ఏడోసారి
3. ఎనిమిదోసారి
4. తొమ్మిదోసారి

18. ప్రో రెజ్లింగ్ లీగ్ - 3లో ఏ జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది ?
1. పంజాబ్ రాయల్స్
2. ఢిల్లీ సుల్తాన్స్
3. వీర్ మరాఠాస్
4. యూపీ దంగల్

19. భారత సైన్య కొత్త డీజీఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్)గా 2018 జనవరి 30న ఎవరు బాధ్యతలు స్వీకరించారు ?
1. లెఫ్టినెంట్ జనరల్ శరత్‌చంద్
2. లెఫ్టినెంట్ జనరల్ రణబీర్ సింగ్
3. లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్
4. లెఫ్టినెంట్ జనరల్ సురేశ్ శర్మ

20. ప్రపంచంలో అతిపెద్ద గాలిశుద్ధి టవర్‌ను ఏ దేశం నిర్మించింది ?
1. చైనా 2. జపాన్
3. అమెరికా 4. జర్మనీ

21. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యం ఉన్న బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5 పరీక్ష 2018 జనవరి 18న విజయవంతమైంది. ఈ క్షిపణి పరిధి ఎంత ?
1. 2 వేల కిలోమీటర్లు
2. 3 వేల కిలోమీటర్లు
3. 4 వేల కిలోమీటర్లు
4. 5 వేల కిలోమీటర్లు

22. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఎగ్జిక్యూటివ్ బోర్డు కొత్త చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ?
1. హరీశ్ మన్వానీ
2. రవిదత్ శంకర్
3. దిలీప్ షెనాయ్
4. గుర్బీర్ ఎస్ గ్రేవల్

23. ప్రతిష్ఠాత్మక టాటా స్టీల్ ఛాలెంజర్స్ చెస్ - 2018 టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ?
1. అమిన్ బాస్సెమ్
2. విదిత్ సంతోష్ గుజరాతి
3. గిర్యా ఓల్గా
4. బోక్ బెంజమిన్

24. దేశంలో యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ఎన్ని పథకాలను ప్రవేశపెట్టింది ?
1. 2 పథకాలు 2. 3 పథకాలు
3. 4 పథకాలు 4. 5 పథకాలు

25. ఆస్ట్రేలియన్ ఓపెన్-2018లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ?
1. కరోలినా వోజ్నియాకి (డెన్మార్క్)
2. హలెప్ (రుమేనియా)
3. తిమియా బబోస్ (హంగేరి)
4. ఎలీనా వెస్నినా (రష్యా)

26. 2018వ సంవత్సరానికిగాను దేశంలో వివిధ రంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఎంతమందికి ప్రతిష్ఠాత్మక 'పద్మ' పురస్కారాలను భారత ప్రభుత్వం 2018 జనవరి 25వ తేదీన ప్రకటించింది ?
1. 73 మందికి
2. 75 మందికి
3. 83 మందికి 4. 85 మందికి

27. అణ్వాయుధ నిరోధానికి కృషిచేస్తున్న ప్రముఖ సంస్థ 'ఆస్ట్రేలియా గ్రూప్' (ఏజీ)లో 2018 జనవరి 19న ఏ దేశానికి సభ్యత్వం లభించింది ?
1. ఇండోనేషియా 2. థాయ్‌లాండ్
3. భారత్ 4. మొజాంబిక్

28. అంధుల క్రికెట్ ప్రపంచకప్‌ను ఏ జట్టు నిలబెట్టుకుంది ?
1. ఆస్ట్రేలియా 2. ఇంగ్లాండ్
3. దక్షిణాఫ్రికా 4. భారత్

29. భారత్ ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ పేరుతో 2018 జనవరి 29న పోస్టల్ స్టాంపు విడుదలైంది. ఆయన పేరు ఏమిటి ?
1. డాక్టర్ తలిమెరెన్ ఆవో
2. నెవిల్లెడె డిసౌజా
3. సుబిమల్ చుని గోస్వామి
4. పీటర్ తంగరాజ్

30. 2017 సంవత్సరపు పదంగా ఏ పదాన్ని ఆక్స్‌ఫర్డ్ హిందీ నిఘంటువు ఎంపిక చేసుకుంది ?
1. నోట్ బందీ
2. ఆధార్
3. మిత్రోస్
4. గోరక్షక్

31. 'మీర్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా అందిస్తున్న విశిష్ట సేవలకు, మానవ హక్కుల పరిరక్షణపై కల్పిస్తున్న అవగాహనకుగాను ఏ బాలీవుడ్ నటుడికి డబ్ల్యూఈఎఫ్ పురస్కారం దక్కింది ?
1. అమితాబ్ బచ్చన్
2. షారుఖ్ ఖాన్
3. హృతిక్ రోషన్
4. అమీర్ ఖాన్

32. ప్రపంచవ్యాప్తంగా తనదైన ఫర్నిచర్ సామ్రాజ్యాన్ని స్థాపించిన అపర కుబేరుడు, ఐకేఈఏ వ్యవస్థాపకుడు 2018 జనవరి 27న మరణించారు. ఆయన పేరు ఏమిటి ?
1. హెర్మన్ వుక్
2. ఇంగ్వర్ కంప్రాడ్
3. బిల్లి గ్రాహమ్
4. జాన్ మెక్‌కెయిన్

33. ఇండోనేషియా మాస్టర్స్-2018 టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
1. కరోలినా మారిన్ (స్పెయిన్)
2. పి.వి.సింధు (భారత్)
3. సైనా నెహ్వాల్ (భారత్)
4. తైజు యింగ్ (తైవాన్)

34. 2018 జనవరి 27 నుంచి 31 వరకు 'జీవకణ శాస్త్రం' అంతర్జాతీయ సదస్సు - 2018 ఎక్కడ జరిగింది ?
1. హైదరాబాద్
2. గాంధీనగర్
3. తిరువనంతపురం
4. భువనేశ్వర్

35. ప్రముఖ నేత్ర చికిత్స పరిశోధన సంస్థ శంకర నేత్రాలయ ప్రతియేటా అందజేసే ప్రతిష్ఠాత్మక ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పురస్కారానికి ఏ ఏడాది ఎవరు ఎంపికయ్యారు ?
1. చిత్ర అయ్యర్
2. బాంబే జయశ్రీ
3. వాణీ జయరాం
4. ఎం.ఎం.శ్రీలేఖ

36. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 32వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎవరికి విశిష్ట జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు ?
1. రామలింగస్వామి
2. భరత్ భూషణ్
3. నీలా రాంగోపాల్
4. ఎం.మంజునాథ్

సమాధానాలు

1. 1	2. 3	3. 3	4. 3
5. 4	6. 2	7. 2	8. 4
9. 2	10. 4	11. 3	12. 4
13. 2	14. 1	15. 4	16. 1
17. 3	18. 1	19. 3	20. 1
21. 4	22. 1	23. 2	24. 3
25. 1	26. 4	27. 3	28. 4
29. 1	30. 2	31. 2	32. 2
33. 4	34. 1	35. 3	36. 2



టీఎస్‌ఎన్‌పీడీసీఎల్లో 2,553 ఉద్యోగాలు

వరంగల్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్‌ఎన్‌పీడీసీఎల్).. 2,553 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు : జూనియర్ లైన్‌మ్యాన్ (జేఎల్‌ఎం).

వేతనశ్రేణి : రూ.15,585-రూ.25,200.

సర్కిళ్ల వారీ ఖాళీలు : వరంగల్-575, కరీంనగర్-674, ఖమ్మం-365, నిజామాబాద్-500, ఆదిలాబాద్-439.

అర్హతలు : పదోతరగతి/తత్సమాన విద్యతోపాటు ఎలక్ట్రికల్/వైర్‌మ్యాన్ ట్రేడ్‌లో ఐటీఐ/ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో రెండేళ్ల ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు : 2018, జనవరి 1 నాటికి 18-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఔట్‌సోర్స్ ఉద్యోగుల వయసును.. కాంట్రాక్టులో చేరిన నాటి నుంచి పరిగణనలోకి తీసుకుంటారు.

ఎంపిక : రాతపరీక్ష, పోల్ క్లైంబింగ్.


రాతపరీక్ష విధానం : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 80 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో సెక్షన్ 'ఎ'లో 65 ప్రశ్నలు సంబంధిత ఐటీఐ ట్రేడ్ నుంచి సెక్షన్ 'బి' లో 15 ప్రశ్నలు జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ నుంచి ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇన్ సర్వీస్ అవుట్ సోర్స్ అభ్యర్థులకు ఆయా కేటగిరీలను బట్టి గరిష్ఠంగా 20 మార్కుల వరకు వెయిటేజీ ఇస్తారు. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారికి పోల్ క్లైంబింగ్ నిర్వహించిన అనంతరం తుది ఎంపిక ఉంటుంది.

దరఖాస్తు రుసుం : రూ.220 (అప్లికేషన్ ఫీ-రూ.100+ఎగ్జామినేషన్ ఫీ-రూ.120); ఎస్సీ/ఎస్టీ/బీసీ కేటగిరీలకు ఎగ్జామినేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 19, 2018.

వెబ్‌సైట్ : tsnpdcl.cgg.gov.in



ఎయిర్ ఇండియాలో 500 ఉద్యోగాలు

500 క్యాబిన్ క్రూ పోస్టులకు భర్తీకి పెళ్లి కాని యువతీ యువకుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఎయిర్ ఇండియా ప్రకటన విడుదల చేసింది.

పోస్టు : క్యాబిన్ క్రూ.

మొత్తం ఖాళీలు : 500 (పురుషులు-163+ మహిళలు-337).

రీజియన్ల వారీ ఖాళీలు : నార్తర్న్ రీజియన్ (ఢిల్లీ)-450 (పురుషులు-150+ మహిళలు-300); వెస్టర్న్ రీజియన్ (ముంబై)-50 (పురుషులు-13+ మహిళలు-37).

వేతనం : శిక్షణలో స్టైపెండ్ నెలకు రూ.15,000; ఉద్యోగంలో చేరాక మొదటి ఏడాది రూ.18,400. దీంతోపాటు ఫ్లైయింగ్ అలవెన్సు-రూ.21,125, ఇంటర్నేషనల్ క్యూటీఏ తదితరాల కింద అదనపు చెల్లింపులు ఉంటాయి.

అర్హతలు : ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యతోపాటు ఏదైనా షెడ్యూల్డ్ ఎయిర్‌లైన్స్‌లో క్యాబిన్ క్రూగా పనిచేస్తూ, కనీసం ఏడాది అనుభవం కలిగి ఉండాలి. అలాగే ఏదైనా ఎయిర్‌బస్/బోయింగ్ ఫ్యామిలీ ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించిన సెప్ (ఎస్‌ఈపీ) ఉండాలి. అలాగే ఇంగ్లిష్, హిందీ భాషల్లో పట్టు తప్పనిసరి. శారీరక, ఆరోగ్య ప్రమాణాలు : ఎత్తు-పురుషులు కనీసం 172 సెం.మీ., మహిళలు కనీసం 160 సెం.మీ. ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలతో పాటు ఈశాన్య రాష్ట్రాల అభ్యర్థులకు 2.5 సెం.మీ. సడలింపు ఇస్తారు; బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)- పురుషులకు 18-25 లోపు, మహిళలకు 18-22 లోపు ఉండాలి. అలాగే తగిన దృష్టి సామర్థ్యం (ఎన్/5, ఎన్/6బీ 6/6, 6/9), ఇషిహార/టోక్యో మెడికల్ కాలేజ్ చార్ట్ మేరకు తగిన కలర్ విజన్ ఉండాలి. అలాగే స్పష్టంగా మాట్లాడగలగాలి.

వయసు : దరఖాస్తు గడువు ముగిసే నాటికి 18-35 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక : మెడికల్ ఎగ్జామినేషన్, రాతపరీక్ష.

దరఖాస్తు రుసుం : రూ.1,000; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 12, 2018.

వెబ్‌సైట్ : airindia.in

విశాలాంధ్ర బిజినెస్

322.65 ▲ సెన్సెక్స్ 34,142.15	108.35 ▲ నిఫ్టీ 10,491.05	బంగారం (విజయవాడ) 29,000 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 29,140 ప్రొద్దుటూరు 29,090 22 క్యారెట్లు, 10 గ్రాములు	-100 ▼ వెండి (విజయవాడ) 39,700 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,600 ప్రొద్దుటూరు 41,456 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 64.73

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా స్టీల్	677.80	6.26
సన్‌ఫార్మా	570.20	5.17
ఎస్ బ్యాంక్	323.60	2.28
భారతీ ఎయిర్‌టెల్	427.65	2.26
రెడ్డీ ల్యాబ్స్	2,183.65	2.26

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఏషియన్ పెయింట్స్	1,101.90	-1.29
కోల్ ఇండియా	310.55	-0.48
ఇన్ఫోసిస్	1,155.65	-0.42
ఎం&ఎం	724.30	-0.22
హెచ్‌యూఎల్	1,329.95	-0.16

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.04	64.73
యూరో	79.93	79.71
పౌండ్	90.38	90.64
ఆస్ట్రేలియా డాలర్	50.93	50.67
సింగపూర్ డాలర్	49.26	49.00

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,140	31,165
చెన్నై	29,140	31,165
బెంగళూరు	28,550	30,534
ముంబై	29,910	31,165
విజయవాడ	29,000	31,500
విశాఖపట్నం	29,140	31,789
ప్రొద్దుటూరు	29,090	30,960

ముడి చమురు	66.39

ఎయిర్‌సెల్ దివాలా!



న్యూఢిల్లీ/చెన్నై: ప్రైవేట్‌రంగ టెలికం సంస్థ ఎయిర్‌సెల్ దివాల తీయనున్నది. ఓ వైపు కాల్ డ్రాప్స్.. మరోవైపు సంస్థ మూతబడుతున్నదన్న వార్తలు.. దీంతో దేశ వ్యాప్తంగా ఒక్కరోజే లక్షలాది మంది వినియోగదారులు తమ మొబైల్ నంబర్లను ఇతర నెట్‌వర్క్‌ల్లోకి మార్చుకునేందుకు ప్రయత్నించారు. వీరంతా ఎయిర్‌సెల్ కస్టమర్లు కాగా తరచూ వేధిస్తున్న కాల్ డ్రాప్స్‌తో దాదాపు 9 లక్షల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ)కి వెళ్లారు. నిజానికి, గురుగ్రామ్‌కు చెందిన ఈ ప్రైవేట్‌రంగ టెలికం సంస్థ.. ప్రస్తుతం గడ్డు పరిస్థితులనే ఎదుర్కొంటున్నది. తీవ్ర నిధుల కొరతను చవిచూస్తున్న ఎయిర్‌సెల్.. ఇప్పటికే తమ ఉద్యోగులకు సంస్థ మూసివేతకు సంబంధించిన స్పష్టమైన సంకేతాలనిచ్చింది కూడా. ఎయిర్‌సెల్ సీఈవో ఖైజద్ హీర్జీ.. ఇటీవల ఉద్యోగులనుద్దేశించి పంపిన ఓ ఈ-మెయిల్‌లో నిధుల కొరత ఉన్నదని, ప్రస్తుత వ్యాపార కార్యకలాపాలపైనే సంస్థ భవితవ్యం ఆధారపడి ఉన్నదని చెప్పేశారు. ఇక దివాలా కోసం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్దకు వెళ్లే యోచనలోనూ ఎయిర్‌సెల్ ఉందన్న వార్తలు వినిపిస్తుండటం గమనార్హం. దీంతో కస్టమర్ల మదిలో ఇప్పుడు అనేక సందేహాలు మెదులుతున్నాయి.

ఇక ఇంతేనా..? : ఈ ప్రశ్నకు సమీప భవిష్యత్తులోనైతే కాదు అని సంస్థ సమాధానమిస్తున్నది. కంపెనీని మూసేస్తున్నారన్న దానిపై ఫేస్‌బుక్, ట్విట్టర్లలో పలువురు కస్టమర్లు ఆందోళన వ్యక్తం చేయడంపై ఎయిర్‌సెల్ స్పష్టత ఇచ్చింది. మా సేవల్ని కొనసాగిస్తాం. ఈ విషయంలో ఒకవేళ ఏవైనా అవాంతరాలు ఎదురైతే.. కస్టమర్లకు ముందే తెలియజేస్తాం అని తెలిపింది. కాల్ డ్రాప్స్ అనేది వ్యవస్థీకృత అంతరాయం అంటూ ఓ సీనియర్ అధికారి టైమ్స్ ఆఫ్ ఇండియాకు తెలిపారు. త్వరలోనే పరిస్థితులు చక్కబడుతాయన్న ఆశా భావాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామంటూ క్షమాపణలు చెప్పారు. తమకు సహకరించాలని కస్టమర్లను కోరారు. అయిన ప్పటికీ భవిష్యత్తుపై సంస్థ నుంచి స్పష్టత రాకపోవడం, మూతపడబోదన్న విశ్వాసం కనిపించక పోవడం ఎయిర్‌సెల్ మనుగడను ప్రశ్నార్థకమే చేస్తున్నది.

కస్టమర్ల భయాలకు కారణం?: గడిచిన వారం రోజులుగా అన్ని ఎయిర్‌సెల్ సర్కిళ్లలో కస్టమర్లకు నెట్‌వర్క్ సమస్యలు ఎదురవుతున్నాయి. రాజస్థాన్, కోల్‌కతా, చెన్నై, ఒడిషా, ఢిల్లీల్లోని కొద్దిమంది మొబైల్ వినియోగదారులు తమ నంబర్లపై నెట్‌వర్క్ పనిచేయడం లేదని, తరచూ కాల్ డ్రాప్స్ అవుతున్నాయని ఇప్పటికే ఫేస్ బుక్, ట్విట్టర్ల ద్వారా వెల్లడించారు. ఇదే సమయంలో ఎయిర్‌సెల్ దివాలా తీయనుందని, టెలికం టవర్ కంపెనీలకు భారీగా బకాయి పడిందంటూ మీడియాలో వార్తలు రావడం కస్టమర్లలో భయాలకు దారితీసింది. ఫలితంగానే లక్షలాది మంది ఎంఎన్‌పీకి ప్రయత్నిస్తున్నారు. మంగళవారం సుమారు 3 లక్షల మంది, బుధవారం దాదాపు 9 లక్షల మంది ఎంఎన్‌పీకి విజ్ఞప్తి చేశారు. కాగా, నిరుడు సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా ఎయిర్ సెల్ కస్టమర్లు 88.8 మిలియన్లుగా ఉన్నారు. ఇందులో తమిళనాడు వాటానే 20 మిలియన్లు.

సమస్యలు ఇలా మొదలయ్యాయి: గతనెల 30న ఎయిర్‌సెల్ దేశవ్యాప్తంగా ఆరు సర్కిళ్లలో టెలికం సేవల్ని నిలిపివేసింది. గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ (పశ్చిమ) సర్కిళ్లు మూతబడ్డాయి. రూ.60 కోట్ల బకాయిల కారణంగా 10 రోజుల కిందట ఐడియా సెల్యులార్.. ఎయిర్‌సెల్‌తో ఇంటర్‌కనెక్ట్ సేవలను కూడా నిలిపివేసింది. దీంతో ఎయిర్‌సెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఒక్కసారిగా తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లింది. కస్టమర్ల తాకిడిని తట్టుకునే శక్తి సన్నగిల్లినట్లైంది. ఫలితంగానే కాల్ డ్రాప్స్ అవుతుండగా, చాలామంది ఇతర సంస్థల్లోకి వెళ్లిపోతున్నారు. కాగా, టెలికం రంగంలోని తీవ్ర పోటీ పరిస్థితుల మధ్య తాము సేవల్ని కొనసాగించడం కష్టమేనని ఎయిర్‌సెల్ ఇప్పటికే చెప్పింది. 2016 సెప్టెంబర్‌లో రిలయన్స్ జియో రాక నేపథ్యంలో ఎయిర్‌సెల్‌సహా మెజారిటీ టెలికం సంస్థలు నష్టాల్లో నడుస్తున్న విషయం తెలిసిందే.

జియో ఎఫెక్ట్

జియో రాకతో భారతీయ టెలికం పరిశ్రమలో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. ఎయిర్‌టెల్‌సహా, వొడాఫోన్, ఐడియా సెల్యులార్‌లు భారీ నష్టాలను ప్రకటిస్తున్నాయి. ఎయిర్‌సెల్ సైతం 2016 జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే 2017 అక్టోబర్-డిసెంబర్‌కు రూ.120 కోట్ల నిర్వహణ లాభం నుంచి రూ.120 కోట్ల నిర్వహణ నష్టానికి పడిపోయింది. రుణాల కోసం బ్యాంకులుసహా భాగస్వాములందరినీ సంప్రదిస్తోంది. అయినా ఫలితం శూన్యం. బ్యాంకుల నుంచి ఇప్పటికే తీసుకున్న రూ.15,500 కోట్ల రుణాన్ని ఆర్బీఐ మొండి బకాయిగా ప్రకటించడమే దీనికి కారణం. ఎయిర్‌సెల్ బ్యాంక్ ఖాతాలనూ బ్యాంకర్లు స్తంభింపజేస్తున్నారు. ఎయిర్‌సెల్‌కు సాయమందించేందుకు మాతృ సంస్థ మ్యాక్సిస్ ముందుకు వచ్చినా.. మళ్లీ వెనుకకు తగ్గింది. చివరకు ఆర్‌కామ్‌తో విలీన ఒప్పందం కూడా రద్దై పోవడంతో దివాలా తప్ప గత్యంతరం కనిపించట్లేదు.

స్టాక్‌మార్కెట్లకు ఊరట

ఎఫ్‌అండ్‌ఓ అండగా లాభాల బాట



ముంబై: ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు ప్రభా వంతో నిన్న నష్టాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లకు ఊరట లభించింది. శుక్ర వారం ఉదయం ఆరంభ ట్రేడింగ్ నుంచి ఆద్యంతం లాభాల జోరును కొనసాగించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 322.65 పాయింట్లు లాభపడి 34,142.15 వద్ద ముగిసింది. ఇక జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ కూడా 108.35 పాయింట్ల లాభంతో 10,491.05 పాయింట్లకు చేరింది. సూచీలు ఉదయం ఉత్సా హంగా ప్రారంభమయ్యాయి. మార్చి నెల ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ సిరీస్‌పై మదుపరుల నమ్మకం మార్కెట్ సెంటి మెంట్‌ను బలపరిచింది. దీంతో ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 107 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 39.85 పాయింట్లతో చక చక కదలాడింది. సన్‌ఫార్మా, టాటా స్టీల్, భారతీ ఎయిర్ టెల్, డాక్టర్ రెడ్డీస్, యస్ బ్యాంకు, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, విప్రో షేర్లు లాభాల బాటలో నడిచాయి. మరోపక్క నీరవ్ మోడీ చేసిన మోసానికి పంజాబ్ నేషనల్ బ్యాంకు షేర్లు ఇంకా కోలుకోలేదు. ఆ షేర్లపై ఇంకా ఒత్తిడి కొనసాగింది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో పీఎన్‌బీ షేరు రూ.113.45 వద్ద ముగిసింది. ఇక గీతాంజలి జెమ్స్ మరో 5శాతం పడిపోయి షేరు విలువ రూ.24.80కు చేరింది. గురువారం మూడు నెలల కనిష్ఠానికి పడి పోయిన రూపాయి నేడు కాస్త బలపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.64.80వద్ద ట్రేడవు తోంది. ఎన్‌ఎస్‌ఈలో టాటాస్టీల్, సన్ ఫార్మా, యూపీఎల్, టెక్ మహీంద్రా, వేదాంత తదితర కంపెనీల షేర్లు లాభ పడ్డాయి. గెయిల్, ఏషియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్, ఎం అండ్ ఎం, ఇన్ఫోసిస్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి.

నీరవ్ షేర్లు, డిపాజిట్లు సీజ్

ముంబై : నీరవ్ మోడీకి చెందిన సుమారు రూ.44 కోట్ల విలువైన షేర్లు, బ్యాంకు డిపాజిట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్ట రేట్(ఈడీ) శుక్రవారం స్వాధీనం చేసుకుంది. అలాగే నీరవ్‌కు సంబంధాలున్న ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఇంపోర్టెడ్ వాచీలను కూడా సీజ్ చేసింది. అధికారులు మాట్లాడుతూ రూ.30 కోట్ల మొత్తం కలిగిన బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయాలని ఆదేశించామని, మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద నీరవ్ మోడీ గ్రూపునకు చెందిన రూ.13.86 కోట్ల విలువైన షేర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గతవారం రోజులుగా నీరవ్‌కు సంబంధాలున్న వేర్వేరు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో 176 స్టీల్ అల్మారాలు, 158 బాక్సులు, 60 ఇతర కంటైనర్లు, పెద్ద మొత్తంలో ఇంపోర్టెడ్ వాచీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కాంట్రాక్ట్ రద్దు చేసుకున్న ప్రియాంక చోప్రా

నీరవ్ మోడీ రూ.11,400 కోట్ల కుంభకోణం నేపథ్యంలో నీరవ్ గ్రూప్‌నకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్న ప్రియాంక, సిద్దార్థ్‌లు కూడా తెర పైకి వచ్చారు. నీరవ్ మోడీ జ్యూయ ల్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ప్రియాంక తన కాంట్రాక్ట్‌ను రద్దు చేసుకుంది.


రోడ్డున పడ్డ 700 మంది ఉద్యోగులు

- సూరత్‌లో నీరవ్ మోడీ 'సెజ్' మూత
- వేతనాల కోసం డిమాండు



సూరత్ : సూరత్‌లోని ప్రత్యేక ఆర్థిక జోన్ (సెజ్)లోని నీరవ్ మోడీ సంస్థల ఉద్యోగులు ఆందోళనకు దిగారు. రెండు నెలలుగా జీతాలు అందక, ప్రస్తుతం సంస్థలు మూతబడడంతో దాదాపు 700 మంది ఉద్యోగులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమ కష్టార్జితం కోసం ఆందోళన బాట పట్టారు. ఇటీవల వెలుగుచూసిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల కుంభకోణం నేపథ్యంలో నీరవ్ మోడీకి సంబంధించిన బ్యాంకు ఖాతాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) స్తంభింపజేశాయి. దీంతో ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేకుండా పోయింది. జనవరి, ఫిబ్రవరి నెలల జీతం పెండింగ్‌లో ఉందని, కనీసం ఒక్క ఖాతానైనా తెరిచి తమకు జీతాలు ఇవ్వాలని ఉద్యోగులు డిమాండు చేస్తున్నారు. ఆందోళనకారుడు దీపక్ ఇంగ్లే మాట్లాడుతూ 'సెజ్‌లోని నీరవ్ మోడీ సంస్థల్లో పనిచేసే దాదాపు 700 మంది ఉపాధిని కోల్పోయారు. శాఖలకు తాళాలు వేసి.. వేరే ఉద్యోగాలు చూసు కోమని యాజమాన్యాలు సూచించాయి. దీంతో మేమంతా రోడ్డునపడ్డాం. జీత భత్యాల చెల్లింపునకు సంబంధించి యాజ మాన్యం నుంచి ఎలాంటి హామీ లేదు. రెండు నెలల జీతం వస్తుందో రాదో తెలియడం లేదు' అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వారం క్రితం రూ.900 కోట్ల విలువ చేసే ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్; ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ ప్రై.లి. సంస్థలలో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు రెండు సంస్థలను సీజ్ చేశారు. నీరవ్ మోడీ (46), ఆయన భార్య, సోదరుడు, మామ చోక్సీలపై సీబీఐ కేసులు నమోదైన విషయం తెలిసిందే. రూ.280 కోట్ల రుణం తీసుకొన్న నీరవ్ మోడీ దాన్ని తిరిగి చెల్లించలేదని జనవరి 31న సీబీఐ కేసు నమోదు చేయడం, అపై దర్యాప్తు నేపథ్యంలో మొత్తం రూ.11,400 కోట్ల కుంభకోణం వెలుగు చూడడం విదితమే.

పెచ్చుమీరిన అసమానతలు



న్యూఢిల్లీ: దేశంలో అసమానతలు పెచుమీరుతున్నాయి. పేద-ధనిక తారతమ్యం క్రమేణా పెరిగిపోతున్నది. ధనికులు మరింత సంపన్నులుగా మారుతుంటే.. పేదలు ఇంకా పేదరికంలోకి దిగజారుతున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో భారతీయ బిలియనీర్ల సంపద దేశ జీడీపీలో 15 శాతానికి ఎగిసింది. ఈ మేరకు ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక ఒకటి స్పష్టం చేసింది. ప్రభుత్వ సరళతర విధానాలు సంపన్న వర్గాలకు కలిసొస్తున్నాయని, ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో వారసత్వం వంటివి కోటీశ్వరులకు కోట్లు తెచ్చిపెడుతున్నాయని పేర్కొన్నది. అయితే ఇదే సమయంలో పేదలు కటిక దారిద్ర్యంలోకి జారుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. 1991, ఆ తర్వాతికాలంలో భారీ స్థాయిలో అమల్లోకి వచ్చిన సంస్కరణల ఫలితమే ఈ అసమానతలు అని ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈవో నిషా అగర్వాల్ తెలిపారు. దేశ జీడీపీలో ఐదేండ్ల క్రితం 10 శాతంగా ఉన్న బిలియనీర్ల మొత్తం సంపద.. ఇప్పుడు 15 శాతానికి పెరిగిందన్నారు. గతేడాది దేశంలో 101 బిలియనీర్లున్నారని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. ఈ క్రమంలోనే గతేడాది దేశ సంపదలో 73 శాతాన్ని కేవలం ఒక్క శాతం జనాభానే సృష్టించినట్లు తెలిపింది. 2017లో భారత్‌లోని ఒక శాతం సంపన్నుల సంపద 20.9 లక్షల కోట్ల రూపాయలకుపైగా పెరిగిందని వివరించింది. ఇదే సమయంలో దేశ జనాభాలో సగానికి పైగా సమానమైన 67 కోట్ల మంది సంపద ఒక్క శాతం మాత్రమే వృద్ధి చెందినట్లు చెప్పడం గమనార్హం.

పెరుగుతున్న అంతరాలు: భారతీయ అసమానత నివేదిక 2018 పేరుతో విడుదల చేసిన ఓ రిపోర్టులో ఆదాయం, వినియోగం, సంపద, ప్రభుత్వ విధానాల ఆధారంగా అత్యంత అసమానతలున్న దేశాల్లో భారత్ కూడా ఒకటిగా నిలిచిందని ఆక్స్‌ఫామ్ తెలిపింది. ప్రభుత్వం అవలంభిస్తున్న కొన్ని విధానాలతో కార్మికుల కంటే యాజమాన్యాలకే, నైపుణ్యం ఉన్నవారి కంటే లేనివారికే ఎక్కువ లబ్ధి చేకూరుతున్నదని చెప్పింది. 1980వ దశకంతో చూస్తే.. 1991 నుంచి అసమానతలు పెరిగినట్లు తేటతెల్లమైందని, 2017 వరకు ఈ అసమానత్వం కొనసాగిందని వివరించింది. కుల, మత, ప్రాంతీయ, లింగ బేధాలతో నిండిన భారతీయ సమాజాన్ని ఆర్థిక అసమానతలూ పట్టి పీడిస్తున్నాయని తమ నివేదికలో ఆక్స్‌ఫామ్ అభిప్రాయపడింది. ఈ పరిస్థితి మారాలంటే సంపద, వారసత్వ పన్నుల వంటి ప్రగతిశీల ప్రత్యక్ష పన్ను విధానాన్ని అమల్లోకి తీసుకురావడమే ఏకైక మార్గమని నివేదిక రూపకర్త ప్రొఫెసర్ హిమాన్షు అభిప్రాయపడ్డారు.

ఈ విధానంలో వచ్చిన ఆదాయాన్ని పేదల అభ్యున్నతికి ఖర్చు చేయాలని, ముఖ్యంగా పేద పిల్లల ఆరోగ్యం, విద్య, పోషకాహార లోపాలను సరిదిద్దాలన్నారు. అప్పుడు మాత్రమే దేశంలో సమానత్వ సంకేతాలపై ఓ చిన్ని ఆశైనా కలుగుతుందన్నారు. కాగా, ఈ నివేదికను దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సుకు ముందే ఆక్స్‌ఫామ్ విడుదల చేసింది.

మార్చి 31లోగా

ఆధార్ లింక్ తప్పనిసరి

బీఎస్ఎన్ఎల్ గడువు

ముంబై: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ మొబైల్ సిమ్‌కార్డును మార్చి 31లోగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించింది. ఆధార్‌తో సిమ్‌కార్డును లింక్ చేసుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలంగాణ టెలికం సర్కిల్ సీజీఎం వీ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో, ఫ్రాంచైజ్, రిటైల్ మొబైల్ షాపుల వద్ద అనుసంధానం చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా ఐవీఆర్ఎస్ పద్ధతిలో 14546 నంబర్‌కు కాల్ చేసి ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు.

హెచ్1బీ వీసా జారీ ప్రక్రియ కఠినతరం

- అదనపు వివరాలు, అందుకు ఆధారాలు పొందుపర్చాలి
- ట్రంప్ ప్రభుత్వం నిబంధనలు
- భారత ఐటీ కంపెనీలకు దెబ్బ

వాషింగ్టన్: హెచ్-1బీ వీసాల జారీ ప్రక్రియను అమెరికా కఠినతరం చేసింది. ఇందుకు సంబంధించి నూతన విధాన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కారు జారీ చేసింది. ఇకపై హెచ్-1బీ వీసాల కోసం దరఖాస్తు చేసే ఐటీ కంపెనీలు అదనపు వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. తమ ఉద్యోగులకు సంబంధించి అదనపు వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాలని ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగం వెల్లడించింది. అదనపు వివరాలకు సంబంధించిన ఆధారాలను కూడా సమర్పించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. 2019 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 2 నుంచి హెచ్-1బీ వీసాల దరఖాస్తు ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొంది. మరికొద్ది రోజుల్లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా అమెరికా నూతన నిబంధనలు జారీ చేసింది. భారత ఐటీ కంపెనీలు, ఇతర ఉద్యోగులపై ఈ తాజా నిబంధనల ప్రభావం తీవ్రంగా ఉండనుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజా నిబంధనలతో ఐటీ కంపెనీలు హెచ్-1బీ వీసా దరఖాస్తులకు చాలా ఎక్కువగా పేపర్ వర్క్ చేయాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. హెచ్-1బీ వీసా ద్వారా విదేశీ ఉద్యోగులకు తాత్కాలికంగా అమెరికాలోని కంపెనీల్లో పనిచేసే అవకాశం లభిస్తోంది. ఈ వీసా ద్వారా పలు కంపెనీలు అమెరికా ఉద్యోగుల కొరత ఉన్న చోట నిపుణులైన విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ముఖ్యంగా భారత ఐటీ కంపె నీలు ఈ విధానంతో బాగా లబ్ధి పొందుతున్నాయి. థర్డ్- పార్టీ వర్క్‌సైట్‌లో ఎక్కువ సంఖ్యలో తమ ఉద్యోగులను నియ మిస్తున్నాయి. తాజాగా అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మి గ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) ఏడు పేజీల్లో విడుదల చేసిన నూతన పాలసీ ప్రకారం.. ఉద్యోగులు థర్డ్-పార్టీ వర్క్ సైట్‌లో పనిచేసే పరిమిత కాలానికి మాత్రమే హెచ్-1బీ వీసా ఇవ్వాలని పేర్కొంది. ప్రస్తుతం హెచ్-1బీ వీసా గడువు మూడేళ్లు ఉండగా.. తాజా నిబంధనల్లో మూడేళ్ల కంటే తక్కువ ఉండాలని తెలిపింది. థర్డ్‌పార్టీ వర్క్‌సైట్‌లో హెచ్- 1బీ వీసా దరఖాస్తు చేసుకునే ఉద్యోగి.. తాను ప్రత్యేక మైన వృత్తిలో నిర్దిష్టమైన అర్హతలు కలిగి ఉన్నట్లు నిరూపించు కోవాలని వెల్లడించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం అంత కుముందు వీసా సమయంలో ఎప్పుడైనా బెంచ్‌లో ఉన్న ఉద్యోగులకు హెచ్-1బీ వీసా పొడిగింపు మరింత కఠినతరం కానుంది.

విజ్ఞానం

'అల్లం-జీలకర్ర'తో పొట్ట కరుగు



బరువు తగ్గే విషయంలో బాన పొట్ట ఎప్పుడూ అడ్డంగా ఉంటుంది. చూసేందుకు బాగా కనిపించకపోవడమే కాదు.. అలా ఉన్న వారిని చూసి నవ్వే వారు, మాట్లాడుకునేవారు ఉంటారు. లావు పొట్ట గురించి చింతించకండి. కొన్ని రకాల జాగ్రత్తలతో అధిక పొట్టను ఇట్టే కరిగించొచ్చు. మన వంటగదిలో దొరికే అల్లం, జీలకర్రతో దీన్ని సాధించవచ్చంటే నమ్ముతారా?

అల్లంతో ప్రయోజనాలు

ఎంతో పురాతనమైనది అల్లం. ఇది దాదాపు ప్రతి భారతీయ వంటిట్లో కనిపిస్తుంది. అల్లానికి ప్రత్యేకమైన వైద్య గుణాలున్నాయి. దీని వాసన ఆహారానికి, తేనీరుకు ప్రత్యేక రుచిని తీసుకొస్తాయి. ఎన్నో ఏళ్లుగా కడుపు నొప్పికి అల్లాన్ని దివ్య ఔషధంగా వాడుతున్నారు. వేడిని తగ్గించే గుణం ఉంది. అల్లం అనేది మట్టిలో పెరిగే కాండం.

జీలకర్రతో ప్రయోజనాలు

మరో ఘాటైన దినుసు జీలకర్ర. పుట్టింది మధ్యధరా ప్రాంతంలో. జీలకర్రలో పొటాషియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. దీంతోపాటు విటమిన్ సీ, ఈ, కే లు తక్కువ పరిమాణాల్లో ఉంటాయి. అధిక కొవ్వును తగ్గించడంలో, కొలస్ట్రెల్ స్థాయిలను అదుపులో ఉంచడంలో జీలకర్ర బాగా ఉపయోగపడుతుంది.

డ్రింక్ తయారీ విధానం

ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర తీసుకోవాలి. దీన్ని విడిగా లేదా పొడిగా చేసుకోవాలి. దీన్ని అర లీటర్ నీటిలో వేసి మరిగించాలి. నీళ్లు సగం అయ్యే వరకు అంటే పావులీటర్ చేరుకునేదాకా బాగా మరిగించాలి. రుచి కోసం కావాలంటే యాలకులు, లవంగాలు, నిమ్మ రసం కలుపుకోవచ్చు. దీంట్లోనే సన్నగా తురిమిన అల్లం వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వడకట్టి ఉదయాన్నే తాగాలి. ఇలా వరుసగా 10 రోజుల చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఆ తర్వాత 45 నిమిషాల పాటు వ్యాయామం చేస్తే బాగుంటుంది. దీనికి జతగా మంచి డైట్ తీసుకోవాలి.

ఈ మిశ్రమం ఎలా ఉపయోగపడుతుందంటే...

జీలకర్ర, అల్లం మిశ్రమం మెటబాలిజాన్ని పెంచుతుంది. బరువు తగ్గడా నికి ఇది చాలా అవసరం. మెటబాలిజం పెరగడం వల్ల క్యాలరీలు బాగా ఖర్చవుతాయి. రోజంతా హుషారుగా ఉండగలుగుతారు. ఇది కాకుండా ఈ రెండింటి మిశ్రమం ఏదైనా తినాలనే కోరికను అణచివేస్తుంది. దీంతో అవి ఇవి తినకుండా ఉండగలుగుతాం. ఆరోగ్యమూ బాగుంటుంది.

సరికొత్త సోనీ

ఆర్‌ఎక్స్ 0 కెమెరా విడుదల..!



విజయవాడ: తమ డిజిటల్ ఇమేజింగ్ అనుభవాలకు నూతనత్వాన్ని జోడిస్తూ సరికొత్త, వైవిధ్య భరిత ఆర్‌ఎక్స్ 0 కెమేరాను సోనీ ఇండియా ఆవిష్కరించింది. ఆర్‌ఎక్స్ కెమెరా లైనప్‌లో దృఢమైన, వాటర్ ప్రూఫ్, అల్ట్రా కాంపాక్ట్ బాడీతో అత్యంత ఆధునిక ఇమేజింగ్ నాణ్యతను అందిస్తుంది. మినియేచర్ కొలతలు, పూర్తి స్థాయి వైవిధ్య భరితంగా సింగిల్ యూనిట్‌గా ఉపయోగించినప్పుడు లేదా అదనపు ఆర్‌ఎక్స్ 0 కెమెరాతో ఉపయోగించినప్పుడు మల్టీ వ్యూ షూటింగ్ పరిస్థితుల్లో అందిస్తుంది. యాంటీ డిస్టోరేషన్ షట్టర్‌తో అత్యాధునిక సృజనాత్మకతను అందిస్తుంది. ఏకధాటిగా 16 ఎఫ్‌పీఎస్, 960 ఎఫ్‌పీఎస్, 1000 ఎఫ్‌పీఎస్ స్లోమోషన్ షూటింగ్ ఉన్నాయి. విస్తృత శ్రేణి చిత్రీకరణ కోసం డిజైన్ చేసిన నూతన 18-135 ఎంఎంఎఫ్, 3.5 - 5.6 జూమ్ లెన్స్ సమ్మేళనంతో ఆర్‌ఎక్స్ 0ను మార్కెట్‌లోకి సోనీ ఇండియా విడుదల చేసింది. రూ.64,990లకు ఆర్‌ఎక్స్0, రూ.49,990లకు ఎస్ఈఎల్ 18-135 లెన్స్‌లు దేశవ్యాప్తంగా అన్ని సోనీ సెంటర్లలోనూ, ఆల్ఫా ఫ్లాగ్‌షిప్ సెంటర్లలోనూ, సోనీ ఆథరైజ్డ్ డీలర్స్ దగ్గర లభిస్తున్నాయి.

కార్ ఆఫ్‌ది ఇయర్ నెక్స్‌జెన్ వెర్నా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హుందాయ్ మోటార్ ఇండియాకు చెందిన నెక్స్‌జెన్ వెర్నాకు ప్రతిష్టాత్మకమైన కార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. నెక్స్‌జెన్ వెర్నాకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగించామని కంపెనీ ఎండీ, సీఈఓ వైకే కూ తెలిపారు. దీంతోపాటు అత్యద్భుతమైన ఇంజినీరింగ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. వెర్నాతో మిడ్‌సైజ్‌సెడాన్ విభాగంలో విప్లవాత్మకమైన మార్పులు చూస్తామన్నారు. ప్రతిష్టాత్మకమైన మీడియా హౌజ్ 2018 అవార్డుకు ఎంపికైనట్టు చెప్పారు.

బోధ్ ట్రీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మైఖేల్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ ఐటీ కన్సల్టింగ్, సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ సంస్థ బోధ్ ట్రీ తాజాగా మైఖేల్ అవినాను చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా నియమించింది. ఇకపై మైఖేల్ సంస్థ నాయకత్వ బాధ్యతలు నెరవేరుస్తూ అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా వ్యవహరిస్తారు. సైబర్ సెక్యూరిటీ క్లౌడ్ కంప్యూటింగ్ వ్యవస్థల నిర్వహణతో పాటు వినియోగదారులకు సమర్థవంతమైన సేవలు అందించేలా పర్యవేక్షిస్తారు. మైఖేల్‌కు టెలీకమ్యూనికేషన్, సాఫ్ట్‌వేర్, ఏరోస్పేస్ రంగాల్లో 15 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. మైఖేల్ గతంలో యూఎస్‌ఏ, యూరప్, నార్త్ అమెరికా, రష్యా, చైనాలలో డేటా అనలిస్టుగా పనిచేశారు. మైఖేల్ సేవలు బోధ్‌ట్రీకి ఎంతగానో ఉపయోగపడతాయని సంస్థ ఎండీ రామకృష్ణ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో యూట్యూబ్ ఫన్ ఫెస్ట్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నగరానికి తొలిసారిగా యూట్యూబ్ ఫన్ ఫెస్ట్ రానుంది. ఈ కార్యక్రమం మార్చి 3న శిల్పకళా వేదికలో జరుగనుంది. వివిధ రంగాలలో ప్రతిభావంతులు లైవ్‌లో తమ కళను ప్రదర్శించనున్నారు. అమృత నాయక్, చాయ్ బిస్కెట్, వివా, మహాతల్లి, తెలుగువన్, క్రాంతి గయ్స్, కిరాక్ హైదరాబాద్, మై విలేజ్ షో, గర్ల్ ఫార్ములా మొదలైన సంస్థలు తమ ప్రదర్శనలు ఇవ్వనున్నట్టు యూట్యూబ్ ఇండియా హెడ్ సత్య రాఘవన్ తెలిపారు. దేశంలో ప్రతిభావంతులకు కొదవలేదని, గతేడాది ఈ కార్యక్రమంలో 12 మంది క్రియేటర్స్, మిలియన్ సబ్‌స్క్రైబర్స్ లభ్యమయ్యారని, ఈ సారి దీనికి మరింత ఆదరణ లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మార్చిలో పాన్‌కార్డ్ క్లబ్స్ ఆస్తుల వేలం : సెబీ

న్యూఢిల్లీ: పెట్టుబడిదారుల నుంచి సేకరించిన రూ.7 వేల కోట్లను తిరిగి వసూలు చేయడానికి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ..పాన్‌కార్డ్ క్లబ్స్‌కు చెందిన ఆస్తులను వచ్చే నెలలో వేలం వేయనున్నట్లు ప్రకటించింది. రిజర్వు ధరను రూ.260 కోట్లుగా నిర్ణయించింది. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో వేలం వేసిన 22 ఆస్తులకు ఇది అదనం. వచ్చే నెల 21న పాన్ కార్డ్ క్లబ్స్, పన్ ప్రాపర్టీ సీఎండీ సుధీర్ మోరవెకర్(గతంలో మరణించారు)కి సంబంధించిన పది ప్రాపర్టీలను విక్రయించనున్నట్లు సెబీ ప్రత్యేక నోటీస్ జారీ చేసింది.

ఫోనుల్లో కొత్త స్క్రీన్‌లు.. విశేషాలు..

ఫోన్ కొందాం అనుకుంటే...స్క్రీన్ సైజు గురించి విశ్లేషణ చేయాల్సిందే. ఎందుకంటే తెరల తీరు భిన్నంగా మారుతోంది. అంచుల వరకూ టచ్ స్క్రీన్‌లు చేరిపోయాయి. ఒకే పరిమాణంలో ఉన్న రెండు ఫోన్లలో స్క్రీన్‌ల మధ్య వ్యత్యాసం! అదెలా? ఈ టచ్ స్క్రీన్ మాటున పుట్టుకొస్తున్న తిరకాసేంటి?

ఒకప్పుడు ఫోన్ల డిస్‌ప్లే గురించి మాట్లాడితే... ఎన్ని అంగుళాల తెర? డిస్‌ప్లే క్వాలిటీ బాగుంటుందా? స్క్రీన్‌కు 'గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్' ఉందా?... లాంటివే మొబైల్ ప్రియుల మధ్య ఎక్కువగా చర్చకు వచ్చేవి. చెప్పాలంటే 16:9 పొడవు, వెడల్పు నిష్పత్తిలోనే ఇప్పటి వరకూ డిస్‌ప్లే స్క్రీన్‌లు పరిమితమై ఉన్నాయి. ఇప్పుడు అలా కాదు. భిన్నమైన సైజుల్లో ముందుకొస్తున్నాయి. కొన్ని తక్కువ అంచులతో (స్లిమ్ బెజెల్ డిస్‌ప్లే), కొన్నైతే అంచుల చివరి వరకూ (బెజెల్-లెస్ డిస్‌ప్లే) తాకేతెరల్ని తొడుక్కుని 18:9 పొడవు, వెడల్పు నిష్పత్తిలో సందడి చేస్తున్నాయి. గత ఏడాది చివర్లో మొదలైన ఈ సరికొత్త ట్రెండీ డిస్‌ప్లే స్క్రీన్లు ఏ మేరకు సౌకర్యం? ఒంటి చేత్తో వాడేందుకు అనువైనవేనా? మల్టీ టాస్కింగ్‌ని పూర్తిస్థాయిలో సపోర్ట్ చేస్తాయా?... ఇలా చాలానే సందేహాల్ని మొబైల్ ప్రియులు వ్యక్తం చేస్తున్నారు. మరైతే, ఈ 18:9 నిష్పత్తిలో ముస్తాబై వస్తున్న తాకేతెరల తతంగం ఏంటో చూద్దాం!



తక్కువ పరిమాణం... ఎక్కువ డిస్‌ప్లే

కొత్త నిష్పత్తిలో వస్తున్నవి అంచుల వరకూ టచ్ స్క్రీన్‌లతో నాజూకుగా ముస్తాబై పొడవుగా కనిపిస్తున్నాయి. ఎంతలా అంటే.. 5.5 అంగుళాల తెరల్లోనే 6.0 అంగుళాల స్క్రీన్‌లు నిక్షిప్తం అవుతున్నాయి. అన్ని కోణాల్లో చూడడానికి 5.5 అంగుళాల ఫోన్ మాదిగానే కనిపిస్తుంది. మరికొన్ని మోడళ్లు 5.2 అంగుళాల్లోనే 5.7 అంగుళాల తెరల్ని అల్లుకుని ముందుకొస్తున్నాయి. ఇదే మాదిరిగా 18:9 నిష్పత్తిలో 5 అంగుళాల తెరలోనే ఎక్కువ పొడవుతో 5.5 డిస్‌ప్లే స్క్రీన్‌లు పరిచయం అవుతూ చేతుల్లో సులువుగా ఒదిగిపోతున్నాయి. ఏది ఏమైనా... స్క్రీన్ పరిమాణాన్ని పెంచుకుని నాజూకుగా ముందుకొస్తున్న 'భలే బెజెల్లెస్' ఫోన్‌లను ఎవరు కాదనగలరు.

నిలువెత్తు 'కంటెంట్'

యాప్‌లు, వెబ్‌సైట్‌ల్లో స్క్రోలింగ్ చేయడానికి వీలుగా నిలువుగానే కంటెంట్‌ని అప్‌లోడ్ చేస్తుంటాయి. ఇప్పుడొస్తున్న పొడవు స్క్రీన్ ఫోన్లతో తెరపై ఎక్కువ కంటెంట్‌ని వీక్షించడం సులభం అవుతుంది. పదే పదే పైకి, కిందికి స్క్రోల్ చేయాల్సిన అవసరం ఉండదు. ఉదాహరణకు ఫోన్‌లో ఏదైనా వ్యాసం, ఈ-పుస్తకాలు చదువుతున్నప్పుడు పొడవైన తెరతో కూడిన ఫోన్లు అనుకూలం.

వర్చువల్ రియాలిటీకి వీలు

కళ్లకు కట్టినట్టుగా అద్భుత ప్రపంచాన్ని పరిచయం చేసిన వర్చువల్ రియాలిటీకి కొత్త తెరలు అతికినట్టుగా సరిపోతాయి. తెర రెండు సమాన భాగాలుగా విడిపోయి వీఆర్ హెడ్‌సెట్‌ల్లో ఒదిగిపోతుంది. దీంతో రెండు కళ్లకు సమానంగా వేరు వేరు తెరల్లో వర్చువల్ రియాలిటీ వీడియోలు పూర్తి నాణ్యతతో ప్లే అవుతాయి. 16:9 తెరల్లో కంటే ఎక్కువ వీఆర్ వీడియో కంటెంట్‌ని కొత్త తెరల్లో చూడొచ్చు.



వీడియోల నాణ్యత

18:9 నిష్పత్తిలోనే ఏముందీ? డిజిటల్ టీవీల వెడల్పు మారినట్టుగానే 19:9, 21:9 నిష్పత్తుల్లోకీ స్మార్ట్ ఫోన్ స్క్రీన్ పరిమాణాలు మారొచ్చు కదా! అనే సందేహం రాక మానదు. కానీ, ఇప్పుడు ట్రెండీగా మారిన స్క్రీన్ పొడవు, వెడల్పుల నిష్పత్తి వీడియో నాణ్యతకి సంబంధించిందేగానీ తెర పరిమాణం గురించి కాదు. ఇప్పటి వరకూ కొనసాగుతూ వచ్చిన సంప్రదాయ 16:9 నిష్పత్తిని దాటుకుని 18:9 నిష్పత్తిలోనే వీడియోలు చిత్రీకరించేందుకే ప్రపంచ వ్యాప్తంగా సినిమాటోగ్రాఫర్లు మొగ్గుచూపుతున్నారు. ఈ కొత్త వీడియో ఫార్మెట్‌ని ఇటలీకి చెందిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విట్టోరియో స్టొరారో 1998లోనే ప్రతిపాదించారు. భవిష్యత్‌లో అన్ని డిస్‌ప్లే స్క్రీన్‌లు ఈ కొత్త నిష్పత్తిలో మారొచ్చని టెక్ విశ్లేషకులు చెబుతున్నారు.

అన్నీ ఇమడకపోవచ్చు

కొత్త నిష్పత్తికి తగినట్టుగా తెరని రెండుగా విభజించి వాడేందుకు యాప్‌లు, గేమ్‌లు, వీడియోల రూపకల్పన ఇప్పటికైతే పూర్తిస్థాయిలో లేదు. కొన్ని ఫోన్లలో 'స్ప్లిట్ స్క్రీన్ మోడ్'లో వీక్షించేందుకు ప్రయత్నిస్తే కొన్ని యాప్‌లు సాగినట్టుగా, గజిబిజి గ్రాఫిక్స్‌తో అసంపూర్తిగా కనిపిస్తాయి.

పరిధిని మించి

మార్కెట్‌లో మురిపిస్తున్న సరికొత్త మోడళ్లు నిర్ణీత తెర పరిమాణంతో ముందుకు రావడం లేదు. 6, 5.9, 5.7, 5.65, 5.5, 5.45... ఇలా తక్కువ వ్యత్యాసంతో ఒకదాంతో మరోటి పోటీ పడుతున్నాయి. కొత్త నిష్పత్తిని మించి కొన్ని మోడళ్లు ముందుకొస్తున్నాయి. 18.5:9 పొడవు, వెడల్పు నిష్పత్తితో శామ్‌సంగ్, 19.5:5 నిష్పత్తితో యాపిల్ కంపెనీలు మోడళ్లను రూపొందిస్తున్నాయి. దీంతో యాప్ డెవలపర్లు తెర పరిమాణ నిష్పత్తికి తగినట్టుగా యాప్‌లు, గేమ్‌లను వేగంగా అప్‌డేట్ చేయలేకపోతున్నారు. కెమెరా రిజల్యూషన్‌లోనూ తేడా. కొత్త నిష్పత్తి తెరలకి కెమెరా రిజల్యూషన్‌కి మధ్య వ్యత్యాసం పెరుగుతోంది.

ఆన్‌స్క్రీన్ బటన్లు



పొడవైన స్క్రీన్లతో ఫోన్‌పైనా, కింద టచ్ స్క్రీన్ పెరుగుతూ సన్నని అంచులతో నాజూకుగా మారుతోంది. దీంతో ఎప్పటి నుంచో అలవాటు పడిన హోంస్క్రీన్, బ్యాక్, ఫింగర్ ప్రింట్ సెన్సర్ బటన్లుకు చోటు లేక వాటిని తెరపైకి తీసుకొచ్చేస్తున్నారు. దీంతో వినియోగదారులు తెరపైకి జరిగిన బటన్లను వాడేందుకు సిద్ధం కావాల్సిందే.

చిన్న చేతులతో చిక్కే

వెడల్పు తగ్గి పొడవు పెరిగితే చేతిలో సులువుగా ఒదిగిపోవడం నిజమే. చేతులు పెద్దవిగా ఉన్నవారైతే ఒక చేత్తోనే ఫోన్ అన్ని మూలలూ తాకుతూ ఆపరేట్ చేయవచ్చు. అదే చేతులు చిన్నవిగా ఉంటే... పొడవైన ఫోన్‌ని ఒంటి చేత్తో యాక్సెస్ చేయడం కష్టమే.

మల్టీటాస్కింగ్



ఆండ్రాయిడ్ 7.0 ఓఎస్ వెర్షన్‌తో స్క్రీన్ రెండు తెరలుగా విభజించి వాడుకునే వెసులుబాటు ఉంది. అంటే... రెండు యాప్‌లను తెరపై ఒకేసారి ఓపెన్ చేసి వాడుకోవడం. ఒకదాంట్లో కాపీ చేసిన డేటాని మరో యాప్‌లో పోస్ట్ చేయవచ్చు. ఇలా మల్టీటాస్కింగ్ చేయడానికి కొత్త నిష్పత్తిలో పరిచయం అవుతున్న ఫోన్లు అనుకూలం. ఎందుకంటే వెడల్పు కంటే పొడవు రెండు రెట్లు ఎక్కువ. రెండు యాప్‌లను ఒకేసారి వాడేందుకు తెరని విభజిస్తే (స్ప్లిట్ స్క్రీన్ మోడ్) రెండు సమాన భాగాలుగా వేరు అవుతుంది. ఉదాహరణకు కొన్ని కెమెరా యాప్‌లను వాడుకుని సగ భాగంలో రిఫరెన్స్ ఫొటోని పెట్టుకుని మరో సగంలో ఫోన్ కెమెరాని ఓపెన్ చేసి ఫొటోలు తీసుకోవచ్చు.



ఎన్టీఆర్ సినిమా టైటిల్ 'ఆన్ సైలెంట్ మోడ్'



టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్‌గా తెరకెక్కబోతున్న ఎన్టీఆర్, త్రివిక్రమ్ చిత్రం మార్చి నుంచి సెట్స్ మీదకు వెళ్లనుంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు ఇప్పుడు శర వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించిన ఓ తాజా వార్త టాలీవుడ్‌లో హల్ చల్ చేస్తోంది. అదేంటంటే ఈ మూవీ కోసం త్రివిక్రమ్ 'ఆన్ సైలెంట్ మోడ్' అనే టైటిల్‌ను పెట్టాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీలో ఎన్టీఆర్ సరసన పూజా హెగ్డే నటించనుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కబోతున్న ఈ చిత్రానికి ఎస్.రాధాకృష్ణ నిర్మాత. దసరా కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకుంటోంది చిత్ర యూనిట్.

'ఛలో' సినిమా దర్శకుడితో నితిన్




హీరో నితిన్ ప్రస్తుతం 'ఛల్ మోహన్ రంగ' సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. ఒకవైపు షూటింగ్ చేస్తూనే మరో వైపు కొత్త కథల్ని వింటున్నాడీ హీరో. సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్న వార్తల మేరకు నితిన్ ఒక యువ దర్శకుడితో సినిమా చేసే అవకాశాలున్నాయట. ఆ దర్శకుడు మరెవరో కాదు డెబ్యూ చిత్రం 'ఛలో'తో మంచి విజయాన్ని అందుకున్న వెంకీ కుడుముల. 'ఛలో' హిట్ తర్వాత నిర్మాణ సంస్థల నుండి వరుస ఆఫర్లు అందుకుంటున్న వెంకీ భిన్నమైన స్టోరీ లైన్ తో కూడిన కథను నితిన్ కు చెప్పాలనుకుంటున్నాడట. ఒకవేళ నితిన్ గనుక వెంకీ కథకు ఇంప్రెస్ అయితే వీరి సినిమా త్వరలోనే పట్టాలెక్కొచ్చు. వెంకీ గతంలో నితిన్ చేసిన 'అ ..ఆ' సినిమాకు దర్శకత్వ విభాగంలో పనిచేసిన సంగతి తెల్సిందే.



లవర్ జూన్ 14న విడుదల

తొలి చిత్రం ఉయ్యాల జంపాల తో సక్సెస్‌ఫుల్ హీరోగా కెరీర్‌ను స్టార్ట్‌చేసిన యువ కథానాయకుడు రాజ్‌తరుణ్. వరుస విజయాలతో తెలుగు ప్రేక్షకులందరికీ చాలా దగ్గరయ్యారు. ఇప్పుడు సక్సెస్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన హిట్ చిత్రాల నిర్మాత దిల్‌రాజు నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై లవర్ సినిమాలో నటిస్తున్నారు. అలా ఎలా ఫేమ్ అనీశ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా ప్రేమలో కొత్త కోణాలను టచ్ చేసేలా తెరకెక్కుతుంది. రిద్దికుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. ప్రవీణ్ పూడి ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోన్న ఈ సినిమాను జూన్ 14న విడుదల చేయడానికి నిర్మాత దిల్‌రాజు సన్నాహాలు చేస్తున్నారు

భయపెట్టని రా..రా!



నిర్మాణ సంస్థ: విజి చెర్రీస్ విజన్, నటీనటులు: శ్రీకాంత్, నాజియా, సీతా నారాయణ, రఘుబాబు, అలీ, హేమ, రఘుబాబు, అదుర్స్ రఘు, పోసాని కృష్ణమురళి తదితరులు, సంగీతం: ర్యాప్ రాక్ షకీల్, ఛాయాగ్రహణం: పూర్ణ, నిర్మాత: ఎం.విజయ్, దర్శకతం: విజి చరిష్ యూనిట్

హీరోల్లో వంద సినిమాలను దాటి సినిమాలు చేస్తున్న వారిలో శ్రీకాంత్ ఒకరు. హీరోగానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా శ్రీకాంత్ సినిమాలు చేస్తూ వస్తున్నారు. ఈయన కథానాయకుడుగా నటించిన చిత్రం రా..రా. ఆసక్తికరమైన విషయమేమంటే ఇప్పటి వరకు హారర్ జోనర్ సినిమాలే చేయని శ్రీకాంత్ తొలిసారి హారర్ జోనర్‌లో చేసిన రా..రా ప్రేక్షకులను ఏమేర ఆకట్టుకుందో తెలుసుకోవాలంటే సినిమా కథలోకి వెళదాం...

కథ:
వంద సినిమాల్లో 99 సినిమాలు సక్సెస్ సాధించిన గ్రేట్ డైరెక్టర్ తనయుడు రాజ్‌కిరణ్(శ్రీకాంత్) .. తన తండ్రిలా దర్శకుడు కావాలనుకుంటాడు. అయితే రాజ్‌కిరణ్ చేసిన తొలి మూడు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూస్తాయి. దాంతో అతని తండ్రి గుండెపోటుతో మరణిస్తే.. తల్లి ఆసుపత్రి పాలవుతుంది. తల్లి బ్రతకాలంటే ఎలాగైనా హిట్ సినిమా చేయాలనుకుంటాడు రాజ్‌కిరణ్. అందుకని, హారర్ సినిమా తీసి సక్సెస్ సాధించాలని అనుకుంటాడు. మంచి హారర్ కథ కోసం ఓ పురాతన భవంతిలోకి అడుగుపెడతాడు. తనకు తోడుగా తన స్నేహితులను కొంత మందిని ఆ బంగళాలోకి తీసుకెళతాడు. అప్పటికే ఆ బంగళాలో కొన్ని ఆత్మలు (రఘుబాబు, అలీ,హేమ మరికొందరు) తిరుగుతుంటాయి. వీరిని భయపెట్టి ఇంట్లో నుండి వెళ్లగొట్టాలని ప్రయత్నించి విఫలమవుతాయి. చివరకు రాజ్‌కిరణ్ టీంతో పందెం కాసి అందులో కూడా ఓడిపోయి బంగళా విడిచి పెట్టి వెళ్లిపోతాయి. అయితే అదే సమయంలో అసలు కథ మొదలవుతుంది. ఆ ట్విస్ట్ ఏంటి? అనేది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.

విశ్లేషణ:
125 సినిమాల్లో నటించిన హీరోగా శ్రీకాంత్‌కు ఇండస్ట్రీలో మంచి గుర్తింపు ఉంది. అయితే ఆయన ఈ మధ్య ఎంపిక చేసుకుంటున్న సినిమాలు అయన ఇమేజ్‌ను క్యారెక్టర్ ఆర్టిస్ట్ కంటే తక్కువ చేస్తున్నాయనిపిస్తుంది. ఎందుకంటే రా..రా సినిమా చూసే ప్రేక్షకులకు భయపడాలో.. నవ్వాలో.. అర్థం కాదు. ఇలాంటి నాసిరకం కథతో ఎన్నో సినిమాలు వచ్చాయి. బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లాపడ్డాయి. ఇలాంటి కథను శ్రీకాంత్ ఎంచుకుని చేయడమెందుకో సగటు ప్రేక్షకుడికి అర్థం కాదు. ఈ వయసులో దెయ్యాలతో శ్రీకాంత్ డాన్స్ స్టెప్స్ విరగదీయాలనుకోవడాలు.. సందర్భానుసారం కామెడీ నవ్వించే ప్రయత్నంలో చేసే నటన పైత్యపు నటనగా అనిపిస్తుంది. శ్రీకాంత్ వంటి సీనియర్ హీరోకి తగని నటన ఇది. ఇక సీతా నారాయణ, నజియాలు పెర్‌ఫార్మెన్స్ పరంగా ఆకట్టుకోలేదు.. గ్లామర్ పరంగానూ ఆకట్టుకోలేదు. ఏదో ఉన్నామంటే ఉన్నామనే చందాన నటించారు. ఇక పోసాని, హేమ, రఘుబాబు, అలీ, అదుర్స్ రఘు, షకలక శంకర్ ఇలా అందరూ మంచి కామెడీ తారాగణమే సినిమాలో కనపడ్డప్పటికీ సన్నివేశాల డిజైన్ చేసిన తీరు, తెరకెక్కించిన విధానం ఆకట్టుకోవు. ఇక ర్యాప్ రాక్ షకీల్ సంగీతం, నేపథ్య సంగీతం ప్రేక్షకుడి సహనానికి పరీక్ష పెడతాయి. పూర్ణ సినిమాటోగ్రఫీ బాలేదు. హారర్ చిత్రాలంటే సంగీతం, నేపథ్య సంగీతం, సినిమాటోగ్రఫీయే కీలకాంశాలుగా సినిమాను నడిపించాలి. ఈ సినిమా విషయంలో అన్ని డిపార్ట్‌మెంట్స్ ఘోరంగా ఫెయిల్ అయ్యాయి. గ్రాఫిక్స్, డిఐ అన్నీ నాసిరకంగా ఉన్నాయి. సినిమాకు దర్శకుడు లేని లోపం కొట్టొచ్చినట్లు కనపడుతుంది.

'యమ్6' ట్రైలర్ లాంచ్



విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరి, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బేనర్స్ పై విశ్వనాథ్ తన్నీరు, సురేష్.ఎస్ సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం యమ్6. మారుతి, శ్రావణి జంటగా నటిస్తోన్న ఈ చిత్రానికి జై రామ్ వర్మ దర్శకుడు. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ట్రైలర్ లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ - హర్రర్ అంశాలతో పాటు యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా యమ్6 చిత్రం రూపొందినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. హీరో మారుతి ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడు. భవిష్యత్‌లో మంచి హీరోగా ఎదిగే లక్షణాలు మెండుగా ఉన్నాయి. ట్రైలర్ కట్ చేయడంలోనే దర్శకుడి ప్రతిభ ఏంటో తెలిసింది. మ్యూజిక్ కూడా బాగుంది. యూనిట్ అందరికీ నా శుభాకాంక్షలు అన్నారు.

సాయి వెంకట్ మాట్లాడుతూ - మ్యూజిక్, నటీనటుల పర్ఫార్మెన్స్ ట్రైలర్‌లో ఆకట్టునే విధంగా ఉన్నాయి. ప్రతిభ గల దర్శకుడు, అభిరుచి గల నిర్మాత ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ద్వారా అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నా అన్నారు.

నటి రాగిణి మాట్లాడుతూ - నిర్మాత విశ్వనాథ్ గారు నాకు చాలా కాలం నుంచి తెలుసు. ఎంతో కష్టపడి పైకొచ్చిన వ్యక్తి. ట్రైలర్ బావుంది. ఈ సినిమాలో పని చేసిన ప్రతి ఒక్కరికీ మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నా అన్నారు.

సంగీత దర్శకుడు విజయ్ బాలాజి మాట్లాడుతూ - నేపథ్య సంగీతానికి స్కోపున్న చిత్రం. ఇందులో ఒక మంచి పాట కూడా ఉంది. దర్శక నిర్మాతలు ఇచ్చిన స్వేచ్ఛతో మంచి మ్యూజిక్ చేయగలిగాను అన్నారు.

దర్శకుడు జై రామ్ వర్మ మాట్లాడుతూ - నాలో ప్రతిభని గుర్తించి ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం కల్పించిన మా నిర్మాతకు రుణపడి ఉంటాను. ఇదొక సస్పెన్స్ థ్రిలర్ చిత్రం. కడుపుబ్బ నవ్వించే కామెడీ కూడా ఉంటుంది. అంతర్లీనంగా చిన్న సందేశం కూడా ఇచ్చే ప్రయత్నం చేశాం. విజయ్ బాలాజీ ఒక పాటతో పాటు అద్భుతమైన నేపథ్య సంగీతం సమకూర్చారు. సినిమాటోగ్రఫీ కూడా బాగా కుదిరింది అన్నారు.

నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ - దర్శకుడు చెప్పిన కథ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చాను. చెప్పినదాని కన్నా దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. మా హీరో మారుతికిది తొలి సినిమా అయినా ఎంతో అనుభవం ఉన్న హీరోలా చేశాడు. మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా అన్నారు.

హీరో మారుతి మాట్లాడుతూ - ఇది నా తొలి సినిమా. నేను నటన నేర్చుకోలేదు. దర్శకుడు చెప్పినట్లు ఫాలో అయ్యాను. మా నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా సినిమా నిర్మించారు. విజయ్ బాలాజీ గారు సంగీతం ఆకట్టుకునే విధంగా ఉంటుంది అన్నారు.

గోవింద, హరిత, వంశీ, ఇంద్రతేజ, ప్రియ, రహీం (రాకేష్ బాబు), మురళి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ ఎడిటింగ్: వంశీ కందాల, సినిమాటోగ్రఫీ : మహ్మద్ రియాజ్, సౌండ్ ఇంజనీర్: విష్ణు, సమర్పణ: శ్రీమతి పార్వతి, నిర్మాతలు: విశ్వనాథ్ తన్నీరు, సురేష్.ఎస్, దర్శకత్వం: జై రామ్ వర్మ.

మణిరత్నం దర్శకత్వంలో డయానా

విలక్షణమైన కాన్సెప్ట్‌లతో సినిమాలు చేసే దర్శకుల్లో మణిరత్నం ఒకరు. ఈయన దర్శకత్వంలో పనిచేయాలని చాలా మంది నటీనటులు కోరుకుంటారు. కానీ నాకు ఆ అవకాశం అనుకోకుండా వచ్చింది' అని అంటుంది డయనా ఎర్రప్ప. మణిరత్నం దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న చిత్రం 'నవాబ్' . ఈ సినిమాలో ఆడిషన్ కోసం చిత్ర యూనిట్ డయానాకు కాల్ చేస్తే ముందు ఫేక్ కాల్ అని అనుకుందట. అయితే అది నిజమేనని తెలియడంతో వెంటనే యూనిట్‌ను సంప్రదించింది. ఆడిషన్ పూర్తయిన కొన్ని రోజులు తర్వాత మణిరత్నం సినిమాలో ఉన్నట్లు యూనిట్ డయానాకు కన్ఫర్మ్ చేయడంతో థ్రిల్ అయ్యిందట. కారణం మణిరత్నం సినిమాలో నటిస్తానని ఊహించనే లేదు. అలాంటిది ఓ గొప్ప దర్శకుడి సినిమాతో తెరంగేట్రం చేయనుండటం కల నిజమైనట్లుగా డయానాకి అనిపించిందట. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన వర్క్ షాప్‌లో బిజీగా ఉందట డయానా ఎర్రప్ప..

'సీటీమార్' హీరో ఎవరు?

డైరెక్టర్ హరీష్ శంకర్‌కు దువ్వాడ జగన్నాథం హ్యాంగోవర్ ఇంకా తగ్గినట్టు లేదు. తాజాగా తాను డైరెక్ట్ చేయబోయే మూవీ నేమ్‌గా డీజేలోని ఓ సాంగ్‌ను ఎంచుకున్నారు. హరీష్ శంకర్ తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. దీనికి 'సీటీమార్' అనే టైటిల్‌ను సెలక్ట్ చేశారు. అయితే సీటీ కొట్టబోయే హీరో పేరు మాత్రం వెల్లడించలేదు. హరీష్ శంకర్‌కి ఓ ఇంట్రస్టింగ్ స్టోరీ లైన్ దొరికిందట. వెంటనే దీనిని తెరకెక్కించాలనే యోచనలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన దిల్ రాజు ప్రొడ్యూస్ చేస్తున్న దాగుడు మూతలు సినిమాను తెరకెక్కిస్తున్నారు. దీని తర్వాత సీటీమార్ మూవీని తెరకెక్కిస్తారని తెలుస్తోంది. అయితే సీటీమార్ సినిమాలో హీరోగా హరీష్ శంకర్ ఓ యంగ్ హీరోను అనుకుంటున్నట్టు సమాచారం. అయితే ఆ యంగ్ హీరో నిఖిల్ కానీ.. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ కానీ అయి ఉంటాడన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



కమల్ సమర్థుడు

ప్రజల మద్దతు సాధిస్తారు : రజని

చెన్నై : లోకనాయకుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) వ్యవస్థాపకుడు కమల్‌హాసన్‌పై ప్రముఖ తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపిం చారు. ప్రజావిశ్వాసం పొందగలిగే సామర్థ్యం కమల్‌కు ఉందని రజని వ్యాఖ్యానించారు. ఎంఎన్ఎం పేరుతో కమల్ కొత్త రాజకీయ పార్టీని స్థాపించడంపై రజని స్పందించారు. తాను, కమల్ భిన్న మార్గాలు, పార్టీల పేరుతో ప్రయాణి స్తున్నప్పటికీ తమ గమ్యం, లక్ష్యం మాత్రం ప్రజల సంక్షేమ మేనని రజని స్పష్టంచేశారు. ఎవరు ఏ మార్గంలో పయ నించినా అంతిమంగా అందరి లక్ష్యం ప్రజల సంక్షేమమేనని రజని శుక్రవారం ఇక్కడ విలేకరులతో అన్నారు. ఎంఎన్ ఎంపై మీ అభిప్రాయం ఏమిటని పాత్రికే యులు అడుగ్గా... శక్తిసామర్థ్యాలు గల మంచి వ్యక్తి కమల్‌హాసన్ అని రజని సమాధానం చెప్పారు. కమల్ సమర్థత గల మనిషి. ఆయన ప్రజల విశ్వాసాన్ని సాధిస్తారని సూపర్‌స్టార్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 21న కమల్ కొత్త పార్టీ స్థాపించడం శుభపరిణామం. వెరీనైస్. పార్టీ ఆవిర్భావ కార్యక్రమం చాలా బాగా నిర్వహించారు. ఆయన రాజకీయ ప్రయాణంపై ఇప్పటికే తాను శుభాకాంక్షలు తెలిపాను. ఎంఎన్ఎం ప్రారంభించిన తర్వాత ఇప్పుడూ శుభాకాంక్షలు చెబుతు న్నానని రజని అన్నారు. కమల్ ఇప్పటికే ఎంఎన్ఎంను స్థాపిస్తూ రజనీ తన రాజకీయ ప్రవేశంపై గతేడాది డిసెంబరులోనే ప్రకటన చేశారు. రాజకీయ ప్రవేశంపై తన నిర్ణయాన్ని తెలవడానికి ఇంతకుముందే రజనీకాంత్‌ను కలిసినట్లు కమల్ తమిళ వారపత్రికకు రాసిన వ్యాసంలో తెలిపారు. తాము ప్రత్యర్థి పార్టీల్లో ఉంటున్నప్పటికీ పరస్పరం గౌరవించు కుంటా మని, అలా ఉండాలని ఇరు వురూ నిర్ణయించుకున్నారు. రాజకీయ పార్టీ ప్రారంభానికి ముందు కమల్‌హాసన్ వరుసగా రజని, డీఎంకే అధినేత ఎం.కరుణానిధిని కలిశారు. కాగా, కావేరీ జలాల వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం పట్ల రజని సంతోషం వెలిబుచ్చారు.

ఉగ్రవాదంపై సమష్టి పోరు



వాణిజ్యంపై మోడీ, ట్రూడో చర్చలు

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూలు శుక్రవారం కీలక అంశాలపై చర్చలు జరిపారు. ఇంధన సహకారంతో సహా ఇరువైపులా ఆరు ఒప్పందాల తర్వాత ఉగ్రవాదంపై పోరు సల్పడంతో పాటు వాణిజ్య సంబంధాలను బలోపేతంపై చర్చించారు. సుమారు రెండున్నర గంటల సమావేశం అనంతరం కెనడా ప్రధానితో కలిసి మోడీ మీడియాతో మాట్లాడుతూ ద్వైపాక్షిక భాగస్వామ్యానికి సంబంధించి పూర్తిస్థాయి అంశాలను చర్చించామన్నారు. ఉగ్రవాదంపై పోరుకు రెండు దేశాలు కలిసి పని చేయడం ముఖ్యమైన ఆయన నొక్కి చెప్పారు. రాజకీయ లక్ష్యాల కోసం మత దుర్వినియోగానికి చోటు ఉండకూడదని తెలిపారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను సవాల్ చేసే వారిని ఉపేక్షించేది లేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

ఖలిస్థాన్ విషయంలో ట్రుడ్యూ ప్రభుత్వ సున్నిత వైఖరి నేపథ్యంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా గత కొన్ని రోజులుగా దేశంలోని వేర్వేరు ప్రాంతాలను ట్రూడో సందర్శిస్తున్నారు. దేశంలోని భిన్నత్వాన్ని కెనడా ప్రధాని అర్థం చేసుకున్నారని తాను భావిస్తున్నట్లు మోడీ అన్నారు. ట్రుడ్యూ మాట్లాడుతూ వాణిజ్య సహకారంలో భారత సహజ భాగస్వామి అని అభివర్ణించారు. అంతకుముందు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కెనడా ప్రధాని కలుసుకున్నారు. ఈ సందర్భంగా పరస్పర ప్రయోజనకర అంశాలపై చర్చించారు.

'ధనుష్' క్షిపణి ప్రయోగ పరీక్ష విజయవంతం



బాలాసోర్(ఒడిశా) : భారత్ అణు సామర్థ్యం కలిగిన 'ధనుష్' బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ పరీక్షను శుక్రవారం విజయ వంతంగా జరిపింది. ఒడిశా సముద్ర తీరంలో ఒక నౌక నుంచి 350 కిలోమీటర్ల లక్ష్య సామర్థ్యం కలిగిన ఈ క్షిపణిని ప్రయోగించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. దేశీయంగా రూపొందించిన 'పృథ్వీ' క్షిపణిలో ఒక రకమైన ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే 'ధనుష్' క్షిపణిని బంగాళాఖాతంలోని పారాదీప్ సమీపంలో నౌక నుంచి ఉదయం సుమారు 10.52 నిమిషాలకు ప్రయోగించినట్లు అధికారులు తెలిపారు. 500 కిలోల బరువును మోసుకుపోయే సామర్థ్యం ఉన్న 'ధనుష్' క్షిపణి భూమి, సముద్రంపై లక్ష్యాలను ఛేధించగలదు. రక్షణ దళాల వ్యూహాత్మక దళ కమాండ్(ఎస్ఎఫ్‌సీ) ద్వారా ఈ ప్రయోగ పరీక్ష నిర్వహించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. 'భారత నావికాదళం ద్వారా శిక్షణా కసరత్తులో భాగంగా క్షిపణిని ప్రయోగించాం' అని అధికారి ఒకరు చెప్పారు. ప్రయోగ పరీక్ష పూర్తిగా విజయవంతమైందన్నారు. 'ఒడిశా తీరంలో డీఆర్‌డీవో టెలీమెట్రీ, రాడార్ సదుపాయాల నుంచి క్షిపణి ప్రయోగం, దాని పనితీరును పర్యవేక్షించాం' అని తెలిపారు. ఏక దశలో ద్రవ చోదకశక్తి కలిగిన 'ధనుష్'ను ఇప్పటికే రక్షణ సేవల్లోకి చేర్చారు. సమగ్ర నిర్దేశ క్షిపణి అభివృద్ధి కార్యక్రమం(ఐజీఎండీపీ) క్రింద రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) ద్వారా అభివృద్ధి చేయబడిన ఐదు క్షిపణుల్లో ఇదొకటి. చివరిసారిగా 2015, ఏప్రిల్ 9న విజయవంతంగా ప్రయోగ పరీక్ష జరిపినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

యూపీ సమ్మిట్‌కు రొటోమ్యాక్ కొఠారి

ఆహ్వానితుల జాబితాలో పేరు ఆనక సవరించుకున్న వైనం

లక్నో : ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పెట్టు బడిదారుల భారీ సదస్సుకు 100 మంది కీలక ఆహ్వానితుల్లో రొటోమ్యాక్ చైర్మన్ విక్రమ్ కొఠారి ఒకరు. రూ.3 వేల కోట్ల మొత్తం బ్యాంకు రుణాల ఎగవేత ఆరోపణలపై సీబీఐ కస్టడీలోకి తీసుకోవడానికి వారం రోజుల ముందు కొఠారి పేరు యూపీ ప్రభుత్వ ఆహ్వానితుల జాబితాలో ఉండటం గమనార్హం. అయితే ఆయన కంపెనీ రుణ ఎగవేత వ్యవహారం బహిర్గతమైన తర్వాత కొఠారి పేరును ఆ జాబితా నుంచి తొలగిం చారు. యూపీ ప్రభుత్వం రూపొందించిన ఆహ్వానితుల తొలి జాబితాలో కొఠారి పేరు 88వ అతిథిగా ఉండగా, తర్వాత ఆయన సోదరుడు పాన్‌పరాగ్ గ్రూప్ చైర్మన్ దీపక్ కొఠారి పేరు ఉంది. ముఖేష్ అంబానీతో ప్రారంభమైన ఈ జాబితాలో 113 మంది పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్‌ల పేర్లు ఉన్నాయి. ఈ పెట్టుబడి దారుల సదస్సులో ఈ కీలక ఆహ్వానితులందరూ ముఖ్యమంత్రి యోగి ఆద్యితనాథ్, ఇతర సీనియర్ మంత్రులతో చర్చలు జరిపి, పెట్టుబడులపై ప్రతిజ్ఞ చేయాలని నిర్ణయించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. కొఠారి కంపెనీ రుణ ఎగవేత వార్తలు వెలుగులోకి రావడానికి ముందు ఆయన పేరును చేర్చడం జరిగిందని పరిశ్రమల మంత్రి సతీష్ మహాన తెలిపారు. 'మేము పారిశ్రామికవేత్తలను వారి ప్రొఫైల్ ఆధారంగానే ఆహ్వానించాం తప్ప వారి బ్యాలెన్స్ షీట్లు చూసిన తర్వాత కాదు. బ్యాంకు కుంభకోణం వెలుగులోకి రావడానికి ముందు కొఠారి ఒక ప్రముఖ వ్యాపారవేత్త. ఇటువంటి విషయాలను ఎవరూ ఊహించలేరు' అని మహాన చెప్పుకొచ్చారు. కాగా జాబితాలో నుంచి విక్రమ్ కొఠారి పేరుతో సహా ఆయన సోదరుడు దీపక్ కొఠారి పేరును కూడా తొల గించి జాబితాను సవరించినట్లు ఆ వర్గాలు తెలిపాయి.


కోర్టుకు కొఠారి : రోటోమాక్ యజమాని విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్‌ని సీబీఐ శుక్రవారంనాడు ఢిల్లీ కోర్టులో హాజరు పరిచింది. వారిని లక్నో తీసుకువెళ్లేందుకు ట్రాన్సిట్ రిమాండుకు పంపించాలని కోరింది. రూ. 3,695 కోట్ల మేర రుణం ఎగవేసిన కేసులో సీబీఐ వారిని కోర్టు ముందు హాజరుపరిచింది.



వారిరువురిని అడీషినల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమర్ విశాల్ ముందు హాజరుపరిచారు. రుణం తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారన్న ఆరోపణపై వారిరువురిని గురువారం అరెస్టు చేశారు. కోర్టు పరిధి పట్ల డిఫెన్స్ న్యాయవాది ప్రమోద్ కుమార్ దూబే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. నిందితులను సెషన్స్ కోర్టులో హాజరుపరచాలని, మెజిస్టీరియల్ కోర్టులో కాదని అన్నారు. పరిధిపై కోర్టు తన ఆదేశాలను రిజర్వు చేసుకుంది. ఏడు బ్యాంకులతో కూడిన కన్సార్టియం 2008 నుంచి రోటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 2,919 కోట్లు రుణంగా ఇచ్చిందని సీబీఐ ఎఫ్ఐఆర్ తెలిపింది. రుణాన్ని తిరిగి చెల్లించడంలో పదేపదే విఫలం కావడంతో వడ్డీలతో కలిపి ఆ మొత్తం ఇప్పుడు రూ. 3,695 కోట్లకు చేరిందని సీబీఐ వెల్లడించింది. బ్యాంకుల కన్సార్టియానికి బ్యాంకు ఆఫ్ ఇండియా నేతృత్వం వహిస్తోంది. ఈ కన్సార్టియంలో సభ్యునిగా బ్యాంకు ఆఫ్ ఇండియా చేసిన ఫిర్యాదు మేరకు చర్యకు సీబీఐ చొరవ తీసుకున్నది. వజ్రాల వ్యాపారి నిరవ్ మోడీ, ఆయన మామయ్య మెహుల్ చోక్సీ వలే కొఠారి కూడా దేశం విడిచి పోతాడనే భయంతో సీబీఐ చర్య తీసుకున్నది. వడ్డీ కలపకుండా అయితే, వివిధ బ్యాంకుల్లో కొఠారీకి ఉన్న అప్పులు బ్యాంకు ఆఫ్ ఇండియాకు రూ. 754.77 కోట్లు, బ్యాంకు ఆఫ్ బరోడాకు రూ. 456.63 కోట్లు, ఓవర్సీస్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు 771.07 కోట్లు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు రూ. 458.95 కోట్లు, అలహాబాద్ బ్యాంకుకు రూ. 330.68 కోట్లు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రకు రూ. 49.82 కోట్లు ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్‌కు 97.47 కోట్లు. విక్రమ్, ఆయన సతీమణి సాధన, రాహుల్, గుర్తుతెలియని బ్యాంకు అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది.

మార్చి 2నుంచి

సినిమా థియేటర్ల బంద్!



బెంగళూరు: క్యూబ్, యూఎఫ్‌వో ప్రతినిధులతో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సినీ నిర్మాతల ఐకాస చర్చలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో మార్చి 2 నుంచి దక్షిణాదిలో సినిమాల ప్రదర్శన నిలిపివేతకు నిర్మాతలు, పంపిణీదారులు నిర్ణయించారు. బెంగళూరులోని ఫిలిం ఛాంబర్‌లో దక్షిణాది రాష్ట్రాల సినీ నిర్మాతలు, పంపిణీదారుల ఐకాస శుక్రవారం సమావేశమైంది. సినిమాల ప్రదర్శనకు క్యూబ్, యూఎఫ్‌వో అధిక ధరలు వసూలు చేస్తున్నాయనే అంశంపై ఈ భేటీలో చర్చించారు. థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు వసూలు చేస్తున్న ధరలు తగ్గించాలని నిర్మాతల మండలి నిర్ణయించింది. వారి నిర్ణయాన్ని క్యూబ్, యూఎఫ్‌వో ప్రతినిధులు అంగీకరించలేదు. దీంతో మార్చి 2 నుంచి సినిమాల ప్రదర్శన నిలిపివేయాలని నిర్ణయించారు.

అసలేం జరిగింది.. : ఒకప్పుడు సినిమాను రీళ్ల ప్రింట్‌ల ద్వారా ప్రదర్శించే వారు. బాక్సులని ఒక థియేటర్ నుంచి మరొక థియేటర్‌కి పంపే వారు. ఈ రీళ్ల ప్రింట్‌లు దాదాపుగా దూరమై, సినిమా ప్రదర్శన డిజిటల్‌గా మారడం చిత్ర పరిశ్రమంలో ఓ విప్లవాత్మక మార్పు. శాటిలైట్ ద్వారా సినిమా డిస్ట్రిబ్యూషన్ పంపిణీ రంగ రూపు రేఖల్ని మార్చేసింది. ఒకప్పుడు ఒక రీల్ సినిమా ప్రింట్ చేయడానికి రూ.60 నుంచి 70వేల వరకూ అయ్యేది. డిజిటల్ సినిమాకు వ్యయం తక్కువ అవుతుండటంతో అందరూ అటువైపే మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో యూఎఫ్‌వో, పిక్సెడీ, క్యూబ్ వంటి 'డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు' సినిమాను అందిం చేందుకు ముందుకు వచ్చాయి. ఎంతో ఖర్చుతో కూడిన పని ఇది. అయితే పైసా ఖర్చు పెట్టకుండా 'మీ థియేటర్ ఇస్తే చాలు అన్నీ మేమే మార్చేస్తాం' అని చెప్పడంతో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు థియేటర్‌లను ఇచ్చేశారు. అంత ఖర్చు పెట్టి థియేటర్లను డిజిటలైజ్ చేయడం వల్ల సర్వీస్ ప్రొవైడర్లకు ఏం లాభం అనుకుం టున్నారా? అక్కడే అవి చిన్న తిరకాసు పెట్టాయి. డిజిటల్ సాంకేతికతకు మార్చి నందుకు వాటికి ఐదేళ్ల పాటు థియేటర్‌ను ఇస్తే సరిపోతుందన్నారు. ఆ తర్వాత సర్వీసు ఛార్జి తప్ప వర్చువల్ ప్రింట్ ఫీజ్ (వీపీఎఫ్) వసూలు చేయమని చెప్పాయి. అప్పుడలా చెప్పిన డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇప్పుడు ఇష్టానుసారంగా వీపీఎఫ్, ఇతర ఛార్జీలను వసూలు చేస్తోందని తెలుగు చిత్ర పరిశ్రమ ఆరోపిస్తోంది.ఈ నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ రంగంలోకి దిగి వాళ్లతో చర్చించింది. నిర్మాత సురేష్‌బాబు అధ్యక్షతన 45మంది సభ్యులతో ఏర్పాటైన జాయింట్ యాక్షన్ కమిటీ శుక్రవారం బెంగళూరులో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధానంగా మూడు డిమాండ్లను సర్వీస్ ప్రొవైడర్ల ముందుంచారు.

వాళ్లు మాకు ఓటేయలేదు

గుజరాత్ మంత్రి అక్కసు

గాంధీనగర్ : మాంసం వ్యాపారులు, చెప్పులు కుట్టేవారిపై గుజరాత్ మంత్రి ఒకరు అక్కసు వెళ్లగక్కారు. గుజరాత్‌లో బీజేపీకి కేవలం 99 అసెంబ్లీ సీట్లు మాత్రమే రావడంపై ఆ మంత్రి ప్రదీప్‌సిన్హా జడేజా స్పందించారు. మాంసం వ్యాపారులు, చెప్పులు కుట్టుకునేవారితో పాటు ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకించే ప్రజల కూడా తమకు ఓటు వేయలేదని, ఆ మంత్రి చెప్పారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. స్వల్ప తేడాతో కాషాయపార్టీ గట్టెక్కింది. బీజేపీ బలం 115 నుంచి 99కి పడిపోయింది. కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకున్నది. గత ఎన్నికల కన్నా 19 సీట్లు అదనంగా సాధించింది. 'మాకు ఓట్లు ఎవరు వేయలేదో మీకు చెబుతున్నా. కఠినమైన గోవధ నిరోధక చట్టం తీసుకొచ్చినందుకు మాపై కోపంతో ఉన్న మాంసం వ్యాపారులు బీజేపీకి ఓటేయలేదు. కఠినమైన చట్టం తీసుకొచ్చినందుకుగాను ఆగ్రహంతో ఉన్న చెప్పులు కుట్టుకునేవారు మాకు వ్యతిరేకంగా ఓటేశారు' అని నిండుసభలో రాష్ట్ర మంత్రి అక్కసు వెళ్లగక్కారు. గవర్నరు ఓపీ కోహ్లీ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంత్రి అసెంబ్లీలో మాట్లాడారు. ' ఫీజులపై నియంత్రణ విధిస్తూచట్టం తీసుకురావడం వల్ల చాలామంది పాఠశాల యాజమాన్యాలు సంతోషంగా లేవు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని, దీనిని వ్యతిరేకించే వారు సైతం మాకు ఓటేయలేదు. అయినా మేము బాధపడటం లేదు' అని అన్నారు.

లాలుకు బెయిల్ తిరస్కృతి

రాంచి : పశుదాణా కుంభకోణానికి సంబంధించి బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలు ప్రసాద్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను జార్ఖండ్ హైకోర్టు త్రోసిపుచ్చింది. పశు దాణాకు సంబంధించి డియోగర్ ఖజానా నుంచి రూ. 89.27 లక్షల రూపాయలను మోసపూరితంగా డ్రా చేసిన కేసుకు సంబంధించి లాలు బెయిల్ కోరారు. బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ త్రోసిపుచ్చారు. కుంభకోణం జరిగిన సమయంలో ఆయన ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా ఉన్నారని తెలిపింది. పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఏళ్లుగా ఫైల్‌ను దగ్గరుంచుకుని ఎటువంటి చర్య తీసుకోలేదు. లాలు వాదనను న్యాయమూర్తి త్రోసిపుచ్చుతూ, ఈ కుంభకోణానికి సంబంధించిన అన్ని కేసుల గురించి తనకు తెలుసునని, ఏ కేసులో కూడా కోర్టు బెయిల్‌పై విడుదల చేయలేదని తెలిపారు. పశుదాణా కుంభకోణానికి సంబంధించి సీబీఐ ప్రత్యేక కోర్టు గత ఏడాది డిసెంబరు 23వ తేదీన మూడున్నర సంవత్సరాల జైలుశిక్ష విధించింది. ఆర్‌జేడీ అధ్యక్షుడు అయిన లాలు ప్రసాద్‌ను రాంచి బిర్సా ముండా జైలులో డిసెంబరు 23 నుంచి వుంచారు. ఇప్పటి వరకు మూడు కేసులలో ఆయనకు బెయిల్ మంజూరైంది.

ఒడిశాలో ఎన్నికల హింస

మంత్రి సోదరుడు, మరో ముగ్గురిపై దాడి

బర్‌ఘర్ : ఒడిశా అసెంబ్లీకి ఉప ఎన్నిక జరగనున్న బీజపూర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికలకు ముందే హింస చోటుచేసుకున్నది. బనాబిరా ప్రాంతంలో శుక్ర వారం వేకువజామున ఒక గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన దాడిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుశాంత్ సింగ్ సోదరుడు, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. బీజపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో శనివారం ఉప ఎన్నిక జరగనున్నది. ఓట్ల లెక్కింపు ఈ నెల 28వ తేదీన జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సుబాల్ సాహు గత ఏడాది ఆగస్టులో మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. మంత్రి సోదరుడు సుబ్రాత్ సింగ్, ఆయన సహచరులు కారులో ప్రయా ణిస్తుండగా దుండగులు వారిని అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. బర్‌ఘర్ జిల్లాలో అర్థరాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఈ దాడి జరిగిందని పోలీసు అదనపు సూప రింటెండెంట్ యశోవంత్ సేనాపతి తెలిపారు. దాడికి పాల్పడిన వారు కారుపై కాల్పులు జరిపారు. విండ్‌షీల్డ్‌ని రాళ్లతో ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. "గాయా లైన నలుగురు వ్యక్తులను హుటా హుటిన సమీపంలోని సొహెలా ఆస్పత్రికి తరలించాం. ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం బుర్లాలోని వీర్ సురేంద్ర సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ (వీఐఎంఎస్ఏఆర్)లో చేర్పించాం" అని అధికా రులు తెలిపారు. ఈ దాడికి సంబంధించి నేటి సాయం త్రం వరకు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని, వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

"ఉప ఎన్నికలో ఓడిపోతామన్న భయంతో రేపు జరిగే ఉప ఎన్నికల క్రమానికి విఘాతం కలిగించేందుకు బీజేపీ పన్నిన కుట్రలో భాగంగానే ఈ దాడి జరిగింది" అని బీజేడీ ఉపాధ్యక్షులు ప్రసన్న ఆచార్య విమర్శించారు. అయితే, ఇవి నిరాధారమైన ఆరోపణలుగా బీజేపీ నేతలు పేర్కొన్నారు.

పెట్టుబడి సదస్సు పేరుతో ప్రజాధనం వృథా

- ఆ నిధులు పేదలకు వెచ్చించడం మంచిది
- శాంతిభద్రతల రక్షణతోనే పరిశ్రమలు వస్తాయి
- యూపీ ప్రభుత్వంపై మాయావతి నిప్పులు

లక్నో : ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై బీఎస్‌పీ అధినేత్రి మాయావతి విరుచుకుపడ్డారు. పెట్టుబడిదారుల సదస్సు పేరుతో ప్రజాధనాన్ని యూపీ ప్రభుత్వం వృధా చేస్తున్నదని ఆరోపించారు. ఆ డబ్బును సదస్సులకు కాకుండా పేదలు, అట్టడుగువర్గాల ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తే ఉపయుక్తంగా ఉంటుందని హితవు పలికారు. పెట్టుబడి దారుల సదస్సులు నిర్వహించడం బీజేపీ ప్రభుత్వాలకు ఫ్యాషన్‌గా మారిందని, ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును నీళ్ల ప్రాయంగా ఖర్చు పెడుతున్నాయని మాయావతి ఆరోపించారు. ఆ డబ్బును పేదలు, అట్టడుగు వర్గాలు, యువత, మహిళలకు సాయంగా అందిస్తే మంచిదని అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్-2018పై స్పందిస్తూ మాయావతి పైవిధంగా స్పందించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని బీఎస్‌పీ అధినేత్రి ఆరోపించారు. సదస్సులు నిర్వహించడమంటే ప్రజలకు గొప్పగా సేవ చేసినట్టు బీజేపీ ప్రభుత్వాలు భావిస్తున్నా యని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపరిస్తే పెట్టుబడిదారులు తమంతట తామే వస్తారని, యూపీ సమ్మిట్‌ను పెద్ద రాజకీయ వ్యాపారంగా మారుస్తున్నారని మండిపడ్డారు. పోలీసు ఎన్‌కౌంటర్ల ద్వారా, బీజేపీ నేతలు సృష్టిస్తున్న జంగిల్ రాజ్, మాఫియా రాజ్‌ల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా శాంతిభద్రతలు మెరుగుపడబోవని హితవు పలికారు. బీజేపీ నాయకులు, మంత్రులపై గల క్రిమినల్ కేసులను వెనక్కి తీసుకుంటే శాంతిభద్రతలు మెరుగుపడవన్నారు. ఇదే విధానం కొనసాగిస్తే శాంతిభద్రతలను మరింత ప్రమాదంలోకి నెట్టినవారవుతారని యోగి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శాంతిభద్రతలు పరిరక్షించడం ప్రతి ప్రభుత్వం ప్రధాన బాధ్యతన్నారు. విద్వేషం, హింస, మతోన్మాదం, కులతత్వాన్ని పెంచి పోషించడమే బీజేపీ ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని, అందుకే శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతను అవి తీసుకోవని మాయావతి నిశితంగా విమర్శించారు. కోట్లాది రూపాయల విలువైన ఒప్పం దాలపై సంతకాలు చేశామని చెప్పడం ద్వారా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని బీఎస్‌పీ అధినేత్రి అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పెట్టుబడిదారులు పరిశ్రమలు ఎలా ఏర్పాటు చేస్తున్నారో ఆ పార్టీ నాయకులే చెప్పాలని ఆమె ప్రశ్నించారు.



పీఎన్‌బీ నేరస్తులను కాపాడబోం : గడ్కరీ

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన నేరస్తులపై కేసులు బనాయిస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం స్కామ్‌లకు పాల్పడేవారిని ఎటువంటి పరిస్థితుల్లోనూ రక్షించబోదన్నారు. బ్యాంకు నుంచి రూ.11,400 కోట్ల మెగా కుంభకోణానికి పాల్పడి విదేశాలకు చెక్కేసిన వారిగురించి ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయనపై విదంగా సమాధానం ఇచ్చారు.

రైతు సమస్యలపై అట్టుడికిన అసెంబ్లీ

జైపూర్ : రైతు సమస్యలపై రాజస్థాన్ అసెంబ్లీ అట్టుడికింది. దీంతో రెండు సార్లు అసెంబ్లీ వాయిదా పడింది. ఆందోళ నిర్వహిస్తున్న రైతుల గురించి ప్రభుత్వం సమాధానమివ్వాలని స్వతంత్ర అభ్యర్థి రాజ్‌కుమార్ శర్మ అడిగారు. దీనికి సమా ధానం ఇవ్వనందుకు కాంగ్రెస్ సభ్యులు కూడా సభలో గందరగోళం సృష్టించారు. దీంతో స్పీకర్ సభను అరగంటపాటు వాయిదా వేశారు. నీటిపారుదల మంత్రి రామ్‌ప్రతాప్ మాట్లాడుతూ రైతుల సమస్యలపై జాబితా తయారు చేసి సభలో ఒక రోజు చర్చిద్దామన్నారు. దీనిలో మంత్రులు రాజేంద్ర రాథోర్, యూనస్ ఖాన్ కల్పించు కోవడంతో గందరగోళం చెలరేగింది. దీంతో రెండోసారి సభ వాయిదా పడింది.

కార్తీ ముందస్తు బెయిలుపై మార్చి 6న విచారణ

న్యూఢిల్లీ : కేంద్రమాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం ముందస్తు బెయిలు పిటిషన్‌పై మార్చి 6న విచారణ జరగనుంది. ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్తీ చిదంబరాన్ని మార్చి 1 లోపు హాజరుకావాలని కోరడాన్ని సుప్రీంకోర్టు నిరాక రించింది. న్యాయమూర్తులు దీపక్ మిశ్రా, అమితవరాయ్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మార్చి6కు విచారణను వాయిదా వేసింది. సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబాల్ కార్తీ తరపున వాదిస్తారు.

విద్యార్థినిని తలనరికి చంపిన దుండగుడు

అనుప్పూర్ : టీనేజ్ విద్యార్థినిని దుండగుడు కత్తితో తలనరికి చంపాడు. ఇంటర్ పరీక్షకు హాజరవుతుండగా దారికాచి ఈ ఘటనకు పాల్పడ్డాడని శు క్రవారం పోలీసులు తెలిపారు. కత్తితో మెడపై రెండుమూడు వేట్లు వేయగానే ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిందన్నారు. ఈ ఘటననను చూసిన స్కూలు టీచరు వెంటనే పోలీసులకు సమాచారం అందించిందన్నారు. ఘటనా స్థలం నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ సునీల్ జైన్ వెల్లడించారు. మృతురాలి బంధువుల సమాచారం మేరకు కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు.

ఒడిశాలో ప్రాచీన ఆయుధాలు వెలికితీత

సంబాల్‌పురం: ఒడిశాలోని సంబాల్‌పూర్ వర్సిటీ పురాతత్వ శాస్త్రవేత్తలు రాతి పనిముట్లు, ఆయుధాలు వెలికితీశారు. వందలాది ఏళ్ల క్రిందట రాతియుగం మనుషులు వీటిని తయారు చేశారని వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ వెల్లడించారు. ఎగువ దంతె ప్రాంతంలోని జీరానదీ పరివాహక ప్రాంతంలో వీటిని కనుగొన్నామని చరిత్ర శాఖకు చెందిన పీకే బెహరా తెలిపారు. దీంతో భారతదేశంలోని వలసల గురించి తెలుసుకోవచ్చని వారు వెల్లడించారు.

గోరఖ్‌పూర్ విధ్వంస కేసు కొట్టివేత

అలహాబాద్: గోరఖ్‌పూర్ విధ్వంస కేసులో స్వతంత్ర దర్యాప్తును కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. 2007 జనవరి 27లో జరిగిన ఈ అల్లర్లలో అప్పటి గోరఖ్‌పూర్ ఎంపీ ప్రస్తుత ముఖ్యమంత్రి, యోగి ఆదిత్యనాథ్ ఒక నిందితుడిగా ఉన్నారు. న్యాయమూర్తులు కృష్ణమురళి, అఖిలేష్‌చంద్ర శర్మలతో కూడిని ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును కొట్టివేసింది. 2017 మే 3న దాఖలైన రిట్ పిటిషన్ మేరకు హోంశాఖ కార్యదర్శి దర్యాప్తు జరుపుతున్నందున ఈ కేసును కొట్టివేశామన్నారు.

గోవా విమానయానానికి అంతరాయం

పనాజీ : పొగమంచు కప్పడంతో గోవా విమానాశ్రయంలో విమాన యానానికి అంతరాయం ఏర్పడింది. దీంతో రెండు అంతర్జాతీయ, మూడు దేశీయ విమానాలను దారి మళ్లిం చామని అధికారులు తెలిపారు. రష్యానుంచి వచ్చిన చార్టర్ విమానాన్ని బెంగళూరుకు, లండన్ లోని మాంచెస్టర్ నుంచి వచ్చే విమానాన్ని ముంబైకి దారిమళ్లించామన్నారు. ఉదయం 8.30 గంటలకు ఎండరావడంతో యధావిధిగా సర్వీసుల పునరుద్ధరించామని అధికారులు వెల్లడించారు.

బీజేపీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

అశోక్‌నగర్ (ఎంపీ) : ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర జైన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం జరగనున్న మురగోలి ఉప ఎన్నికల్లో గురువారం సాయంత్ర 5 గంటలు దాటిన తర్వాత కూడా ఎన్నికల ప్రచారం చేస్తున్నందున జైన్ అతని డ్రైవర్ రఖీబ్‌ఖాన్‌లను అరెస్టు చేశామని ముంగోలి ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం

ముంబై : ముంబై శివార్లలోని రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం జరి గిందని అయితే ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని మున్సిపాలిటీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 9.20 గంటలకు జోగీశ్వరి కెమికల్ ఫ్యాక్టరీలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. నాలుగు అగ్నిమాపక ఇంజన్లు మంటలను అదుపులోకి తెచ్చాయని, ప్రమాదానికి కారణాలు తెలియలేదని, ముంబైలో రెండు నెలల కిందట ఒక అగ్నిప్రమాదం సంభవించిందన్నారు.

గిరిజనుడిని కొట్టి చంపిన స్థానికులు

పలాక్కడ్ : దుకాణాల్లో చిన్నచిన్న వస్తువులు దొంగిలిస్తున్నాడని స్థానికులు 35 ఏళ్ల గిరిజన యువకుడు మధును కొట్టి చంపారని పోలీసులు తెలిపారు. మృతుడికి మతిస్థిమితం లేదని పోలీసులు అనుమానిస్తున్నారు. రాష్ట్రంలో అట్టప్పాడిలో మధు నివ శిస్తున్నాడు. చిరిగి పోయిన దుస్తులతో ఈ ప్రాంతంలో తిరుగుతుండేవాడని అతని చేతులు కట్టేసి అతని తో కొందరు సెల్ఫీలు తీసుకున్నారన్నారు. గాయాలపాలైన గిరిజనుడిని పోలీసుల ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే జీపులో వాంతి చేసుకున్నాడని మార్గమధ్యంలో చనిపోయా డన్నారని పోలీసులు తెలిపారు.

సునంద మృతి కేసులో ఢిల్లీ పోలీసులకు నోటీసు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ భార్య సునంద పుష్కర్ మృతి పై సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులకు నోటీసు జారీ చేసింది. బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి ఆమె మృతిపై సిట్‌తో న్యాయవిచారణ జరపాలని పటిషన్ దాఖలు చేయడంతో న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, ఏఎం ఖన్విల్కర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఢిల్లీపోలీసులకు నోటీసులు పంపింది. 2014 జనవరి17న ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో సునందా పుష్కర్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే.

అన్నాహజారే లక్నో పర్యటన

లక్నో : సామాజిక కార్యకర్త అన్నాహజారే జరపతలపెట్టిన 'సత్యాగ్రహ'కు ప్రజల మద్దతుకోసం రెండు రోజులు లక్నోలో పర్యటించనున్నారు. లోక్‌పాల్ బిల్లును ప్రవేశపెట్టాలని మార్చి 23న అమరవీరుల దినోత్సవం సందర్భంగా 'సత్యా గ్రహ' తలపెట్టిన విషయం తెలిసిందే. ఈనెల 26, 27ల్లో లక్నో సితాపూర్‌లోనూ 28న పూనేలోను పర్యటిస్తారు. దేశంలో రైతు ఆత్మహత్యలు, ఎన్నికల సంస్కరణలు అత్యవసరంగా చేపట్టాలని ఆయన ఆందోళన నిర్వహిస్తున్నారు.

అలాంటి అధికారులను కొట్టాల్సిందే

న్యూఢిల్లీ : అన్షు ప్రకాష్ వంటి అధికారులను కొట్టాల్సిందేని ఆప్ మరో ఎమ్మెల్యే బల్యాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ నగర్‌లో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ చీఫ్ సెక్రటరీ తమపై తప్పుడు ఆరోపణలు చేశారని, సాధారణ పౌరుల పనులను నిలిపివేసే అధికారులకు ఇలా బుద్ధి చెప్పాల్సిం దేనన్నారు. ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై ఆప్ ఎమ్మెల్యేల దాడి వివాదం పై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ చీఫ్ సెక్రటరీపై దాడికి పాల్పడి అరెస్ట్ అయిన ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు అమనుతుల్లా ఖాన్, ప్రకాష్ జర్వాల్‌ల బెయిల్ పిటిషన్‌లను ఢిల్లీ కోర్టు తోసిపుచ్చుతూ,14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని కోర్టు ఆదేశించిన విషయం విదితమే.



దివ్యాంగులకు ఉద్యోగాల కల్పన మన బాధ్యత

విశాలాంధ్ర - విజయవాడ : సమాజంలోని విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం మన బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో యూత్ ఫర్ జాబ్స్, యాక్సిస్ బ్యాంక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పన అంశంపై వివిధ కార్పొరేట్ సంస్థలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నేడు సమాజంలో విభిన్న ప్రతిభావంతులు (వికలాంగులు) ఏ పనిచేయలేమన్న మానసిక ఆందోళనకు గురవుతారన్నారు. వీరు కూడా అందరిలాగానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తారని యూత్ ఫర్ జాబ్స్ సంస్థ నిరూపించిందన్నారు. యూత్ ఫర్ జాబ్స్ సంస్థ ఇప్పటివరకు ప్రత్యేక శిక్షణా కేంద్రాల ద్వారా 12 వేల మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు 70 శాతం మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. ప్రతి కార్పొరేట్ సంస్థ బాధ్యతగా వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. జేసీ విజయకృష్ణన్ మాట్లాడుతూ నూతన రాజధాని ప్రాంతంలోని రాబోయే కార్పొరేట్, ప్రైవేటు కంపెనీల ప్రతినిధులతో సంస్థ సభ్యులు స్వయంగా మాట్లాడి ఉపాధి కల్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ అడిషనల్ సీఈవో విన్నీ పాత్రో, ఏపీ ఆర్‌ఎంఎస్‌ఏ చీఫ్ పి.ప్రభాకరన్, మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య, యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధి వి.రామకృష్ణ, మడోన్నా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరి, యూత్ ఫర్ జాబ్స్ ప్రతినిధి లక్ష్మి పాల్గొన్నారు.

సూర్యలంకలో 25 నుంచి బీచ్ కబడ్డీ పోటీలు



విశాలాంధ్ర - బాపట్ల : ఆల్ ఇండియా బీచ్ కబడ్డీ పోటీలకు గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని సూర్యలంక బీచ్ ముస్తాబు అవుతోంది. ఈ నెల 25వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న పోటీలకు బాపట్ల వేగేశన ఫౌండేషన్ చైర్మన్ వేగేశన నరేంద్రవర్మ స్పాన్సరర్‌గా వ్యవహరిస్తున్నారు. స్థానిక వేగేశన ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం వేగేశన నరేంద్రవర్మ పోటీల వివరాలను మీడియాకు వెల్లడించారు. జాతీయ క్రీడల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన బీచ్ కబడ్డీ పోటీలకు సూర్యలంక వేదిక కావడం విశేషమన్నారు. 10వ ఆల్‌ఇండియా బీచ్ కబడ్డీ పోటీలను ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి, ఏపీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావుతోపాటు మరికొందరు రాష్ట్ర మంత్రులు పాల్గొంటారన్నారు. ఆల్ ఇండియా బీచ్ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ మాట్లాడుతూ సూర్యలంక తీరంలో రెండు పిచ్‌లను నిర్వాహకులు అద్భుతంగా రూపొందించారన్నారు. దేశంలోని 25 రాష్ట్రాల నుంచి 55 జట్లు ఈ పోటీలలో పాల్గొంటాయన్నారు. స్త్రీ, పురుషులకు వేరు వేరుగా కోర్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీచ్ కబడ్డీ పోటీల చివరి రోజు బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంకేతికశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఊసా రాంబాబు, కర్లపాలెం మండల సర్పంచ్ సంఘ అధ్యక్షులు గుండ్రెడ్డి శివ, చారువాక తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో మసాజ్ సెంటర్‌పై దాడి

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : గుంటూరు నగరం లక్ష్మీపురంలోశ్రీతీ బౌన్స్ బాడీమసాజ్ సెంటర్‌పై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేసి ఆరుగురు యువతులతోపాటు విటుడు, నిర్వాహకులను అరెస్ట్ చేశారు. బౌన్స్ బాడీమసాజ్ సెంటర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా ఎస్పీ ఆదేశాలతో క్యూఆర్ బృందం ఎస్‌ఈ నాగూర్‌మీరా ఆధ్వర్యంలో మసాజ్ సెంటర్‌పై దాడి చేశారు. ఆరుగురు అమ్మాయిలు, విటుడు, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. రూ.18,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. రాజధాని పరిధిలోని గుంటూరు నగరంలో మసాజ్‌సెంటర్‌లో అసాంఘిక కార్యకలాపాలు వెలుగుచూడటం కలకలం రేపింది.

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చేందుకు కృషిచేస్తాం

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : గిరిజనులకు అన్యాయం జరగకుండా మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమం, చేనేత, జౌళిశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రిలే నిరాహార దీక్ష చేస్తున్న మత్స్యకారులతో శుక్రవారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలసి చర్చించారు. చర్చల అనంతరం మత్స్యకారులు దీక్ష విరమించేందుకు అంగీకరించినట్టు మంత్రి చెప్పారు. మత్స్యకార సంఘ నాయకులతో చర్చించిన అంశాలను మంత్రి మీడియాకు వివరించారు. మత్స్యకారులు తమను గిరిజన జాబితాలో చేర్చాలని 75 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నారని, వీరి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తెచ్చామని చెప్పారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల గిరిజనులకు అవకాశాలు తగ్గిపోతాయనేది వాస్తవం కాదన్నారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. మార్చి 5వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సమస్య పరిష్కార బాధ్యత తీసుకుంటామన్నారు. మత్స్యకార సంఘం నాయకులు ఎస్. చంద్రమోహన్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులు హరించే ఉద్దేశం మత్స్యకారులకు లేదని అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టాలని కోరారు. అనంతరం ప్రభుత్వ విప్ కూన రవికుమార్, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, గుండ లక్ష్మీదేవి దీక్ష శిబిరం వద్దకు చేరుకుని నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో గౌతు శిరీష, నారాయణమూర్తి, బోయిన గోవిందరావు, మత్స్యకార నాయకులు ఫాల్గుణరావు, మధు గౌతం, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సవరణ

ది. **22-2-2018** నాడు విశాలాంధ్ర 10వ పేజీలో ప్రచురించబడిన భూసేకరణ-6Aలో గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామం షెడ్యూలు, క్రమసంఖ్య 2లో సర్వే నెం. **41-1**కి బదులు సర్వే నెం. **41-3**గా ప్రచురితమైనది. దానిని సర్వే నెం. **41-1** గా భావించగలరు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయితీ రాజ్ శాఖ

నెం.05/టి.ఓ/2017-18, **టెండర్ ప్రకటన** తేది : 17-2-2018

గుంటూరు వారి పరిధిలోని ఫిరంగిపురం మండలం ఫిరంగిపురం గ్రామంలో తహశీల్దార్ కార్యాలయము కొరకు షుమారు రూ. 90.00 లక్షల విలువ చేయు బిల్డింగ్ నిర్మాణము చేయుటకు ప్లాన్, డిజైన్ మరియు డ్రాయింగ్స్ తయారు చేయుటకు అర్హులైన రిజిష్టర్డ్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ వారి నుండి టెండర్లు కోరబడుచున్నవి. అప్లికేషను స్వీకరించుటకు ఆఖరు తేది : 9-3-2018. సా. 5 గం.ల వరకు. షెడ్యూలు ఇవ్వబడు ఆఖరు తేది : 12-3-2018 మ. 1 గం. వరకు. సీల్ టెండర్లు స్వీకరించు తేది : 12-3-2018 సా. 3 గం. వరకు. సీల్ టెండర్లు తెరువబడు తేది : 12-3-2018 సా. 3.30 గం. వరకు. వివరములకు ఈ కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (పి.ఆర్.) పి.ఐ.యు. డివిజన్, గుంటూరు

DIPR/3548/CL/ADVT-1/1/17-18 Dt. 23-2-18

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

నెం. 19/టి.ఓ/2017-18/ తేది : 21-2-2018

కార్యనిర్వాహక ఇంజనీరు (ర.భ) డివిజను, అమలాపురం వారు యం.డి. ఆర్ట్స్ మరియు రూరల్ రోడ్స్ (ర.భ)లకు సంబంధించిన 13 పనులకు అర్జంటు రిపేర్స్ పనులను చేపట్టుటకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 13 పనులకు అంచనా విలువ : రూ. 91.95 లక్షలు. ఆసక్తిగల టెండరుదార్లు వారి బిడ్స్‌ను 9-3-2018 సా. 3-30 గం. వరకు ఆఫర్ చేయవచ్చును. టెండర్లు తెరువబడు తేది : 9-3-2018 సా. 4 గం. వరకు. వివరాలకు www.apeprocurement.gov.in నందు చూడవచ్చును. ఫోన్. 08856-231181.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజను, అమలాపురం

DIPR/3552/CL/ADVT-1/1/17-18 Dt. 23-2-18

జాతీయ ఆహార భద్రతా చట్టం పటిష్ట అమలు

విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ పటిష్టంగా అమలుచేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ అధ్యక్షులు జేఆర్. పుష్పరాజ్ ఆదేశించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం-2013, ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ సెక్యూరిటీ రూల్స్-2017 పై అవగాహన కోసం శుక్రవారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. జాతీయ ఆహార భద్రతా చట్టం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మూడంచెల విధానం తీసుకువచ్చామన్నారు. చట్టం అమలు లో అవకతవకలు జరిగినట్లు కమిషన్ దృష్టికి తీసుకొస్తే సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తామన్నారు. రాష్ట్రంలో కోటి 44 లక్షల రేషన్‌కార్డులు ఉండగా, పల్స్ సర్వేలో ఒక కోటి 32 లక్షల కుటుంబాలు మాత్రమే ఉన్నట్లు తేలిందన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల పంపిణీలో గానీ, పౌష్టికాహార పథకాల అమలులో గానీ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుష్పరాజ్ స్పష్టం చేశారు. ఆహార పదార్థాలలో కల్తీ ఎక్కువ అయినందున అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల కమిషనర్ బి.రాజశేఖర్, ఆహార కమిషన్ కన్వీనర్ జి.రవిబాబు, ఆహార కమిషన్ సభ్యులు జి.కృష్ణమ్మ, డాక్టర్ స్వర్ణభారతి, ఎస్.విజయకుమార్, ఎల్.బి. వెంకట్రావు,



శ్రీనివాసరావు, జాతీయ ఆహార భద్రతాచట్టం ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ముంగా వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ యాస్మిన్, డీఎస్‌వో చిట్టి బాబు, ఆర్డీవోలు రవీంద్రబాబు, శ్రీనివాసరావు, నరసింహం తదితరులు పాల్గొన్నారు.





నిర్వాసితులను మోసం చేస్తారా

వేలేరుపాడు అఖిలపక్షం ర్యాలీలో నేతల ప్రశ్న

విశాలాంధ్ర- వేలేరుపాడు : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ప్రభుత్వం మోసం చేయడం దుర్మార్గమని అఖిలపక్ష నేతలు నిప్పులు చెరిగారు. బాత్‌రూమ్ కొలతలతో పిచ్చుకగూడుల్లాంటి గదులు కట్టి ఇది ఇల్లు అంటూ మభ్యపెట్టడం సిగ్గుచేటు అన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం కోరుతూ శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లాలోని వేలేరుపాడులో అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న నిర్వాసితులు 3 గంటలపాటు ధర్నా అనంతరం తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి డేగాప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతోపాటు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పోలవరం నిర్మాణం కోసం త్యాగం చేస్తున్న ముంపు మండలాల ప్రజలను ప్రభుత్వం మోసం చేయాలనుకోవడం బాధాకరమన్నారు. నిర్వాసిత కుటుంబాల సర్వే అస్తవ్యస్తంగా చేయడంతో అనేక మందికి అన్యాయం జరిగిందన్నారు. జీవితాలతో ముడిపడిన ఇటువంటి విషయంలో ప్రభుత్వం తీరు సరైనది కాదన్నారు. ముంపు మండలాలను ఆంధ్రాలో కలిపిన ఘనత నాదేనని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి వారి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను అఖిలపక్షం లేవనెత్తితే కేసులు పెడతారా అని నిలదీశారు. పోలవరం నిర్మాణంలో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. కాంట్రాక్టర్లకు వందల కోట్లు పెంచడానికి డబ్బు ఉంది కానీ, నిర్వాసితులకు ఇవ్వడంలో కోతలు పెట్టడాన్ని చూస్తే ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. టీడీపీ మండల స్థాయి నాయకుడు ఆమరణ నిరాహారదీక్ష చేశాడంటే ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.

ప్రతి కుటుంబానికి ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాల్సిందే

ప్రతి నిర్వాసిత కుటుంబానికి 5 సెంట్లు స్థలం ఇచ్చి, రెండు పడక గదుల ఇల్లు నిర్మించాలని నేతలు డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 10 లక్షల రూపాయలు, బతుకుతెరువు కోసం వెళ్లిన స్థానికులకు ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీయువకులకు ప్యాకేజీ వర్తింపజేయడంతోపాటు పోడు భూములకు భూ నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని తక్షణం రీసర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, మండల స్థాయి నాయకులు సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, పీ.ప్రసాద్, కరాటం సీతామహాలక్ష్మీ,మడకం ఇందిర, సీపీఎం నాయకులు మడివి దుర్గారావు, రమేష్, కారం వెంకట్రావ్, వైసీపీ నాయకులు కేసగాని శ్రీనివాసరావు, బద్దికృష్ణ, బద్ది ప్రసన్న, కాంగ్రెస్ వలపర్ల రాములు, సమ్మయ్యగౌడ్, ఎస్‌కే ఇబ్రహీం, జీ భాస్కర్, సీపీఐ కుక్కునూరు నాయకులు మైసాక్షి వెంకటాచారి, శ్యామల, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



మైన్స్ సర్వేయర్ మురళీకృష్ణ



డీఈ రామకృష్ణ

ఏసీబీ వలలో మరో ఇద్దరు అవినీతి అధికారులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : రాష్ట్రంలోని విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో శుక్రవారం ఏసీబీ వలకు ఇద్దరు అవినీతి అధికారులు చిక్కారు. విశాఖపట్నం మైన్స్ శాఖ ఏడీ కార్యాలయంలోని సర్వేయర్ మురళీకృష్ణ క్వారీకి అనుమతి కోసం రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ కథనం ప్రకారం.. పరవాడ మండలం రావాడలో మట్టి క్వారీలకు అనుమతుల కోసం డి.నీలకంఠరావు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 28వ తేదీన సర్వే చేయాల్సి ఉంది.° క్వారీ మంజూరు అయ్యేలా నివేదిక కోసం మురళీకృష్ణను కలిశారు. దీనికి రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. నీలకంఠరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం ఉదయం 11.30 నీలకంఠరావు నుంచి మురళీకృష్ణ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదును సీజ్ చేసి మురళీకృష్ణను కస్టడీలోకి తీసుకున్నారు.

పెనుమంట్ర పంచాయతీరాజ్ డీఈ

ఏలూరు : రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ఫైల్‌పై సంతకం కోసం రూ.25 వేల లంచం తీసుకుంటున్న పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ గోపాలకృష్ణ కథనం ప్రకారం... పెనుగొండ గ్రామ సర్పంచ్ భర్త యాదాల రవిచంద్ర గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీ అనుమతి పొందారు. సాంకేతిక పరిపాలన అనుమతి కోసం ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపడం కోసం రవిచంద్రను రూ.25 వేలు లంచం ఇవ్వాలంటూ డీఈ రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈ కార్యాలయంలో రామకృష్ణకు రూ.25 వేలు లంచం ఇస్తుండగా పట్టుకున్నారు. రామకృష్ణను విజయవాడ ఏసీబీ కోర్టుకు తరలించారు.

రాయలసీమలో రెండవ రాజధాని

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్రంలో అధికారమంతా ఒకేచోట కేంద్రీకృతమైతే భవిష్యత్‌లో వేర్పాటువాద ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉన్నందున రాయలసీమలో రెండవ రాజధాని, హైకోర్టు ఏర్పాటుచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రాయలసీమలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడంతో పాటు సెక్రటేరియట్‌లోని కొన్ని శాఖలకు భవనాలను ఇక్కడ ఏర్పాటుచేయాలన్నారు. ముఖ్యమంత్రి నివాస భవనంతో పాటు గవర్నర్ తాత్కాలిక విడిది భవనం నిర్మించాలన్నారు. కర్నూలు నగరంలోని ఎంఎస్-9లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి బోర్డును పునఃప్రారంభించి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. గాలేరునగరి, హంద్రీనీవా సుజలస్రవంతి, గురురాఘవేంద్ర కాలువ పనులను తక్షణమే పూర్తిచేయాలన్నారు. సీమలో కరవును పారద్రోలేందుకు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. గత బడ్జెట్‌లో రాయలసీమకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ప్రత్యేక నిధులు కేటాయించి రైతుల ఆత్మహత్యలను, నిరుద్యోగుల వలసలను ఆపాలన్నారు. ఈ మూడున్నర ఏళ్ళలో రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని నిధులు ఖర్చుచేసిందీ, రాయలసీమకు ఎంత ఖర్చుచేసిందీ శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం రాయలసీమను ఎనిమిది జిల్లాలుగా ఏర్పాటుచేయాల న్నారు. 2018-19 రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌లో రాయలసీమ అభివృద్ధికి రూ.20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీమ సాగునీటి ప్రాజెక్టులలో రూ.వేల కోట్ల అవినీతి జరిగినందున రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని నిరుద్యోగులకు ఆశచూపి గద్దెనెక్కిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. రాయలసీమలో మూతపడిన పరిశ్రమలన్నింటినీ తెరిపించి నిరుద్యోగ వలసలను ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కపిలేశ్వరయ్య, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు శాంతారెడ్డి, రాష్ట్ర నాయకులు కందుల రాజమోహన్‌రెడ్డి, మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు హేమలత, బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వు.. అరగుండుతో నిరసన

నాలుగో రోజుకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - విజయవాడ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె శుక్రవారం నాల్గవ రోజుకు చేరింది. తమ డిమాండ్ల సాధన కోసం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని కూర్చున్నారు. కాంట్రాక్టు కార్మికులు జి.విజయచందర్, డి.రామారావు గుండు, అరగుండు గీయించుకుని నిరసన తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం తమ శ్రమ ద్వారా ఉత్పత్తిని సృష్టిస్తున్న కార్మికులు ప్రభుత్వాన్ని శాసించాలన్నారు. ప్రభుత్వాలు ఎప్పటికీ కార్మికులను నడపలేవని స్పష్టం చేశారు. ఎర్రచందనం, ఇసుక దందాల్లో కార్మికులు వాటాలు అడగడం లేదని, కేవలం చేసిన పనికి న్యాయబద్ధంగా వేతనాలు చెల్లించాలని కోరుతున్నా ప్రభుత్వం మీనమేషా లు లెక్కించడం, విధుల్లోకి



రాకపోతే తొలగిస్తామని బెదిరించడం సిగ్గుచేటన్నారు. సమ్మెలో పాల్గొనే కార్మికుల స్థానంలో కొత్తవారిని తీసుకుంటామని హెచ్చరించడం సరికాదన్నారు. ఎవరినైనా తీసుకుంటే ప్రత్య క్షంగా అడ్డుకుని తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించా రు. రాష్ట్రంలోని 26 వేల మంది కాంట్రాక్టు విద్యుత్ కార్మికులు ఒంటరివారు కాదని, వారికి ఎర్రజెండా, ఏఐటీయూసీ, సీఐటీయూ అండగా ఉన్నాయని తెలిపారు. అవసరమైతే ఇతర కార్మిక సంఘా లను కూడా ఈ పోరాటంలోకి తీసుకువచ్చి ప్రభుత్వం దిగివచ్చేలా చేస్తామని ప్రకటించారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక జనరల్ సెక్రటరీ ఎం.బాలకాశి, వైస్ చైర్మన్ వి.గంగయ్య, కోశాధికారి సి.శేఖర్, కన్వీనర్ ఎస్‌వీ రమణమూర్తి, కో-కన్వీనర్ బీవీ సురేష్ పాల్గొన్నారు.

ఆర్డీఓతో పోర్టు వ్యతిరేక కమిటీ భేటీ

- పోర్టు నిర్వాసితులకు ప్యాకేజీలపై సుదీర్ఘ చర్చలు
- ఆర్డీవో వివరణతో మత్స్యకారులు సంతృప్తి

విశాలాంధ్ర - టెక్కలి : శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామం వద్ద నిర్మించనున్న పోర్టు నిర్మాణంపై నెలకొన్న సందేహాల నివృత్తి కోసం పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు శుక్రవారం టెక్కలి ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావుతో భేటీ అయ్యారు. భావనపాడు, రెడ్డికపేట, మజ్జిపేట, కొత్తపేట, గ్రామాలకు చెందిన సుమారు 15 మంది సభ్యుల బృందం ఆర్డీవో కార్యాలయంలో సుమారు రెండున్నర గంటలపాటు వివిధ అంశాలపై చర్చించారు. మత్స్యకారులు అనేక సందేహాలను ఆయన వద్ద ప్రస్తావించారు. ప్రశాంత వాతావరణం మధ్య కొనసాగిన చర్చలతో సంతృప్తి చెందిన కమిటీ సభ్యులు గ్రామాల్లో ఆర్డీవో చెప్పిన విషయాన్ని తెలియజేసి పోర్టు నిర్మాణానికి ఆమోదం తెలుపుతామన్నారు. ఆర్డీవోను కలిసిన కమిటీ బృందం అంతకుముందు రణస్థలం మండలం పైడిభీమవరం వద్ద నిర్మాణం తలపెట్టనున్న అణువిద్యుత్ కేంద్రం ప్రాంతాన్ని, హిరమండలంలోని వంశధార నిర్వాసితుల ప్రాంతాలను పరిశీలించారు.

ప్యాకేజీ ఇది : పోర్టు నిర్మాణానికి సంబంధించి జీవో వెలువడిన నేపథ్యంలో నష్టపరిహారం వివరాలను ఆర్డీవో బృందానికి వివరించారు. ఒక్కో కుటుంబానికి రవాణా ఖర్చుల కింద రూ.50 వేలు, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.36 వేలు వృత్తి ప్యాకేజీ, గృహ నిర్మాణానికి రూ.3.50లక్షలు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు రూ.50 వేలు, పశువులశాలకు రూ.25 వేలు, వృత్తిదారులకు రూ.25వేలు చొప్పున మొత్తం కలిపి రూ.10 లక్షల నుంచి రూ.11లక్షల వరకూ పరిహారం ఉంటుందన్నారు. వీటితోపాటు 5 సెంట్ల స్థలం, ఇంటి స్థలం వద్దనుకుంటే రూ.1.40 లక్షల చొప్పున పరిహారం కింద ఇస్తామని చెప్పారు. జిరాయితీ భూములకు పరిహారం ఇవ్వాలని మత్స్యకారులు కోరడంపై ఆర్డీవో స్పందిస్తూ కొవ్వాడ, మత్స్యలేశం వద్ద భూముల విలువకు, ఇక్కడి భూముల



విలువకు వ్యత్యాసం ఉన్నందున ఆ ప్యాకేజీ ఇక్కడ వర్తించదన్నారు. పోర్టు నిర్మాణానికి అంగీకారం తెలియజేస్తే త్వరితగతిన గ్రామాలు ఖాళీ చేయాలని, ఏడాదిలోపు గృహనిర్మాణాలు, ప్యాకేజీలు, నష్టపరిహారాలు అందిన తరువాతే గ్రామాలు ఖాళీ చేయాలన్నారు. ఆర్డీవోను కలిసినవారిలో మత్స్యకార సంఘం నాయకులు అల్లుపల్లి పోతయ్య, భీమారావు, దానేష్ తదితరులున్నారు.

భారత ఆర్థిక వ్యవస్థను ముంచింది మోడీనే

- ప్రజాధనాన్ని కాపాడాలని ఎస్బీఐ ఎదుట సీపీఐ నిరసన
- నీరవ్ మోదీ చిత్రపటానికి చెప్పుల దండలు

సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి డి.జగదీష్



విశాలాంధ్ర - అనంతపురము అర్బన్ : జాతీయ బ్యాంకుల్లో వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోడీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం కొమ్ముకాస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తోందని సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి డి.జగదీష్ విమర్శించారు. బ్యాంకులను మోసం చేసి విదేశాల్లో దర్జాగా తిరుగుతున్న లలిత్ మోదీ, విజయ్‌మాల్యా, నీరవ్ మోదీ, కఠారిలను తక్షణమే అరెస్టు చేసి ప్రజాధనాన్ని కాపాడాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సాయినగర్‌లో స్టేట్‌బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఎదుట ఆ పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు. నీరవ్ మోదీ ఫ్లెక్సీకి సీపీఐ నేతలు చెప్పులదండ వేసి పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జగదీష్ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోడీ భారత దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా ఛిన్నాభిన్నం చేశారన్నారు. దేశంలోని వివిధ బ్యాంకుల్లో రూ. 13 లక్షల కోట్ల మొండి బకాయిలు ఉన్నాయని, వీటిలో కేంద్రంలో మోడీ ప్రధాని అయిన తరువాత రూ. 4.50 లక్షల కోట్లను మొండి బకాయిలకింద కార్పొరేట్‌శక్తులకు రద్దు చేశారన్నారు. దేశంలోని రైతుల అప్పులన్నీ మాఫీ చేసినా రూ. 4 లక్షల కోట్లు కాదన్నారు. దేశంలో ఆర్థిక మాంద్యం వచ్చినప్పుడు జాతీయ బ్యాంకులే కాపాడాయని, అలాంటి బ్యాంకులను నేడు బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాల్లో తిరుగుతున్న కార్పొరేట్‌వ్యక్తులను అంతర్జాతీయ కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.జాఫర్, పి.నారాయణస్వామి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.విశ్వనాథ్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, టి.నారాయణస్వామి, సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు, సహాయ కార్యదర్శులు అల్లీపీరా, రమణ, బి.వరలక్ష్మి, జయలక్ష్మి, పాల్గొన్నారు.

2025 నాటికి 64 శాతం సంప్రదాయేతర విద్యుత్



విశాలాంధ్ర - మధురవాడ : విశ్వవ్యాప్తంగా అగ్రరాజ్యాలతోపాటు భారత్ వంటి దేశాల్లోనూ 2025 సంవత్సరంనాటికి 64 శాతం విద్యుత్ అవసరాలకు సంప్రదాయేతర శక్తి వనరులైన పవన, సౌర విద్యుత్ ఉత్పాదనవైపు మళ్ళుతున్నాయని, ఈ విద్యుత్‌ను ఎలా నిల్వ చేసుకోవాలనే దానిపై పరిశోధనలు జరుగుతున్నట్లు అల్‌స్టర్ విశ్వవిద్యాలయం (యూకే) ప్రొఫెసర్ నీల్ జె.హెవిట్ వెల్లడించారు. విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, బ్రిటీష్ కౌన్సిల్ సంయుక్తంగా శుక్రవారం వర్సిటీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూకేలోని వివిధ దేశాలలో 2050 సంవత్సరం నాటికి కర్బన్ ఉద్గారం లేని విధంగా నూరుశాతం సంప్రదాయేతర ఇంధన వనరులు ఉపయోగించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలను క్రమంగా తగ్గిస్తూ కాలుష్య నివారణకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. 2030 సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా 5 మిలియన్ల విద్యుత్తు వాహనాలు రహదారులపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. వీటికి అవసరమైన విద్యుత్‌ను అందించడంపై అమెరికాలో పెద్దఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు అధ్యక్షత వహించిన సదస్సులో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎమ్ఆర్ఎస్ సత్యనారాయణ, గీతం అంతర్జాతీయ విద్యార్థి విభాగం డైరెక్టర్ కె.పి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సీమకు చేసిందేమిటి?



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏం చేసిందో చెప్పాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. రాయలసీమ సహా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలతో కలిపి మొత్తం ఏడు జిల్లాల్లో వెనుకబాటుతనాన్ని పారద్రోలేందుకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని ప్రక టించిన కేంద్రం ఒక్కో జిల్లాకు రూ. 50 కోట్లు ముష్టి వేసింద న్నారు. ఈ మొత్తంతో ఆయా జిల్లాల్లో వెనుకబాటుతనం, కరవు పరిస్థితులను పోగొట్టారా? అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్య మం తీవ్రమవుతుంటే డిక్లరేషన్ పేరుతో కర్నూలులో బీజేపీ నేతలు హడావుడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. విజయ వాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్‌తోపాటు వివిధ సంఘాల నేతలతో కలసి ఏప్రిల్ 20వ తేదీన రాజమండ్రిలో నిర్వహించే ప్రత్యేక హోదా ఆత్మగౌరవ పోరాట సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగేళ్లుగా సంయమనం పాటిస్తున్నట్లు నటించిన బీజేపీ నేతలు 2018-19 బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఏమైందో తెలియదు కానీ.. శివాలెత్తి పోతున్నారని ఘాటుగా విమర్శించారు. ఆయా చర్చావేదికల్లో ప్రత్యేక తరగతి హోదాతోపాటు విభజన చట్టంలోని హామీల అమ లు, నిధులపై ఎవరైనా ప్రశ్నిస్తే చాలు భౌతిక దాడులకు పాల్పడు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏం చేసింది.. కేంద్రంలో అధికారంలో ఉన్న తామేమి సాధించారో చెప్పాలే కానీ దాడులు చేయడం సరైన వైఖరి కాదన్నారు. ఇప్పటి కైనా ఎత్తుగడలకు స్వస్తి పలికి చిత్తశు ద్ధితో పనిచేయాలని ఆయన బీజేపీ శ్రేణులను కోరారు. అలాగే కేంద్రంలో అధికారంలోఉన్న బీజేపీ ఇప్పటి వరకూ రాష్ట్రానికి ఏం చేసిందనే విషయమై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని రామకృష్ణ డిమాండు చేశారు. అన్ని విధాలుగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే వరకూ ఉద్యమాలను కొనసాగిస్తామని ఆయన పునరుద్ఘాటిం చారు.

ఇటీవల విజయవాడలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమా వేశంలో నిర్ణయించిన విధంగా రాబోయే రోజుల్లో సభలు, సమా వేశాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఢిల్లీలో మార్చి 5వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అన్ని పార్టీలతో కలసి 6వ తేదీ నుంచి నిర్వహించే ఆందోళన ద్వారా ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళతా మన్నారు. అకాలీదళ్, టీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీపార్టీలు ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయన్నారు. మార్చి 1వ తేదీన గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు వివిధ రాజకీయ పార్టీలతోపాటు కార్మిక, ఉద్యోగ, విద్యార్థి, యువ జన, ప్రజాసంఘాలను ఆహ్వానించామన్నారు. మొదట్నుంచీ హోదాపై రకరకాలుగా మాట్లాడుతున్న చంద్రబాబు కూడా చివ రకు ప్రజాగ్రహాన్ని చూసి ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి తీరా ల్సిందేనని స్వరం పెంచారని అన్నారు. కేంద్రం దిగివచ్చే వరకూ పోరాటం ఆగదని రామకృష్ణ స్పష్టం చేశారు. సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో 119 జిల్లాల అభివృద్ధికి సంబంధించి ఇచ్చే నిధులనే రాష్ట్రంలోని వెనుకబడిన రాయల సీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇచ్చారే తప్ప ప్రత్యేకంగా ఏమీ ఇవ్వ లేదన్నారు. ప్రాంత, కుల, మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టే యత్నాలను బీజేపీ నేతలు మానుకోవాలని ఆయన సూచించారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని గుజరాత్‌లో తాకట్టు పెట్టొద్దని హితవు పలికారు. ఏపీ విషయమై బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న ఒకరు వెంట్రుకతో పోల్చడాన్ని తీవ్రంగా పరిగణించారు. పార్టీ జెండాలను పక్కనపెట్టి రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా కోసం ఒకే తాటిపైకి వచ్చి ఏకోన్ముఖంగా ముందుకు వెళదామని ఆయన సూచించారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మస్తాన్‌వలి మాట్లాడుతూ బీజేపీ ఏపీపై కక్షగట్టి ఉద్దేశపూర్వ కంగానే భవిష్యత్ లేకుండా చేస్తోందని విమర్శించారు. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక తరగతి హోదా రావాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా, ఆత్మ గౌరవ పోరాట కమిటీ చైర్మన్ పి సురేందర్‌రెడ్డి, కన్వీనర్ అవధా నులహరి, ఏపీజేఎఫ్ అధ్యక్షుడు కృష్ణాంజనేయులు, ఆప్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి సేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి మళ్లీ ఈ రిక్షా...



విశాలాంధ్ర-అమరావతి : కాలుష్యరహిత రాష్ట్రంగా నవ్యాంధ్ర ప్రదేశ్‌ని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎనలేని క ృషి చేస్తోంది. అందులో భాగంగానే కాలుష్య కారకాలైన వాహనాలపై ప్రత్యేక ద ృష్టి సారించింది. ఎప్పటి నుంచో రాష్ట్రంలో అమలుపరచాలనుకుంటున్న ఈ రిక్షాని రాష్ట్ర రహదారులపై తిప్పేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్ప టికే ఈరిక్షా అంశం ప్రభుత్వం చుట్టూ చక్కర్లు కొడుతోంది. కేంద్రం సైతం అనుకులంగా స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం కలిసొచ్చే అంశం కావటంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయా లని నిర్ణయించినట్టు సమాచారం. అయితే ఏప్పటి నుంచో అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్న ఈ రిక్షా ఎప్పుడు రోడ్డు ఎక్కు తుందో అనేది ప్రశ్నార్థకంగా మారింది. దేశవ్యాప్తంగా వాహన కాలుష్యం అధికమవటం, అనారోగ్యాలు ప్రబలటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఈ క్రమంలో కాలుష్య నివారణకు అటు కేంద్రం ఇటు రాష్ట్రం ప్రణాళికలు రచించి కాలుష్యం లేని వాహన శ్రేణికి అనుమతులు ఇవ్వాలని నిర్ణయించాయి. దీనితో వాతావరణ కాలుష్యానికి ఆస్కారం లేని "ఈ రిక్షా"కి అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం గత కొంత కాలంగా నిర్ణయించింది. అందులో భాగంగానే దేశవ్యాప్తంగా ఈ రీక్షాలు వినియోగంలోకి తీసుకురావాలని సూచనలు ఇచ్చింది. అన్నీ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం మార్గదర్శకాలతో కూడిన అదేశాలు పంపించింది. కేంద్ర అదేశాలని అందుకున్న రవాణా శాఖ గతేదాది ఈరిక్షాకి సంబంధించిన అంశాలపై కసరత్తు ప్రారంభించింది. పర్యావరణ హితమైన ఈరిక్షా వినియోగంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని రవాణాశాఖలోని కీలక అధికా రులకు పురమాయించారు. ఇదే క్రమంలో ఇతర దేశాలలో ఈరిక్షా అమలు జరుగుతున్న తీరుతెన్నులు సమీక్షించారు. భారత దేశంలో సైతం అనేక రాష్ట్రాలలో ఈరిక్షా పై విషయాల్ని క్షుణంగా పరిశీలించారు. ప్రధానంగా మన రహదారులు ఈరిక్షాల వినియోగానికి అనుకూలంగా ఉన్నాయా లేదా అనే అంశం పై చర్చించారు. చాలావరకు సానుకూల వాతావరణం కనిపించడంతో రాష్ట్ర రవాణాశాఖ ఈరిక్షాల నిర్వహణ సముచిత నిర్ణయంగా భావించి పలు మార్గదర్శకాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది.

కొనసాగుతున్న సందిగ్ధం : ఈరిక్షాల నిర్వహణ అంశం గతేడాది మార్చి నెల నుంచి రవాణా శాఖలో ఇంధనం అయిపోయిన వాహనం మాదిరిగా చక్కర్లు కొడుతోంది. ఎప్పుడో రోడ్డెక్కాల్సిన ఈరిక్షా నేటికి సర్కార్ ఫైల్ మధ్య చిక్కుకు పోయింది. కాలు ష్యరహిత వాహనంగా పేరుగాంచిన ఈరిక్షా అది నుంచి అవాంతరాలు ఎదుర్కొంటూనే ఉంది. అయితే ముందుగా కొద్ది పాటి దూరాలకు ఈరిక్షాలని పరిమితం చేసి తరువాత ఎక్కువ దూరాలకు తిరిగే విషయంపై ఆలోచించాలని భావించింది. ఈ రిక్షా అంశానికి చెందిన ఫైల్‌ని ఏనాడో వేగంగా సిద్ధం చేశారు గాని అనుమతుల విషయంలో మీనమేషాలు లెక్కలేయటం పరి పాటిగా మారింది. ఇందుకు సంబంధించిన దస్త్రం అటు సచివాలయానికి, ఇటు రవాణా శాఖ కమిషనర్ కార్యాలయానికి మధ్య తిరుగుతూ ప్రయాణం సాగించింది. అయితే ఈ క్రమంలో రవాణా శాఖకు చాలా సందేహాలు వచ్చాయి. అసలు ఈ రిక్షా లను ప్రోత్సహించే క్రమంలో ఏ విధంగా పన్నులు విధించాలి, ట్రాఫిక్ విషయంలో ఏ విధంగా వీరిని క్రమబద్ధీకరించాలి అనేది ప్రధాన సమస్యగా మారింది. ఈ వాహనాలు గంటకి 25 కిలో మీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించగలవు కాబట్టి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతాయనే సందేహం రవాణాశాఖ వ్యక్తం చేసింది. ఐదు ఏళ్లకి పన్ను మినహాయింపు ఇవ్వాలా, లేక జీవిత కాలం పన్నుని అమలు చేయాలా అనేది సందిగ్ధంగా మారింది. తొలి ఐదేళ్లు పన్ను మినహాయింపు ఇచ్చి ఆ తర్వాత కాలం నుంచి పన్ను వసూలు చేయాలని పలువురు అధికారులు ప్రతిపాదించారు. ఈ విషయంపై స్పష్టత రాకపోవటంతో నేటికి ఈరిక్షా రొడెక్కలేదు. ఎంతో ఆశగా ఎదురు చూసిన పలువురు వాహనదారులకు నిరాశే ఎదురైది.

ఈ రిక్షా ప్రయాణం సాగుతుందిలా... : పూర్తిగా కాలుష్యరహిత వాహనం ఈ రిక్షా. ఇప్పటికే దేశ విదేశాలలో ఈ రిక్షా అధిక స్థాయిలో వినియోగంలో ఉంది. ప్రధానంగా స్విట్జర్లాండ్, చైనా, థాయిలాండ్ ఇలా ఎన్నో దేశాల్లో కాలుష్యరహితంగా పేరు గాంచిన ఈ రిక్షాని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. బ్యాటరీతో నడిచే వాహనం ఈరిక్షా పరిమిత వేగంతో నలుగురు ప్రయాణికులు మాత్రమే ప్రయా ణించగల వాహనం.ప్రముఖ కంపెనీలు సైతం లక్ష నుంచి లక్షా యాభైవేలకే ఈ రిక్షాను అందిస్తున్నాయి. ఖర్చు తక్కువ, కాలు ష్యం ఉండదు. ఉపాధికి మెరుగైన అవకాశం ఉన్న వాహనం. సాధారణ ఆటోతో పోల్చుకుంటే అటు రిక్షా నిర్వహకుడుకి, ప్రయాణికుడికి అనుకూలంగా ఉండే వాహ నంగా చెప్పవచ్చు. చార్జీల విషయంలోనూ తక్కువ చెల్లించి ఎక్కువ దూరం ప్రయాణించ వచ్చు. మితిమీరి ప్రయాణికులని ఎక్కించే అవకాశం అసలుండదు. వేగం నియంత్రణతో ఈ రిక్షా తయారు చేస్తారు. సురక్షవంతమైన ప్రయాణానికి ఇది అత్యంత అనువైన వాహనం.కాకపోతే పట్టణ ప్రాంతాల్లో తిరగాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయం రవాణా శాఖ అధికారులులో వ్యక్తమవుతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యవంతం

పల్లెటూర్లలో .గ్రామీణ ప్రాంతాల్లో ఈ రిక్షా అత్యంత సౌకర్యవంతంగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించి రుణ సౌకర్యంతో పాటు కాలుష్య నివారణకు క ృషి చేసినట్లు అవుతుందని రవాణా శాఖ లోని ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే మహిళలకు కూడా ఉపాధి పొందడంలో ఈ రిక్షా ఎంతో అనుకూలంగా ఉంటుంది.అలహాబాద్‌లో తబస్సుమ్ బానో అనే మహిళ ఈ రిక్షా డ్రైవ్ చేసి కుటుంబ పోషణలో భాగస్వామిగా నిలిచిన తొలి మహిళగా పేరు సంపాదించింది.20 నుంచి 30 కిలోమీటర్ల వరకు అవలీలగా ఈ వాహనంలో ప్రయాణించవచ్చు.

వామపక్ష రాష్ట్రమైన త్రిపురలో ముందంజ : కాలుష్య నివారణతో పాటు నిరుద్యోగులకు ఉపాధి చూపటంలో త్రిపుర రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉంది.వామపక్ష పాలనలో ఉన్న త్రిపుర అతి తక్కువ వ్యయంతో ఈ రిక్షా నిర్వహణకి చేయుతనిస్తున్నది.దేశంలోనే తొలిసారిగా త్రిపురలో ఈ రిక్షా ప్రజలకి అందుబాటులోకి వచ్చింది.ఈ రిక్షా వాహనం నడిపేందుకు లైసెన్స్ రుసుము 300, రిజిస్ట్రేషన్ చార్జీ వెయ్యి రూపాయలు, కాగా సంవత్సరానికి కట్టే రోడ్ టాక్స్ వంద రూపాయలుగా నిర్ణయించి ఆశావాహులైన అర్హులకు త్రిపుర సర్కార్ ఈ రిక్షాలను అందచేసింది. నిరుద్యోగం రూపుమాపటంలో ఈ రిక్షా ఎంతగానో ఉపకరిస్తుందని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వ్యాఖ్యానించడం విశేషం. ఎకో ఫ్రెండ్లీ వాహనంగా పిలుచుకుంటూ త్రిపుర వాసులు ఈ రిక్షాకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు.

నవ్యాంధ్రలోను అవగాహన కలిపిస్తే : రాష్ట్రంలోనూ రవాణాశాఖ ప్రజలకి అవగాహన కల్పించి ఈ రిక్షాలు అందుబాటులోకి తీసుకొస్తే ఆరంభంలోనే కాలుష్య నియంత్రణకి చర్యలు తీసుకోవడం సులభతరమవుతుంది. ముందుగా రాజధాని ప్రాంతంలో ఈ రిక్షాకి సర్కార్ చేయూత అందించి రుణ సౌకర్యంతో వాహనాలు నడిపే ప్రయత్నం వేగవంతం చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో, కాలుష్యం పెరిగిపోయి ప్రజలు ఆస్తమా వంటి అనారోగ్యంతో అల్లాడి పోతున్నారు.అటువంటి దారుణ పరిస్థితులు మనకి రాకుండా ఉండాలంటే ఇటువంటి వాహనాలు వినియోగించడం మంచిది.

కార్పొరేషనల ద్వారా రుణం అందించాలని : ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో రుణాలు ఇస్తూ ఇన్నోవా కార్లు అందిస్తున్నారో అదే మాదిరిగా అర్హులైన వారికి ప్రధానంగా ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చి సబ్సిడీతో కూడిన రుణం మంజూరు చేయాలని సర్కార్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు

ప్రకాశం జిల్లా భూసేకరణ ప్రకటన

ఫారం నెం. - VII

R.C. No. B/106/2017 — ది. 23-02-2018

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్‌రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజా హిత ఉపయోగార్ధం అనగా గుండ్ల బ్రహ్మేశ్వరము రిజర్వాయరు **మునక నిమిత్తము** కావలయునని శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలువారు భావించినందున, 2013 సంవత్సరము 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత స్పెషల్‌కలెక్టరు (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువషెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

శ్రీయుత స్పెషల్ డిప్యూటి కలెక్టరు, యల్.ఎ. ఆర్.ఆర్. యూనిట్ కంభం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించిన ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజాప్రయోజనమునకై అనగా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు గుండ్ల బ్రహ్మేశ్వరము రిజర్వాయరు మునక నిమిత్తము కావలయునని ఇందు మూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : **ప్రకాశం** — మండలం : **రాచర్ల** — గ్రామము నెం : **చినగానిపల్లి**

క్రమ సంఖ్య	స.నెం./ స. డి.నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూస్థితి	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	సంబంధిత ఆసామి పేరు (పట్టాదారు) మరియు చిరునామా	సంబంధిత ఆసామి పేరు (అనుభవదారు) మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1.	187/1బి	12.14	అసైన్ మెంట్	3.89	పోతుగంటి బాషా తండ్రి మాబు	పోతుగంటి బాషా తండ్రి మాబు	186	188	186	187/1ఎ	వేప(పెద్దవి)1 వేప(చిన్నవి)2 తాటి-20
2.	191/1	4.57	అసైన్ మెంట్	4.57	జనావత్ సుబ్బమ్మ భర్త సుబ్బులునాయక్	జనావత్ సుబ్బమ్మ భర్త సుబ్బులునాయక్	182	193 187	191/2	192	
3.	191/2	2.73	అసైన్ మెంట్	2.73	తలపాటి స్వామిరంగయ్య తండ్రి నెమలిగుండం	తలపాటి స్వామి రంగయ్య తండ్రి నెమలిగుండం	185	187	186	191/1	బోర్లు-2 తాటి-70 వేప(పెద్దవి)2 వేప(చిన్నవి)2
4.	192/3	1.69	అసైన్ మెంట్	1.69	కనుమర్లపూడి పద్మావతి భర్త సుబ్రమణ్యం	కనుమర్లపూడి పద్మావతి భర్త సుబ్రమణ్యం	191	192/2	191	192/1	
5.	661/2	2.12	అసైన్ మెంట్	2.12	దూదేకుల అచ్చమ్మ భర్త మీరా	దూదేకుల అచ్చమ్మ భర్త మీరా	661/1	661/3	662	186	
6.	709/1	1.14	అసైన్ మెంట్	1.14	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	186	709/2	709/4	710	
7.	709/2	1.31	అసైన్ మెంట్	1.31	బత్తిన లీలమ్మ భర్త క్రిష్ణయ్య	బత్తిన లీలమ్మ భర్త క్రిష్ణయ్య	709/1	711	711	710	వేప-1
8.	709/4	0.79	అసైన్ మెంట్	0.79	బత్తిన లీలమ్మ భర్త క్రిష్ణయ్య	బత్తిన లీలమ్మ భర్త క్రిష్ణయ్య	186	709/3	709/5	709/1	
9.	709/5	0.79	అసైన్ మెంట్	0.79	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	186	709/3	709/6	709/4	
10.	709/6	0.57	అసైన్ మెంట్	0.57	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	186	709/8	709/7	709/5	
11.	709/7	0.89	అసైన్ మెంట్	0.89	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	తురిమెళ్ళ రంగమ్మ భర్త చిన్న పుల్లయ్య	186	709/8	186	709/6	
12.	709/9	2.32	అసైన్ మెంట్	2.32	తురిమెళ్ళ చెన్నమ్మ భర్త రంగయ్య	తురిమెళ్ళ చెన్నమ్మ భర్త రంగయ్య	709/8	711	186	709/5	
13.	710	1.39	అసైన్ మెంట్	1.39	తురిమెళ్ళ తిరుమలమ్మ భర్త రామయ్య	తురిమెళ్ళ తిరుమలమ్మ భర్త రామయ్య	186	711	709 711	186	
14.	711/1	0.77	అసైన్ మెంట్	0.77	తురిమళ్ళ గాలెయ్య తండ్రి పోలయ్య	తురిమళ్ళ గాలెయ్య తండ్రి పోలయ్య	709	711/2	186	709	
15.	711/2	0.66	అసైన్ మెంట్	0.66	తురిమెళ్ళ బాలమ్మ భర్త రామయ్య	తురిమెళ్ళ బాలమ్మ భర్త రామయ్య	711/1	711/8	186	711/3 709	
16.	711/3	1.46	అసైన్ మెంట్	1.46	బత్తిన తిరుపతమ్మ భర్త పుల్లయ్య	బత్తిన తిరుపతమ్మ భర్త పుల్లయ్య	709	711/5	711/4	710	నేరెడు-1
17.	711/4	1.16	అసైన్ మెంట్	1.16	బత్తిన కాశమ్మ భర్త స్వామి రంగయ్య	బత్తిన కాశమ్మ భర్త స్వామి రంగయ్య	709/3	711/8 711/7	711/7	711/3 711/5 711/6	
18.	711/5	0.69	అసైన్ మెంట్	0.69	పగిడి పాండురంగమ్మ భర్త కాశిరావు	పగిడి పాండురంగమ్మ భర్త కాశిరావు	711/3	711/6	711/4	710	
19.	711/6	0.69	అసైన్ మెంట్	0.69	కానాల అంకమ్మ భర్త వెంకటయ్య	కానాల అంకమ్మ భర్త వెంకటయ్య	711/5	711/7	711/4	710	
20.	711/8	1.33	అసైన్ మెంట్	1.33	అవిదేవి రంగలక్ష్మి భర్త శ్రీరాములు	అవిదేవి రంగలక్ష్మి భర్త శ్రీరాములు	711/2	711/7 711/9 711/10	1.86	711/4	
21.	711/9	0.90	అసైన్ మెంట్	0.90	బత్తిన చిన్నక్క భర్త నారాయణ	బత్తిన చిన్నక్క భర్త నారాయణ	711/2	711/9	186	711/4	వేప-1
22.	711/10	1.21	అసైన్ మెంట్	1.21	యేలం చిన్నక్క భర్త రంగయ్య	యేలం చిన్నక్క భర్త రంగయ్య	711/8	712	186	711/9	
23.	712	6.92	అసైన్ మెంట్	0.22 0.20 0.54 0.35 1.24 2.27 0.76	కట్ట రాజమ్మ భర్త పెద్ద రామయ్య కట్ట వెంకటమ్మ భర్త వెంకటయ్య కట్ట ఆదిలక్ష్మమ్మ భర్త చిన్న రామయ్య కట్ట వెంకటమ్మ భర్త చిన లింగయ్య పగిడి పెద్ద వీరయ్య తండ్రి కాశయ్య మహంకాళి వెంకటమ్మ భర్త వెంకటస్వామి మిరప్పల్లె గాలెమ్మ భర్త రంగయ్య	కట్ట రాజమ్మ భర్త పెద్ద రామయ్య కట్ట వెంకటమ్మ భర్త వెంకటయ్య కట్ట ఆదిలక్ష్మమ్మ భర్త చిన్న రామయ్య కట్ట వెంకటమ్మ భర్త చిన లింగయ్య పగిడి పెద్ద వీరయ్య తండ్రి కాశయ్య మహంకాళి వెంకటమ్మ భర్త వెంకటస్వామి మిరప్పల్లె గాలెమ్మ భర్త రంగయ్య	710 711	713	186	186	
24.	713/1	0.42	అసైన్ మెంట్	0.42	కట్ట రాజమ్మ భర్త పెద్ద రామయ్య	కట్ట రాజమ్మ భర్త పెద్ద రామయ్య	712	186	713/2	186	
25.	713/2	0.32	అసైన్ మెంట్	0.32	కట్ట వెంకటమ్మ భర్త వెంకటయ్య	కట్ట వెంకటమ్మ భర్త వెంకటయ్య	712	186	713/3	713/1	
26.	713/3	0.22	అసైన్ మెంట్	0.22	కట్ట ఆదిలక్ష్మమ్మ భర్త చిన్న రామయ్య	కట్ట ఆదిలక్ష్మమ్మ భర్త చిన్న రామయ్య	712	186	713/4	713/2	
27.	713/4	0.27	అసైన్ మెంట్	0.27	కట్ట వెంకటమ్మ భర్త చిన లింగయ్య	కట్ట వెంకటమ్మ భర్త చిన లింగయ్య	712	714	713/5	713/3	
28.	713/5	0.74	అసైన్ మెంట్	0.74	కట్ట రాజమ్మ భర్త పెద్ద రామయ్య	కట్ట రాజమ్మ భర్త పెద్ద రామయ్య	712	714	713/6	713/4	
29.	713/6	0.67	అసైన్ మెంట్	0.67	కట్ట వెంకటమ్మ భర్త వెంకటయ్య	కట్ట వెంకటమ్మ భర్త వెంకటయ్య	712	714	713/7	713/5	
30.	713/7	0.69	అసైన్ మెంట్	0.69	కట్ట ఆదిలక్ష్మమ్మ భర్త చిన్న రామయ్య	కట్ట ఆదిలక్ష్మమ్మ భర్త చిన్న రామయ్య	712	714	713/8	713/6	
31.	713/8	1.14	అసైన్ మెంట్	1.14	కట్ట వెంకటమ్మ భర్త చిన్న లింగయ్య	కట్ట వెంకటమ్మ భర్త చిన్న లింగయ్య	712	714	713/9 713/10	713/8	వేప-1
32.	713/9	1.28	అసైన్ మెంట్	1.28	మిరప్పళ్ళ పోలమ్మ భర్త నడిపి రంగయ్య	మిరప్పళ్ళ పోలమ్మ భర్త నడిపి రంగయ్య	712	713/10	186	713/8	
33.	713/10	0.92	అసైన్ మెంట్	0.92	తురిమెళ్ళ రోశమ్మ భర్త రామయ్య	తురిమెళ్ళ పెద్దబాల అచ్చయ్య తండ్రి రామయ్య తురిమెళ్ళ చిన్నబాల అచ్చయ్య తండ్రి రామయ్య తురిమెళ్ళ పిచ్చిరాముడు తండ్రి రామయ్య	713/9	186	186	713/8	
34.	714/1	1.72	అసైన్ మెంట్	1.72	చౌడబోయిన లక్ష్మమ్మ భర్త రంగయ్య	చౌడబోయిన లక్ష్మమ్మ భర్త రంగయ్య	713	714/2	186	186	
	మొత్తము			47.04							

ఈ భూముల ప్లాను శ్రీ స్పెషల్ డిప్యూటి కలెక్టరు యల్.ఎ., ఆర్ & ఆర్ యూనిట్, కంభం వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోనవచ్చును. ఈ భూసేకరణవలన నిర్వాసితులయినవారు ఎవ్వరును లేరు.

సం/- **ఎస్. నాగలక్ష్మి, I.A.S.**

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) (FAC), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు

కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎస్‌కు ఆప్ ఎమ్మెల్యేలకు మధ్య వివాదం చిలికిచిలికి గాలివానలా మారుతోంది. ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై ఆప్ ఎమ్మెల్యేల దాడి కేసు విచారణ నేపథ్యంలో శుక్ర వారం సుమారు 60 నుంచి 70 మంది పోలీసులు సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఇంటి వద్దకు చేరుకు న్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దాడికి సంబంధించిన ఆధారాల కోసం వారు సోదాలు నిర్వ హించారు. 21 సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకు న్నారు. సైబర్ క్రైం, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఢిల్లీ పోలీస్ బృందం కేజ్రీవాల్ ఇంట్లో అణువణువు తనిఖీ చేసింది. పోలీసుల తీరును కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. తన మంత్రిమండలి ఇప్పటికే లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ అపాయింట్మెంట్‌ను కోరినట్టు ట్విట్టర్ ద్వారా తెలిపారు. 'భారీ సంఖ్యలో పోలీసులను నా ఇంటికి పంపారు. రెండు చెంపదెబ్బల నేపథ్యంలో సీఎం నివాసంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. జడ్జి లోయా మృతి కేసును ఇదే తరహా విచారిస్తే బాగుంటుంది. ఈ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాను ఎప్పుడు ప్రశ్నిస్తారు?' అంటూ కేజ్రీవాల్ మండిపడ్డారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ 'అధికారులను ఏమైనా అంటే వారు కలత చెందుతారు. మీ కోసం చేస్తున్న పోరాటాన్ని వీళ్ల (బీజేపీ, ఎల్‌జీ, అధికారులు) అడ్డుకొంటు న్నారు. నా పోరాటం ప్రజల కోసమే..' అని కేజ్రీవాల్ అన్నారు. సోమవారం రాత్రి కేజ్రీవాల్ ఇంటికి వెళ్లిన తనపై ఆప్ ఎమ్మెల్యేలు ఇద్దరు దాడి చేశారని సీఎస్ ఆరోపించడం తెలిసిందే. మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు కాగా ఈ కేసులో ఎమ్మెల్యేలు అమాన్‌తుల్లా ఖాన్, ప్రకాశ్ జార్వాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఏడీసీపీ హరేందర్ సింగ్ మాట్లాడుతూ 'సీఎం ఇంట్లో 21 కెమెరాలను గుర్తించాం. అవి 40 నుంచి 42 సెక్లన్లు స్లోగా ఉన్నాయి. ఫిర్యాదు మేరకు మంగళవారం అర్ధరాత్రి 12-12.30 గంటల మధ్య సీఎస్‌పై దాడి జరిగింది. అయితే, సీఎస్ సోమవారం రాత్రి 11.30 గంటలకు సీఎం ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు ఓ సీసీటీవీ కెమెరాలో రికార్డు అయింది. సీఎం ఇంటి నిర్వహణ ఇంచార్జి, సంబంధిత సిబ్బందికి సమాచారం అందించిన తర్వాతే అక్కడకు వెళ్లినట్లు అదనపు డీసీపీ వెల్లడించారు. ముఖ్యమంత్రిని 40 నిమిషాల పాటు కదలనివ్వలేదన్న వార్తాలను ఆయన తోసిపుచ్చారు. తామసలు సీఎంతో మాట్లాడలేదన్నారు. పోలీసులు తనిఖీ చేసే సమయానికి ఏడు సీసీ కెమెరాలు ఆన్‌లో లేవని, అవి ఎందుకు, ఎప్పుడు నిలిచిపోయాయన్నది ఫోరెన్సిక్ బృందం చెప్పగలదని, సంఘటనా స్థలిని పరిశీలించామని అన్నారు. సీసీటీవీలను పరిశీలించేందుకు దర్యాప్తు అధికారులు ఈనెల 20న చేసిన యత్నం ఫలించకపోవడంతో తాము సీఎం ఇంటికి రాక తప్పలేదని ఏడీసీపీ సింగ్ తెలిపారు.

పోలీస్ దాదాగిరి.. బీజేపీ కుట్ర : ఆప్

సీఎం ఇంట్లో పోలీసులు దాదాగిరికి దిగారంటూ ఆప్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆప్ అధికార ప్రతినిధి దిలీప్ పాండే మాట్లాడుతూ, బీజేపీ ఉద్దేశపూర్వకంగానే కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తోందని చెప్పేందుకు ఇంతకంటె రుజువు ఇంకేం కావాలి' అని ఆయనన్నారు. ఢిల్లీ పోలీసులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా పోయిందని ప్రభుత్వ అధికార ప్రతినిధి అరుణోదయ్ ప్రకాశ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'దాదాపు 70 మంది పోలీసులు సీఎం ఇంటిని ఆక్రమించుకున్నారు. పేదల కోసం అలుపెరగకుండా రేయింబవళ్లు కష్టపడుతున్న సీఎంని ఇంతగా అవమానిస్తారా?' అని ఆయన మండిపడ్డారు. ఢిల్లీ పోలీసులు కేంద్రప్రభుత్వ తొత్తులుగా తయారయ్యారంటూ ఆప్ నేతలు ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలు లేకుండానే వారు దాదాగిరికి దిగుతారా అంటూ ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. ఆప్ నేత అశుతోష్ విలేకరులతో మాట్లాడుతూ, ఇది కేజ్రీవాల్‌ను అవమానిం చేందుకు బీజేపీ చేసిన కుట్ర అని విమర్శించారు. సీఎం నివాసంలో పోలీసు అధికారులు వ్యవహరించిన తీరును వివరిస్తూ రెండున్నర నిమిషాల క్లిపింగ్‌ను విలేకరులకు చూపించారు. గోడపై ఉన్న ఓ చిత్రానికి సంబంధించి గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తున్న ఖాకీల తీరును తీవ్రంగా ఖండించారు.

హాకీ టీమ్ సౌత్ కొరియా టూర్..

రాణీకి పగ్గాలు



న్యూఢిల్లీ: వచ్చేనెల 3 నుంచి జరగనున్న సౌత్ కొరియా హాకీ టూర్‌కు ప్రసిద్ధ హాకీ ప్లేయర్ రాణీ రామ్‌పాల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 20మంది సభ్యులున్న టీంను ఆమె లీడ్ చేస్తుంది. ఆతిథ్య జట్టుతో ఈ టీం సియోల్‌లోని జిన్‌చున్ నేషనల్ అథ్లెటిక్స్ సెంటర్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడుతుందని హాకీ సమాఖ్య శుక్రవారం ప్రకటించింది. డిఫెండర్ సునీత లక్రా ఈ సీజన్‌లో ఓపెనర్‌గాను, వైస్ కెప్టెన్‌గానూ వ్యవహరిస్తుంది. గోల్‌కీపర్ సవితకు ఈ టూర్‌లో విశ్రాంతి నిచ్చారు. ఆమె స్థానంలో రజని ఎతిమర్పు వచ్చే అవకాశం ఉంది. ఇదే మ్యాచ్‌లో ఇండియన్ గోల్‌పోస్ట్ గార్డుగా స్వాతి అరంగేట్రం చేస్తోంది. గతేడాది మోకాలి గాయంతో వైదొలగిన అనుభవజ్ఞురాలు దీపిక మళ్లీ జట్టులో చేరనున్నది. అలాగే సుమన్ దేవి తౌడమ్, దీపాగ్రేస్ ఎక్క, సుషీల్ ఛాను పుక్రాంబం, గుర్జీత్ కౌర్‌లతో జట్టు మరింత బలంగా కనబడుతోంది. అంతేకాకుండా మోనిక, నమితా తోప్పో, నిక్కీ ప్రార్థన, నెహా గోయెల్, ఉదిత, లిలిమా మిన్జ్‌లతో మిడ్‌ఫీల్డ్ సమతూకంగా ఉంది. అలాగే రాణి, వందనా కటారియా, లాల్‌రెమ్‌సియామి, నవ్‌జ్యోత్ కౌర్, నవనీత్‌కౌర్, పూనమ్‌రాణిలు గాయపడ్డ అనంతరం జట్టులోకి వచ్చి చేరారు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఆసియా కప్‌లో భారత్ చైనాను 5-4 తేడాతో ఓడించి చారిత్రత్మక విజయాన్ని సొంతం చేసుకున్న అనంతరం ఆడుతున్న మొదటి మ్యాచ్ ఇదే. 'ఈ సీజన్‌లో చక్కగా రాణించి, గతేడాది మేం సాధించిన విజయాలను కొనసాగించాలని చూస్తున్నాం. దీంతో మిగతా సంవత్సరం అంతా మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుంది. కొరియాలో జరిగే ఈ మ్యాచ్‌లో మాలోని లోపాలు సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. ఈ టోర్నమెంట్ రానున్న గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌కు మరింత ఉపయోగకరంగా ఉంటుంది' అని కోచ్ హరేందర్ సింగ్ తెలిపాడు. యువ క్రీడాకారిణులు, అనుభవజ్ఞులైన ఆటగాళ్ల సమతూకంగా ఎంపిక చేసిన జట్టు గురించి కోచ్ మాట్లాడుతూ 'పూనమ్, దీపికలాంటి సీనియర్లు గాయల నుంచి కోలుకొని జట్టులో చేరడం మరింత బలాన్నిచ్చింది. మాకు మంచి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండటంతో, వారి టోర్నమెంటు ఆడుతూ, జూనియర్లకు కూడా విలువైన సలహాలు ఇస్తారనుకుంటున్నా' అని తెలిపాడు. ప్రస్తుతం ఉన్న టీం మంచి ఫిట్‌నెస్‌తోనూ, స్పీడ్‌తోను ఉండటంపై కోచ్ హరీందర్ ఆనందం వ్యక్తం చేశారు. కొరియాలో మంచి ప్రదర్శన ఇచ్చే అవకాశం ఉందన్నాడు. 'తమ వేగంతో యోయో టెస్టులో ఆడపిల్ల లంతా సత్తా చాటారు. ఫిట్‌నెస్ లెవల్స్ ఎలా ఉన్నాయో చూశాం. ఇటీవల రాంచీలో జరిగిన ఇండియా సీనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్ షిప్‌లో చాలా మంది పాల్గొన్నారు. ఇది మాకు కచ్చితంగా కలిసి వచ్చే అంశం. అంతేకా కుండా నేను కూడా ఆ మ్యాచ్‌ల్లో కొన్నింటిని చూశాను. వారు చక్కటి ప్రదర్శన కనబరిచారు. ఇదే రకమైన ఫామ్‌ను కొరియాలో కూడా కనబరుస్తారని ఆశిస్తున్నా' అని హరేందర్ వివరించాడు.

టీ20 ర్యాంకింగ్స్‌లో తప్పిదం

దుబాయ్: ఇటీవల టీ 20 ర్యాంకింగ్స్ విడుదల చేసే క్రమంలో ముందుగా రాత పూర్వక తప్పిదం జరిగినట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వెల్లడించింది. టీ 20 ర్యాంకింగ్స్‌లో భాగంగా ఐసీసీ అధికారి ప్రతినిధి ఒకరు రాతపూర్వక తప్పిదం చేసినట్లు పేర్కొంది. గతవారం సదరు ఐసీసీ ప్రతినిధి టీ 20 ర్యాంకింగ్స్ గురించి క్రికెట్ డాట్ కామ్ ఏయూకి వివరాలు వెల్లడిస్తూ.. ఇంగ్లండ్, న్యూజిలాండ్‌తో జరిగిన ముక్కోణపు టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా చివరి వరకూ ఒక మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఉంటే ఆ జట్టు కొత్తగా వరల్డ్ నంబర్ వన్‌గా అవతరిస్తుందని ప్రకటించారు. కాగా, ఇక్కడ ఆసీస్ ఒక మ్యాచ్ కూడా ఓడిపోకుండా ట్రోఫీ సాధించినా రెండో స్థానానికే పరిమితమైంది. అయితే దీనిపై బుధవారం ఐసీసీ వివరణ ఇస్తూ.. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం పాకిస్థానే టాప్ ర్యాంకులో ఉన్నట్లు తెలిపింది. ఇక్కడ ఆసీస్ 125.65 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, పాకిస్తాన్ 125.84 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నట్లు పేర్కొంది. అయితే ఇక్కడ రెండు జట్లు దాదాపు 126 పాయింట్లు సాధించినప్పటికీ 0.19 తేడాతో పాకిస్థాన్ ప్రథమ స్థానంలో నిలిచిందని ఐసీసీ వెబ్‌సైట్‌లో వివరణ ఇచ్చింది. అదొక రాత పూర్వక తప్పిదంగా పేర్కొంది.

సంస్కరణల అమలుకు సమయాభావం : గంగూలీ



కోల్‌కతా: రాష్ట్ర సంఘాల రాజ్యాంగాల్లో సవరణలు చేయడం, జస్టిస్ ఆర్‌ఎం లోధా కమిటీ సిఫార్సుల అమల్లో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ, సౌరాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు మధుకర్ వోరా బీసీసీఐకి తెలిపారు. పదమూడు సంఘాలు రాజ్యాంగ సవరణ గురించి నిర్ణయం తీసుకున్నాయని, ప్రమాణ పత్రాలు దాఖలు చేశాయని, మరి మీ సంగతేమిటని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి అన్ని రాష్ట్ర సంఘాలకు మెయిల్ పంపించారు. దీనికి గంగూలీ బదులిచ్చారు. 'కొన్ని నెలల క్రితం ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ బీసీసీఐ నిర్ణయంతో ఏకీభవించారు. బీసీసీఐ, రాష్ట్ర స్థాయిలో అమలు చేయడంలో ఉన్న ఇబ్బందుల గురించి గౌరవనీయ సుప్రీం కోర్టులో ప్రమాణ పత్రాలు దాఖలు చేస్తాం' అని దాదా అన్నారు. 'గత సమావేశంలో సభ్యులంతా కలిసి ఒక నిర్ణయం తీసుకున్నారు. మరోసారి ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగితేనే మీరు పంపిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలం. గత వారమే మీ మెయిల్ వచ్చింది. ఇంతలోనే ఎస్‌జీఎంను ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకునేందుకు సమయం కుదరలేదు' అని బీసీసీఐకి గంగూలీ సమాధానం ఇచ్చాడు. సౌరాష్ట్ర సంఘం అధ్యక్షుడు మధుకర్ సైతం ఇదే తరహాలో జవాబిచ్చారు.

ట్విట్టర్ వార్‌కు తెర

ముంబై: ఇటీవల ఏదో జోక్ చేయబోయి టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేతికి చిక్కి, దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ హర్షల్ గిబ్స్ నోరు కరుచుకున్న విషయం తెలిసిందే. కానీ వారం కూడా గడవకముందే వీరి మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడం, పరిస్థితుల్లో ఎంతో మార్పు రావడంతో క్రికెట్ అభిమానులు ఇది నమ్మలేకపోతు న్నారు. శుక్రవారం గిబ్స్ జన్మదినం సందర్భంగా భారత బౌలర్ అశ్విన్ సఫారీ మాజీ ఆటగాడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. 'మరెన్నో పుట్టిన రోజులు జరుపు కోవాలి గిబ్స్. ఈ ఏడాది నీకు కలిసిరావాలంటూ' అశ్విన్ ట్వీట్ చేశాడు. అందుకు ధన్యవాదాలు తెలుపుతూ గిబ్స్ ట్వీట్ ద్వారా బదులిచ్చాడు. మ్యాచ్ ఫిక్సర్‌ను సైతం తమ క్రికెటర్ క్షమించి శుభాకాంక్షలు తెలిపాడని టీమిండియా క్రికెట్ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. గిబ్స్ ఫిక్సర్ అని తెలియక కొందరు అశ్విన్‌కు వ్యతిరేకంగా ట్వీట్లు చేస్తున్నారు.

అశ్విన్ వర్సెస్ గిబ్స్..

తన కొత్త షూ ప్రత్యేకతలు, పరుగెత్తడంలో ఉండే సౌకర్యం గురించి చెబుతూ అశ్విన్ ఒక షూ వీడియో ట్వీట్ చేశాడు. వికెట్ల మధ్య, అవుట్ ఫీల్డ్‌లో అశ్విన్ చురుగ్గా పరుగెత్తలేడనే అంశాన్ని గుర్తు చేసే విధంగా 'ఇకనైనా నువ్వు మరింత వేగంగా పరుగెత్తగలవని ఆశిస్తున్నా' అంటూ ఒకింత వ్యంగ్యంతో గిబ్స్ వ్యాఖ్య వదిలాడు. అయితే దీనిపై వెంటనే స్పందించిన అశ్విన్.. నాకు తిండి పెట్టే మ్యాచ్‌లను ఫిక్స్ చేయకూడదనే నైతిక విలువలు పాటించడంలో మాత్రం చాలా అదృష్టవంతుడిని' అని ఘాటుగా జవాబిచ్చాడు. దాంతో షాక్‌కు గురైన గిబ్స్... జోక్ చేశానని, దీన్ని ఇంతటితో వదిలేయమన్నాడు. తాను కూడా జోక్ చేశానని, నీతో కలసి డిన్నర్ చేస్తానని ట్వీట్ చేశాడు.

గిబ్స్ ఓ ఫిక్సర్

2000 ఏడాది భారత పర్యటనలో భాగంగా మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో గిబ్స్ దోషిగా తేలి దాదాపు ఏడాదిపాటు నిషేధాన్ని ఎదుర్కొన్నాడు.

నువ్వా..? నేనా..??





నేడు దక్షిణాఫ్రికాతో భారత్ చావోరేవో

▶ ఫేవరేట్‌గా భారత్ ▶ సఫారీలకు అచ్చిరాని కేప్‌టౌన్

కేప్‌టౌన్: ఇక చావో రేవో తేల్చుకునే సమయం వచ్చేసింది. శనివారమే భారత్, దక్షిణాఫ్రికాల మధ్య చివరి టీ20 పోరు. సిరీస్ 1-1తో సమం కావడంతో కేప్‌టౌన్‌లో జరుగుతున్న మూడో మ్యాచ్ నిర్ణయాత్మకంగా మారింది. రెండో టీ20లో హెన్రిచ్ క్లాసెన్, జేపీ డుమిని ఆతిథ్య జట్టుకు విజయం అందించి సిరీస్‌ను రసవత్తరంగా మార్చేశారు. తాము ప్రత్యర్థి జట్టు నుంచి ఇలాంటి పోటీనే కోరుకుంటున్నామని కోహ్లి అన్నాడు. ఈ నేపథ్యంలో చివరి పోరులో రెండు జట్లు నువ్వా నేనా అన్నట్టు తలపడే అవకాశాలున్నాయి. మొత్తంగా అభిమానులు పరుగుల పండగ చూడబోతున్నట్టే అనిపిస్తోంది! మ్యాచ్ గెలిస్తే కోహ్లిసేన దక్షిణాఫ్రికా గడ్డపై రెండు సిరీస్ గెలిచిన జట్టుగా చరిత్ర సృష్టించనుంది.

భారమంతా బౌలింగ్‌పైనే..

టీమిండియా బ్యాటింగ్ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవడం లేదు. ఓపెనర్ రోహిత్ శర్మను మినహాయిస్తే టాప్ ఆర్డర్, మిడిలార్డర్ బాగానే ఉంది. ధావన్, కోహ్లి, మనీశ్ పాండే, ధోనీ, రైనా చక్కని ఫామ్ కనబరిచారు. రెండో టీ20లో 170 పరుగులు చేస్తే ఎక్కువే అనుకున్న సమయంలో పాండే, ధోనీ వీరోచితంగా ఆడి 189 పరుగుల లక్ష్యం నిర్దేశించారు. అయితే రెండో టీ20కి ముందు వరకు దుర్భేద్యంగా కనిపించిన యజ్వేంద్ర చాహల్ బౌలింగ్ క్లాసెన్ దెబ్బకు ప్రశ్నార్థకంగా మారింది. రెండు టీ20ల్లో అతడు 1 వికెట్ తీసి 12.87 ఎకానమీతో 103 పరుగులిచ్చాడు. మరోసారి క్లాసెన్ అతడి బౌలింగ్ కోసం ఎదురు చూస్తున్నాడు. చాలా రోజులుగా టీమిండియా పొట్టి క్రికెట్‌లో ఒక లెఫ్టార్మ్ పేసర్‌ను ఆడిస్తోంది. అయితే ఈ సిరీస్‌లో జయదేవ్ ఉనద్కట్ ఆ బాధ్యతను నెరవేర్చడంలో విఫలమయ్యాడు. 9.78 ఎకానమీతో 75 పరుగులిచ్చి 2 వికెట్లు మాత్రమే తీశాడు. గాయం కారణంగా రెండో మ్యాచ్ ఆడని బుమ్రా మూడో టీ20కి ఆడేది అనుమానమే. అతడు ఫిట్‌గా ఉంటే మాత్రం జయదేవ్ జట్టు నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. శార్దూల్ ఠాకూర్ తెలివిగా బౌలింగ్ వేసి సెంచూరియన్‌లో నాలుగు ఓవర్లకు 1/31తో నిలిచాడు. ఇక భువనేశ్వర్ సంగతి చెప్పనక్కర్లేదు. మూడో పేసర్‌గా హార్దిక్ పాండ్యను భావిస్తే అక్షర్ పటేల్‌కు అవకాశం రాకపోవచ్చు.

సఫారీల జోరు...

రెండో టీ20లో విజయంతో దక్షిణాఫ్రికా జట్టు ఆత్మవిశ్వాసంతో ఉంది. జేపీ డుమిని, హెన్రిచ్ క్లాసెన్ దూకుడుగా ఆడుతున్నారు. చాహల్ బౌలింగ్‌లో మిగతా వారు ఇబ్బంది పడ్డా, వీరిద్దరూ చక్కగా ఆడేస్తున్నారు. ఓపెనర్ జేజే స్మట్స్, డేవిడ్ మిల్లర్ ఆశించిన మేరకు రాణించలేదు. మిల్లర్‌కు జట్టు అండగా నిలిచే అవకాశాలున్నాయి. సఫారీ జట్టులో ఏ ఇద్దరు నిలిచినా 230 స్కోరైనా వారి ముందు బలదూరే. అంత విధ్వంసకరంగా ఆడగలరు. అందుకే నిర్ణయాత్మక మూడో టీ20లో టీమిండియా బౌలింగ్ చాలా కీలకంగా ఉండనుంది. ఇక బౌలింగ్ పరంగానూ ఆతిథ్య జట్టు బాగానే ఉంది.

శనివారం రాత్రి 9:30 గంటలకు మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం

అచ్చిరాని కేప్‌టౌన్

నిర్ణయాత్మక మూడో టీ20 జరుగుతున్న కేప్‌టౌన్ పిచ్‌లో భారత్ తొలిసారి పొట్టి క్రికెట్ ఆడుతోంది. మ్యాచ్ జరుగుతున్నా కొద్దీ పిచ్ మందకొడిగా మారే అవకాశాలున్నాయి. ఈ వికెట్ దక్షిణాఫ్రికాకు అచ్చిరాలేదు. ఇక్కడ 8 టీ20లు ఆడగా 5 మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది. 2007 టీ20 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్, 2016లో ఇంగ్లండ్‌పై ఒక మ్యాచ్ గెలిచింది. అయితే ప్రస్తుత తరుణంలో కొత్తవారితో ఒక జట్టుగా స్థిరపడ్డ దక్షిణాఫ్రికా ఏమైనా చేయగలదు.

జట్లు :

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్య, యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ కుమార్, జయదేవ్ ఉనద్కత్, శార్దూల్ ఠాకూర్

దక్షిణాఫ్రికా: జేపీ డుమిని (కెప్టెన్), బెహార్డిన్, జూనియర్ డాలా, రీజా హెండ్రిక్స్, క్రిస్టియాన్, హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్, క్రిస్ మోరిస్, డేన్ ప్యాటర్‌సన్, ఆరోన్ ఫాంగిసో, ఫెలుక్‌వాయో, షంషి, జేజే స్మట్స్

కంగారూల జోరు షురూ..!



కేప్‌టౌన్: భారత్-దక్షిణాఫ్రికాల మధ్య శనివారం జరగనున్న మూడో టీ20తో సఫారీ గడ్డపై భారత్ టూర్ ముగుస్తుంది. ఇప్పటికే 5-1తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ శనివారం జరగనున్న చివరి టీ20ను ఎలాగైనా దక్కించుకోవాలని ఆశిస్తోంది. రెండో టీ20లో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన మాజీ సారథి ధోని కూడా ఫామ్‌లోకి రావడం భారత్‌కు కలిసొచ్చే అంశం. రెండో టీ20లో వర్షం కారణంగా పిచ్ భారత బౌలర్లకు ప్రతికూలంగా మారడంతో టీ20 సిరీస్ విజయం కోసం భారత్ మూడో మ్యాచ్ వరకూ ఆగాల్సి వచ్చింది. మరోవైపు మూడు టీ20ల సిరీస్‌ను 1-1తో సమం చేసిన సఫారీ జట్టు చివరి టీ20ను గెలిచి మార్చి 1నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న సిరీస్‌కు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని తహతహలాడుతోంది. దీనికి తోడు అంతకుముందే ఆస్ట్రేలియా సిరీస్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ టీ20 సిరీస్‌లో ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతి నిచ్చిన సంగతి తెలిసిందే.

ఫామ్‌లో కమిన్స్, హేజిల్‌వుడ్..

మరోవైపు ఆసీస్ జట్టు కూడా మార్చి 1 నుంచి ఏప్రిల్ 3 వరకూ జరగనున్న నాలుగు టెస్టల సిరీస్ కోసం ఇప్పటికే దక్షిణాఫ్రికా చేరుకుంది. ఫిబ్రవరి 22 నుంచి సౌతాఫ్రికా-ఎ జట్టుతో వార్మప్ మ్యాచ్‌ను కూడా ఘనంగా ఆరంభించింది. విల్లోమూరే పార్కులో గురువారం నుంచి ప్రారంభమైన మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో ఆసీస్ బౌలర్లు చెలరేగి ఆడుతున్నారు. ఫాస్ట్ బౌలర్లు పాట్ కమిన్స్, హేజిల్‌వుడ్ తొలిరోజే ఏడు వికెట్లు పడగొట్టి సఫారీ వాతావరణానికి అలవాటు పడుతున్నారు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా-ఎ 220 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా మూడు వికెట్లు కోల్పోయి 87పరుగులు చేసింది.

కెన్యా క్రికెట్ బోర్డులో ముసలం



కెన్యా: క్రికెట్ బోర్డులో ముసలం చెలరేగింది. వరల్డ్ క్రికెట్ లీగ్ డివిజన్ 2లో కెన్యా క్రికెట్ జట్టు ఘోర ప్రదర్శన కనపరిచింది. దీంతో ఓటమికి బాధ్యత వహిస్తూ కెప్టెన్ రాకెప్ పటేల్ కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. కాగా, అతని అడుగుజాడల్లోనే తాత్కాలిక కోచ్ థామస్ ఓడియో కూడా పదవి నుంచి తప్పుకున్నారు. అంతేకాకుండా కెన్యా క్రికెట్ బోర్డులో ప్రెసిడెంట్ జాకీ జాన్ మహ్మద్ బాధ్యతల నుంచి వైదొలిగారు. నమీబియాలో జరిగిన ప్రపంచకప్ లీగ్ డివిజన్-2 టోర్నమెంట్‌లో కనీసం ఒక్క మ్యాచ్‌లోనైనా కెన్యా విజయం సాధించలేకపోయింది. ఈ టోర్నీలో పాల్గొన్న ఆరు జట్లలో కెన్య చివరి స్థానంలో నిలిచింది. ఈ ఘోర పరాజయానికి నైతిక బాధ్యతగా తొలుత కెప్టెన్ రాకెప్ పటేల్ తన పదవికి రాజీనామా చేశాడు. ఆపై కోచ్ థామస్ ఓడియో కూడా తన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. కాగా, ప్రపంచ క్రికెట్‌లో ఒక క్రికెట్ బోర్డుకు తొలిసారి మహిళా అధ్యక్షురాలిగా సేవలందిస్తున్న కెన్యా బోర్డు ప్రెసిడెంట్ జాకీ జాన్ మహ్మద్ సైతం నైతిక బాధ్యతగా వీడ్కోలు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే సరైన గుర్తింపు, ఆదరణ లేకపోవడంతో పాటు ఆర్థికంగానూ కెన్యా క్రికెట్ బోర్డు ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి పరిస్థితిలో ఈ మూకుమ్మడి రాజీనామాలతో స్థానిక క్రికెట్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. త్వరలోనే అధ్యక్ష పదవి కోసం కెన్యా బోర్డు ఎన్నికలు నిర్వహించనుంది.

ఇక హర్మన్‌సేన వంతు..!



కేప్‌టౌన్: పురుషుల జట్టుకు ఏ మాత్రం తీసిపోకుండా సఫారీ గడ్డపై భారత మహిళల జట్టు రాణిస్తోంది. ఇప్పటికే మిథాలీ రాజ్ నేతృత్వంలోని మహిళల జట్టు పరిమిత ఓవర్ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకోగా, పొట్టి ఫార్మాట్‌లోనూ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సిరీస్‌ను కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. మూడో టీ20 మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో ఓడిపోవడం, నాలుగో టీ20లో వరుణుడు అడ్డుపడటంతో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత మహిళల జట్టు కైవసం చేసుకోవాలంటే కేప్‌టౌన్‌లో శనివారం జరగనున్న మ్యాచ్‌ను గెలవాల్సిందే!

గెలిస్తే వీరిది కూడా చరిత్రే..

దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో శనివారం జరగనున్న ఆఖరి టీ20లో భారత జట్టు గెలిస్తే అరుదైన రికార్డును కైవసం చేసుకునే అవకాశం ఉంటుంది. సఫారీ గడ్డపై ఒకేసారి రెండు సిరీస్‌లు గెలుచుకున్న జట్టుగా రికార్డులకెక్కు తుంది. భారత మహిళల్లో వన్డే సారథి మిథాలీరాజ్ తొలి రెండు టీ20ల్లో 54, 76 పరుగులు సాధించింది. కానీ, మూడో మ్యాచ్‌లో మాత్రం డకౌట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. ఇక ఓపెనర్ శ్రుతి మంథాన కూడా మెరుగ్గానే రాణిస్తోంది. ఇప్పటికే మూడు మ్యాచ్‌లలో వరుసగా 28, 57, 37 పరుగులు సాధించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్, మరో బ్యాట్స్ ఉమెన్ వి.కృష్ణమూర్తి కూడా మెరు గ్గానే రాణిస్తుండటంతో అదే జోరు చివరి మ్యాచ్‌లోనూ కొనసాగిస్తే తప్పక విజయం సాధించవచ్చు. మరోవైపు స్పిన్నర్ అనూజ పాటిల్, పూనమ్ యాదవ్, పూజా వస్త్రాకర్‌లు కూడా చక్కగా ఆడుతున్నారు. వెటరన్ బౌలర్ జులన్ గోస్వామి స్థానంలో జట్టులోకి వచ్చిన 18ఏళ్ల పూజా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇక పేస్‌బౌలర్ ఇస్మాయిల్ టీ20 కెరీర్‌లో తొలిసారిగా ఐదు వికెట్లు తీసి అరుదైన ఘనత సాధించింది. ఇక చివరి టీ20లోనూ సమష్టిగా రాణిస్తే వారి గెలుపును నిలువరించడం సౌతాఫ్రికాకు సాధ్యం కాదు.

సీపీఐకి చిత్తూరు జిల్లా సమితి విరాళం

విశాలాంధ్ర - చిత్తూరు: భారతకమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) జాతీయ, రాష్ట్ర సమితులకు పార్టీ చిత్తూరు జిల్లా 22వ మహాసభల సందర్భంగా ఆహ్వాన సంఘం తరపున విరాళం అందజేశారు. మూడు రోజులపాటు ఇక్కడ జరిగిన మహాసభలు శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆహ్వాన సం ఘం ప్రధాన కార్యదర్శి నాగరాజన్ పార్టీ జాతీయ సమితికి రూ.5వేలు, రాష్ట్ర సమితికి రూ.10వేలు విరాళంగా పార్టీ జాతీయ కార్యదర్శి కె. నారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామానాయుడు, కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, నదియ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మహాసభల సందర్భంగా విరాళం ప్రకటిస్తున్న ఆహ్వానసంఘం కార్యదర్శి నాగరాజన్

రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

▶ 16 రాష్ట్రాల్లో 58 స్థానాలకు మార్చి 23న ▶ ఏపీ, తెలంగాణల్లో మూడేసి స్థానాలకు

న్యూఢిల్లీ: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. 16 రాష్ట్రాల్లో 58 స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఈసీ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఎగువ సభలోని ఈ 58 మంది సభ్యుల పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ముగియనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ముగ్గురేసి చొప్పున మొత్తం ఆరుగురి సభ్యుల పదవీ కాలం త్వరలోనే ముగియనుంది. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 10 స్థానాలు ఖాళీ అవుతున్నాయి. కాగా బీహార్‌లో ఆరు స్థానాలకు, చత్తీస్ గడ్‌లో ఒకటి, గుజరాత్‌లో నాలుగు, హర్యానా ఒకటి, హిమాచల్ ప్రదేశ్ ఒకటి, కర్ణాటకలో నాలుగు, మధ్య ప్రదేశ్‌లో 5, మహారాష్ట్రలో 6, ఉత్తరా ఖండ్ ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో ఐదు, ఒడిశాలో మూడు, రాజస్థాన్‌లో మూడు, జార్ఖండ్‌లో 2 స్థానాలకు ఎన్ని కలు జరుగుతాయి. ఈ స్థానాలను భర్తీ చేయడానికి మార్చి 23న ఓటింగ్ నిర్వ హించనున్నారు. అదే రోజున ఓట్ల లెక్కింపు జరగనుంది. మార్చి 5న ఇం దుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. మార్చి 12 వరకూ దరఖాస్తులను స్వీకరిస్తారు. మరుసటి రోజు దరఖాస్తులను పరిశీ లిస్తారు. మార్చి 15లోగా దరఖాస్తులను ఉపసంహరించుకునే వీలుంది. పదవీ కాలం ముగిసిన 58 స్థానాలతో పాటు గత ఏడాది రాజ్యసభ సభ్యత్వా నికి రాజీనామా చేసిన కేరళ ఎంపీ వీరేంద్ర కుమార్ స్థానానికి కూడా ఎన్ని కలు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి చిరంజీవి, రేణుకా చౌదరి, దేవేందర్ గౌడ్, తెలంగాణ నుంచి సీఎం రమేష్, రాపోలు ఆనంద భాస్కర్, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి (ఇది వరకే చనిపోయారు)ల పదవీ కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. పోలింగ్‌లో పాల్గొనే ఓటర్లు రిటర్నింగ్ ఆఫీసర్ సూచించిన ఊదారంగు స్కెచ్‌పెన్‌ను వాడాలి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.